ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ

సంపుటి 29, సంచిక: 81 | బుధవారం | 09-09-2026 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

## ఆ ఎమ్మెల్సీలు అరెస్టు

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత, అసభ్య వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌ను, బి. నవీన్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. తాతా మధును న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన నివాసం నుంచి, నవీన్‌కుమార్‌రెడ్డిని కోకాపేటలోని ఆయన నివాసం నుంచి పోలీసులు తీసుకెళ్లారు. అనంతరం విచారణ నిమిత్తం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.స్పీకర్ ఒఎస్‌డి పొల్లేపల్లి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాతా మధుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డి


# సస్పెన్షన్



- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల పర్యావసానం
- ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు అసెంబ్లీ తీర్మానం
- దళితులకు అవమానాలు, పోరాటాలు కొత్తకాదు : మంత్రి దామోదర్ రాజ నర్సింహా

**వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు శాసనమండలి నుంచి ఆ ఇద్దరు బిఆర్‌ఎస్ సభ్యులను సస్పెండ్ చేస్తున్నట్లు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటన**

ప్రజాపక్షం/హైదరాబాద్



శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు, అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల నేపథ్యంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని శాసనమండలి వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. ఎమ్మెల్సీ తాతా మధు, నవీన్‌కుమార్ రెడ్డిని వ్యాఖ్యలపై శాసనసభ చర్చించి బాధ్యులైన ఎమ్మెల్సీలపై కఠిన చర్యలు తీ సుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి చైర్మన్ కు పంపించింది. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం తిరిగి సమావేశమైన శాసనమండలిలో శాసనసభా వ్యహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ శాసనసభ తీర్మానం మేరకు స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్‌ఎస్ సభ్యులు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి ని సభ నుంచి సస్పెండ్ చేయాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాన్ని ఆమోదిస్తూ సభ్యులు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలను ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు సభ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. అంతకు ముందు కాంగ్రెస్ సభ్యులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్‌ఎస్ సభ్యులు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి సభలో కూర్చోడానికి అర్హతలేదని, వెంటనే వారిని సభ నుంచి సస్పెన్షన్ చేయాలని కోరారు. స్పీకర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలు, సభా నిబంధనల ఉల్లంఘన, అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న పరిణామాలను ప్రభు త్వం తీవ్రం గా పరిగణించింది. ఇందుకు బిఆర్‌ఎస్ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం చైర్మన్ సభను బుధవారానికి వాయిదా వేశారు.

### మధు, నవీన్ రెడ్డిపై చర్యలకు అసెంబ్లీ తీర్మానం

శాసనమండలి సభా హక్కులు, సభా విధానాలు, క్రమశిక్షణకు సంబంధించిన నిబంధనలకు అనుగుణంగా ఎమ్మెల్సీలు తాతా మధుసూదన్, ఎన్.నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి చైర్మన్ తదుపరి చర్యలు తీసుకోవాలని శాసనసభ తీర్మానించింది. బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు మధుసూదన్, నవీన్ కుమార్ రెడ్డి ఈనెల 7వ తేదీన శాసనసభ ప్రాంగణంలోని గేట్ నంబర్ 3 సమీపంలో శాసన సభాపతిని ఉద్దేశించి అత్యంత అవమానకరంగా, కించపరిచేలా చేసిన దూషణలను ఈ సభ తీవ్రంగా ఖండిస్తుంది. ఈమేరకు మంగళవారం సాయంత్రం శాసనసభలో మంత్రి సి.దామోదర రాజనర్సింహ తీర్మానం ప్రవేశపెట్టగా, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బలపర్చగా, కాంగ్రెస్, ఎంఐఎం, సిపిఐ బలపరచడంతో సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. బిజెపి తరువాయి 8లో

## 'నా తల్లిని అన్నారు.. నీ తల్లిని కాదు'

**హరీశ్ రావుపై స్పీకర్ గడ్డం ఆగ్రహం**



తెలంగాణ శాసనసభ రెండో రోజు సమావేశాలు తీవ్ర ఉద్రిక్తతల మధ్య ప్రారంభమయ్యాయి. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు, అసెంబ్లీ ఆవరణలో బిఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలు రెండో రోజు కూడా సభలో దుమారం రేపాయి. సభ మంగళవారం ఉదయం సమావేశం కాగానే అసెంబ్లీ తరువాయి 8లో

## వ్యక్తికి కాదు... మొత్తం చట్టసభకు

# ఘోర అవమానం



- బిఆర్‌ఎస్ సభ్యుల వ్యాఖ్యలు, ప్రవర్తన యావత్ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆవేదన

ప్రజాపక్షం/హైదరాబాద్:

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల బిఆర్‌ఎస్ సభ్యులు చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తించిన తీరు యావత్ ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని, ఇది కేవలం ఒక వ్యక్తికి జరిగిన అవమానం కాదని,మొత్తం చట్టసభకు జరిగిన ఘోర అవమానమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. స్పీకర్ పట్ల అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసినందుకు బిఆర్‌ఎస్ పశ్చాత్తాపం వ్యక్తం చేయకపోగా, హరీశ్‌రావు స్పీకర్‌తో సంవాదానికి దిగారని, మార్షల్స్ లేకపోతే స్పీకర్ వద్దకు వెళ్ళి ఏం చేసేవారో అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంపై, తెలంగాణ ఆత్మగౌరవంపై, సామాజిక సమానత్వంపై దాడి చేసే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విచ్ఛిన్నకర శక్తులను, అవమానాలకు పాల్పడే, ఆత్మగౌరవంపై దాడి చేసే బిఆర్‌ఎస్‌ను శాసనసభలో, రాష్ట్రంలోని ప్రతి గ్రామంలోనూ ప్రజలు దూరంగా ఉంచాల్సిన అవసరం ఉందని కోరారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలపై సభ హక్కుల ప్రకారం చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో మంగళవారం ప్రతిపాదించిన తీర్మానాన్ని బలపరుస్తూ భట్టి విక్రమార్క మాట్లాడారు. బిఆర్‌ఎస్ తమ పాత భూస్వామ్య, ఫ్యూడల్ మనస్తత్వాన్ని మర్చిపోలేదనడానికి ఈ సంఘటనే సజీవ నిదర్శనమన్నారు. అధికారం తరువాయి 8లో

## అసెంబ్లీలో బూతుల సంస్కృతికి

# చరమగీతం పాడాలి

- చొక్కాలు విప్పి ఘర్షణలకు దిగడం శాసనసభ గౌరవాన్ని దెబ్బతీస్తుంది
- సిపిఐ పక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు
- 'లా మేకర్స్ కాస్తా లా బ్రేకర్స్‌గా మారుతున్నారు' అని ఆవేదన



ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభలో వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలం, మహిళలను కించపరిచే వ్యాఖ్యలు, బూతుల సంస్కృతికి చరమగీతం పాడాలని సిపిఐ శాసనసభాపక్ష నాయకులు కూనంనేని సాంబశివరావు కోరారు. సభలో చోటుచేసుకున్న ఘటనలు తీవ్రంగా బాధించాయని, ఇలాంటి ఘటనలు తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో పరాకాష్టకు చేరాయని అన్నారు. వ్యకిని, వ్యక్తిత్వ హననానికి పాల్పడడానికి ఎవరికీ హక్కులేదన్నారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అసభ్య వ్యాఖ్యలకు సంబంధించి మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో కూనంనేని సాంబశివరావు తరువాయి 8లో

## తెలంగాణ తల్లులందరికీ కెసిఆర్ క్షమాపణ చెప్పాలి

అక్బరుద్దీన్ ఒవైసి



ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలపైన ఆ పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ స్పీకర్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర తల్లులందరికీ క్షమాపణ చెప్పాలని సూచించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన పోలీసులపైన కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. తాను కూడా ఆవేశంలో నోరు జారినప్పుడు క్షమాపణ చెప్పానని, తన వల్ల ఎక్కడైనా తప్పు జరిగితే క్షమాపణ కోరుతానని,తాను క్షమాపణ చెప్పినంత మాత్రాన చిన్నతనం కాదని అక్బరుద్దీన్ తెలిపారు. కాగా '22ఎ అంశంపైన చర్చించేందుకు ప్రభుత్వం నుంచి స్పష్టత ఇవ్వడం లేదంటూ బిజెఎల్‌పి సభ నుంచి వాకౌట్ చేసింది.

## మండలి చైర్మన్ ఛాంబర్ ముందు

# బిఆర్‌ఎస్ ధర్నా

- అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మళ్లీ ఉద్రిక్తత
- తాతా మధును అడ్డుకున్న మార్షల్స్.. బిఆర్‌ఎస్ సభ్యులతో తోపులాట



ప్రజాపక్షం/హైదరాబాద్

శాసన సభ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలను శాసన మండల చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ చేయడాన్ని నిరసిస్తూ బిఆర్‌ఎస్ సభ్యులు చైర్మన్ ఛాంబర్ ఎదుట ధర్నాకు బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమను అన్యాయంగా సస్పెన్షన్ చేశారని వారు పేర్కొన్నారు. దీంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మార్షల్స్ కలుగచేసుకుని వారిని బయటికి పంపించివేశారు. అక్కడి నుంచి బిఆర్‌ఎస్ సభ్యులు తాతామధు, నవీన్‌కుమార్‌రెడ్డి, తరువాయి 8లో

## మహిళా ఎమ్మెల్యేల పట్ల

# పోలీసుల దురుసు ప్రవర్తన

- మాకు స్పీకర్‌పై పూర్తి గౌరవం ఉంది : హరీశ్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్



అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు సబితా ఇంద్రారెడ్డి గొంతు పిసికారని, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని బిఆర్‌ఎస్ సభ్యుడు హరీశ్ రావు ఆవేదన వ్య క్తం చేశారు. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. బాధ్యులపై ఇప్పటి వరకు చర్యలు తరువాయి 12లో

# కెసిఆర్ ఫామ్‌హౌస్ ముట్టడి

- క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ డప్పులతో కాంగ్రెస్ నిరసన
- తీవ్ర ఉద్రిక్తత, నాయకుల అరెస్టు
- బారీకేడ్లు తొలగిస్తూ చొచ్చుకెళ్ళేందుకు యత్నించిన డిసిసి అధ్యక్షుడు అంక్షారెడ్డి
- మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



ప్రజాపక్షం/గజ్వేల్

అసెంబ్లీ వద్ద జరిగిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం సిద్దిపేట డిసిసి అధ్యక్షులు తూంకుంట అంక్షారెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో ఎర్రవల్లిలోని కెసిఆర్ ఫాంహౌజ్‌ను ఆ పార్టీ శ్రేణు లు డప్పు చప్పులతో ముట్టడించారు. పోలీసులు ఏర్పాటు చేసిన భారీ కేడ్లను తొలగించే ప్రయత్నం చేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కెసిఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు వారిని అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డికి తీవ్ర గాయాలు కాగా, తరువాయి 8లో






# ఉద్యోగాలపై హామీలు ఏమయ్యాయి?

- నిరుద్యోగ సమస్యను పట్టించుకోరా?
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ధ్వజం
- 12 ఏళ్ల మోదీ పాలనలో యువతకు దక్కిందేమిటి?
- ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు రోషన్ కుమార్ సిన్హా
- యాదగిరిగుట్టలో ఘనంగా ప్రారంభమైన ఎఐవైఎఫ్ రాష్ట్ర 3వ మహాసభలు
- లక్ష్మీ నర్సింహ ఫంక్షన్ హాల్ నుండి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ

ప్రజాపక్షం/ యాదాద్రి / యాదగిరిగుట్ట

దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. అధికారంలోకి వస్తే ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం ఆ హామీని నెరవేర్చకపోగా, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. ఎఐవైఎఫ్ 3వ రాష్ట్ర మహాసభల మంగళవారం ప్రారంభమయ్యాయి. యాదగిరిగుట్ట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్వహించిన భారీ బహిరంగ సభలో నెల్లికంటి సత్యం మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో త్యాగాలు, పోరాటాలు చేశారని, తరువాయి 12లో

# ఫిలిప్పీన్స్‌కు తెలంగాణ బియ్యం

కొనుగోలుకు చేసేందుకు ఆ దేశ ప్రభుత్వం ఆసక్తి చూపుతోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ నుంచి పెద్ద మొత్తంలో నాణ్యమైన బియ్యం కొనుగోలు చేసే ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ఆసక్తి చూపిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీలో మంత్రి ఉత్తమ్ కుమారరెడ్డి ఫిలిప్పీన్స్ వ్యవసాయశాఖ కార్యదర్శి, ఆ దేశ క్యాబినెట్ సభ్యుడు ఫ్రాన్సిస్కో పి.టు లారెల్ జూనియర్‌తో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో భారీ స్థాయిలో వరి సాగు జరుగుతోందని, పెద్ద మొత్తంలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయగల ఉత్పత్తి తరువాయి 12లో

# పోలీసు ఉద్యోగాల దరఖాస్తు గడువు పొడిగింపు

**సెప్టెంబర్ 16 వరకు అవకాశం.. 7,437 పోస్టులకు నియామకాలు**

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో పోలీసు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు పోలీసు నియామక బోర్డు (టిఎస్‌ఎల్‌పిఆర్‌బి) మరో అవకాశం కల్పించింది. వివిధ శాఖల్లో 7,437 ఉద్యోగాల భర్తీకి చేపట్టిన నియామక ప్రక్రియలో ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును సెప్టెంబర్ 16 వరకు పొడిగించింది. ఈ మేరకు బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు మంగళవారం అధికారిక ప్రకటన వి డుదల చేశారు. అభ్యర్థులు సెప్టెంబర్ 16, 2026 బుధవారం సాయంత్రం 5 గంటల వర కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపా రు. పోలీసు, ఎస్‌పిఎఫ్, ఫైర్, విపత్తు నిర్వహణ, సివిల్ డిఫెన్స్, ప్రిజన్స్ శాఖల్లో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి తరువాయి 8లో

# దేశ రాజధానిలో భద్రత ఎక్కడ?

దేశ రాజధాని అంటే కేవలం ప్రభుత్వ భవనాలు, పార్లమెంటు, రాయబార కార్యాలయాలు, అధికార కేంద్రాలు ఉన్న నగరం కాదు. దేశంలోని ప్రతి పౌరుడు తాను సురక్షితంగా జీవించగలిగే నగరంగా కూడా దానికి ఒక ప్రత్యేకమైన ప్రతీకాత్మక విలువ ఉంటుంది. అందుకే ఢిల్లీలో జరిగే ఒక హత్య, ఒక సామూహిక దాడి, ఒక మహిళపై దాడి, ఒక విద్యార్థిపై హింస వంటి ఘటనలను సాధారణ నేరాలుగా చూడడానికి వీల్లేదు. అవి రాజధాని నగరంలోని శాంతిభద్రతల స్థితిని ప్రశ్నించే సంఘటనలు. తన ఇంటి బయట కొందరు వ్యక్తులు పెద్దగా అరుస్తూ, మద్యం సేవిస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారని అభ్యంతరం చెప్పడమే మణిపూర్ రాష్ట్రానికి చెందిన 54 ఏళ్ల సంగీతకారుడు విక్రమ్ సింగ్ ప్రాణాలను బలిగొన్న దారుణ ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పోలీసుల ప్రాథమిక వివరాల ప్రకారం, కిలోకరిలోని తన నివాసం నుంచి బయటకు వచ్చిన ఆయనపై కొందరు డెలివరీ కార్మికులు, ధాబా సిబ్బంది దాడి చేశారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రికి చేరిన ఆయన మరణించారు. ఈ కేసులో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి, ఒక బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. ఒక పౌరుడు తన ఇంటి బయట జరుగుతున్న శబ్దం, మద్యం సేవించడం, అల్లరిపై అభ్యంతరం చెప్పడం సహజమైన ప్రతిస్పందన. దానికి సమాధానం వాగ్వాదం కావచ్చు, పోలీసులకు ఫిర్యాదు కావచ్చు. కానీ సమూహంగా దాడిచేసి ఒక మనిషి ప్రాణం తీసే స్థాయికి హింస చేరితే అది వ్యక్తిగత గొడవ పరిధిని దాటుతుంది. సమాజంలో చట్టం పట్ల ఉన్న గౌరవం ఎంతవరకు క్షీణించిందన్న ప్రశ్నను అది ముందుకు తెస్తుంది. ఢిల్లీని క్రైమ్ క్యాపిటల్‌గా అభివర్ణిస్తూ కేంద్ర హోంశాఖ, ఢిల్లీ పోలీసుల పనితీరుపై కాంగ్రెస్ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించాలి. ఇక్కడ కాంగ్రెస్ వ్యాఖ్యలను రాజకీయ కోణంలో చూడడానికి వీల్లేదు. దేశ రాజధానిలో సాధారణ పౌరుడికి తన ఇంటి ముందు కూడా భద్రత లేదా? అనే ప్రశ్నపై చర్చ జరిగి తీరాలి. ఢిల్లీ నగరంలో నేరాలు, మహిళల భద్రత, మాదకద్రవ్యాలు, వీధి హింస, దోపిడీలు, వాహన నేరాలు, అక్రమ నిర్మాణాలు, సామూహిక ఘర్షణలు, ఆన్లైన్ మోసాలు వంటి అనేక సమస్యలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. నేరం జరిగిన వెంటనే పోలీసులు స్పందించాలి. కానీ ఆధునిక నగర పోలీసింగ్ అంటే కేవలం ఘటన జరిగిన తర్వాత నిందితుడిని పట్టుకోవడం కాదు. నేరం జరగకుండా నిరోధించడం, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించడం, స్థానిక ప్రజలతో నిరంతర సంబంధం కలిగి ఉండటం, నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, ఫిర్యాదులపై వేగంగా స్పందించడం కూడా దాని బాధ్యత. దేశ రాజధానిలో ఈ బాధ్యత మరింత పెద్దది. ఢిల్లీ పోలీసుల పరిపాలనా నియంత్రణ సాధారణంగా రాష్ట్ర పోలీసుల మాదిరిగా పూర్తిగా ఢిల్లీ ప్రభుత్వ పరిధిలో ఉండదు. కేంద్ర హోంశాఖకు ఢిల్లీ పోలీసులపై కీలకమైన పరిపాలనా బాధ్యత ఉంది. అందువల్ల శాంతిభద్రతలపై జరిగే చర్చ రాజకీయ ఆరోపణలకే పరిమితం కాకుండా సంస్థాగత జవాబుదారీతనం వరకు వెళ్లాలి. పోలీసుల వద్ద సిబ్బంది సరిపోతున్నారా? రాత్రి వేళల్లో గస్తీ ఎంత ప్రభావవంతంగా ఉంది? ఫిర్యాదులపై స్పందన సమయం ఎంత? అత్యంత కీలక ప్రాంతాల్లో స్థానిక నిఘా ఎలా ఉంది? పాత నేరస్తులపై పర్యవేక్షణ ఎలా జరుగుతోంది? ఈ ప్రశ్నలకు సమాధానాలు అవసరం. ఇక్కడ మరో ముఖ్యమైన అంశం ఢిల్లీలోని వలస జనాభా. దేశంలోని దాదాపు ప్రతి రాష్ట్రం నుంచి ప్రజలు విద్య, ఉద్యోగం, వ్యాపారం కోసం రాజధానికి వస్తారు. ఈ నగరం అనేక భాషలు, సంస్కృతులు, సామాజిక నేపథ్యాల ప్రజలకు నిలయం. అదే సమయంలో వివక్ష కూడా రోజురోజుకూ పెరుగుతున్నది. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు ఢిల్లీలో తమ కు వివక్ష ఎదురవుతోందని అనేక సందర్భాల్లో చెబుతూ వచ్చారు. విక్రమ్ సింగ్ మణిపూర్‌కు చెందిన వ్యక్తి కావడం వల్ల ఈ అంశం ప్రాంతీయ కోణాన్ని సైతం ఆవిష్కరిస్తున్నది. అయితే ప్రతి నేరాన్ని వెంటనే ప్రాంతీయ లేదా జాతి వివక్షతో అనుసంధానించడం కూడా సరికాదు. దర్యాప్తు పూర్తయ్యే వరకూ ఉద్దేశాన్ని ఊహించకూడదు. కానీ ఒక వ్యక్తి తన భాష, ప్రాంతం, రూపం, సామాజిక నేపథ్యం కారణంగా అవమానం లేదా హింస ఎదుర్కొనే అవకాశం ఉందనే భయం కూడా నగర భద్రతలో భాగమే. ఢిల్లీలో నివసించే ఈశాన్య భారతీయులు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, మహిళలు, విద్యార్థులు వంటి వర్గాలు పోలీసులపై విశ్వాసంతో ఫిర్యాదు చేయగల వాతావరణం ఉండాలి. చట్టం అందరికీ సమానంగా పనిచేస్తుందన్న నమ్మకం ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైన అంశం. ఒక పౌరుడు నేరానికి గురైన తర్వాత న్యాయం పొందుతాడన్న విశ్వాసం ఉంటే చట్టబద్ధమైన మార్గాలను ఆశ్రయిస్తాడు. కానీ పోలీసులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం ఉండదనే భావన పెరిగితే ప్రజలు తమ చేతుల్లోకే న్యాయం తీసుకునే ప్రమాదం పెరుగుతుంది. విక్రమ్ సింగ్ ఘటనలో కనిపించిన మూక హింస ఇదే కారణంగా మరింత కలవర పెడుతోంది. ఇలాంటి ఘటనలను తేలికగా చూడకూడదు. వ్యక్తుల మధ్య గొడవలో ఒకరు మరొకరిపై దాడి చేయడం ఒక రకమైన నేరం. పలువురు కలిసి ఒక వ్యక్తిని చుట్టుముట్టి కొట్టడం మరోస్థాయి ప్రమాదం. గుంపులో వ్యక్తిగత బాధ్యత మసకబారుతుంది. అందరూ కొట్టారు అనే పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి హింసను ప్రారంభ దశలోనే పోలీసులు అడ్డుకోవాలి.

నేరం జరిగిన తర్వాత కొంతమంది అధికారులను సస్పెండ్ చేయడం కంటే, ముందే ప్రమాదాన్ని గుర్తించి చర్యలు తీసుకునే సంస్థాగత సంస్కృతి నెలకొనడం అవసరం. ఒక ప్రాంతంలో తరచూ గొడవలు జరుగుతున్నాయంటే దానికి కారణాలను గుర్తించాలి. ఒక ప్రాంతంలో మహిళలు పదేపదే ఫిర్యాదు చేస్తున్నారంటే అక్కడ భద్రతా ఏర్పాట్లు మార్చాలి. విద్యార్థులు లేదా వలస కార్మికులు నిర్దిష్ట ప్రాంతాల్లో అసురక్షితంగా భావిస్తే వారి ఫిర్యాదులను ప్రత్యేకంగా పరిగణించాలి. నేరాల గణాంకాలు సైతం రాజకీయ నినాదాలుగా మారకుండా, విధాన నిర్ణయాలకు ఉపయోగపడాలి. ఏ నేరం పెరుగుతోంది? ఏ ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతోంది? బాధితుల వయస్సు, లింగం, సామాజిక నేపథ్యం ఏమిటి? కేసుల దర్యాప్తు ఎంతకాలం పడుతోంది? శిక్షలు ఎన్ని వస్తున్నాయి? ఫిర్యాదులలో ఎంత శాతం కేసులుగా నమోదవు తున్నాయి? ఈ సమాచారం ఆధారంగా పోలీసింగ్ వ్యూహాన్ని మార్చాలి. అప్పుడు దేశ రాజధానిలో భద్రతపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. రాజకీయ నాయకుల నుంచి అధికారుల వరకు ప్రతి ఒక్కరూ ఘటనలు జరిగిన తర్వాత ఇచ్చే హామీలు మాటల్లో కాకుండా, ప్రతి పోలీస్ స్టేషన్లో, ప్రతి వీధిలో, ప్రతి రాత్రి గస్తీలో, ప్రతి ఫిర్యాదుపై స్పందనలో కనిపించాలి.అదే ఢిల్లీ నిజమైన రాజధాని గౌరవాన్ని కాపాడే మార్గం. ●



## భారత్-చైనా సైన్యాలు.. తొలి ఉన్నత స్థాయి కమాండర్స్ ఫ్లాగ్ చర్చలు

**భారత్, చైనా సైన్యాలు ఈ వారం అరుణాచల్ ప్రదేశ్ సెక్టార్‌లోని సరిహద్దుకు ఇరువైపులా రెండు విడతల్లో తమ తొలి ఉన్నత స్థాయి కమాండర్ల ఫ్లాగ్ చర్చలు జరిపాయి. గత నెల బీజింగ్‌లో జరిగిన ప్రత్యేక ప్రతినిధుల చర్చలలో కుదిరిన తీర్మానానికి అనుగుణంగా ఈ చర్చలు జరిగాయి. జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఎ) అజిత్ దోవల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో స్పెషల్ రిప్రజెంటేటివ్స్ (ఎస్ఆర్) చర్చలు జరిపారు. ఈ చర్యలు సరిహద్దుల నిర్ధారణ, సరిహద్దుల మధ్య సహకారాన్ని కొనసాగించడం, అలాగే, వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఏసి) వెంబడి శాంతిని కాపాడటంపై దృష్టిని సారించాయి.** ●

– విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఇఎ) అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్



## తెలంగాణ పొద్దు పొడుపు మన కాళోజీ

దేశ భాషల్లో తెలుగు భాష కడు తియ్యన. తెలుగు భాషలో ప్రాంతీయ మట్టి వాసనలు, శ్రమజీవుల ఆత్మీయ కలయికతో పలు రకాల యాసలు పుట్టుకొచ్చాయి. తెలంగాణ ప్రాంతం శతాబ్దాలుగా పలు రాచరిక పాలనలు, ముఖ్యంగా నిజాం పాలనతో ఇక్కడి ప్రజల తెలుగు భాషలో ఉర్దూ, హిందీ, పర్షియన్, కన్నడ, మరాఠీ పదాలు మిళితమై ఈ భాష విలక్షణ రూపం దాల్చడం విశేషం. తెలంగాణ తెలుగు భాష, యాస, అందుకోని పలుకుబడులు ఇక్కడి జనుల జీవన విధానాలతో మమేకమై తియ్యదనాన్ని, అమాయకత్వాన్ని సంతరించుకున్నాయి. ఈ ప్రాంత ప్రజల సంస్కృతి, వారసత్వం, చారిత్రక వైభవం, పరాయి భాషా పదాల చేరికతో తెలంగాణ తెలుగుకు ప్రత్యేక సుగంధాలు అద్దబడ్డాయి.

**తెలంగాణ భాషా దినోత్సవం – 2026 :**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత ప్రముఖ తెలంగాణ ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతి సందర్భంగా ప్రతి ఏటా 09, సెప్టెంబర్ రోజున తెలంగాణ భాషా దినోత్సవం జరుపుకోవడం ఓ అద్భుత ఆచారంగా మారింది. కాళోజీ 100వ జయంతి సందర్భంగా 2014 నుంచి ఆయన జయంతి రోజు తెలంగాణ భాషా దినోత్సవం జరుపుకోవడం కొనసాగుతున్నది. గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో 29 ఆగష్టు రోజున తెలుగు భాషా దినోత్సవం నిర్వహిస్తున్నారని మనకు తెలుసు. తెలంగాణ పొద్దుపొడుపు కాళోజీ. తెలంగాణ తెలుగు భాష అస్తిత్వం నిలపడానికి కాళోజీ చేసిన కృషి మరువలేనిది. 09, సెప్టెంబర్ 1914 రోజు రంగారావు రామాబాయమ్మలకు కర్ణాటకలో జన్మించిన కాళోజీ నారాయణ రావు కుటుంబం వరంగల్ మడికొండలో స్థిరపడిన ఒక నడిచే తెలంగాణ తెలుగు నిఘంటువు. ఒక కవన శిల్పి. రాజకీయ చైతన్య ప్రజాకవి. నిర్భయంగా భాషతో వాతలు పెట్టిన ప్రజావాది. పుట్టుక, చావు నీది జీవితం అంతా దేశానిది అన్న తెలంగాణ ఉద్యమ కెరటం. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కలంతో గళమెత్తిన ధీరుడు. తెలంగాణ శ్రమజీవుల పక్షపాతి, మహా వైతాళికుడు మన కాళోజీ. స్వాతంత్ర్య సమరయోధుడు. తెలంగాణ ఉద్యమకారుడు.

**బహుభాషావేత్త ప్రజాకవి కాళోజీ :**

అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి. అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి అన్న కాళోజీ కలం అక్షరాలకు ఆవేశం పుట్టించిన తీరు అనన్యసామాన్యం. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం పొందిన బహుభాషావేత్త మన కాళోజీ. రాజకీయ వ్యంగ్య కవిత్వం, తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆచారవ్యవహారాలు, ఆగ్రహం, పరాయి పాలకుల వ్యతిరేకి అయిన కాళోజీ తన రచనలను ఆయుధాలుగా సాధించడంలో దిట్ట అని నిరూపించుకున్నారు. హైదరాబాద్, హన్మకొండల్లో చదివి ఉస్మానియా నుంచి న్యాయపట్టా పొందారు. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని జైలు పాలయ్యారు. 1940లో రుక్మిణీబాయిని వివాహం చేసుకున్నారు. పి.వి నర్సింహారావుతో సన్నిహిత సంబంధాలను కలిగి ఉన్నారు. నిజాం పాలన, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. తల్లి చనిపోయిన తర్వాత అన్న ఉర్దూ కవి కాళోజీ రామేశ్వరరావు పెంపకంలో ఎదిగారు. 1958లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఎన్నిక అయ్యారు.

**విశిష్ట పురస్కారాల సుగంధ మాల :**

సాహితీవేత్తగా కాళన్న చేసిన పలు రచనల్లో నా గొడవ, ఇదీ నా గొడవ, జీవన గీత, తుది విజయం మనది, తెలంగాణ ఉద్యమ కవితలు, బాపు బాపు బాపు, కాళోజీ కథలు లాంటివి ముఖ్యమైనవి. కాళోజీ నారాయణ రావు జీవితం తెలంగాణ ప్రజలకే అంకితం. ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా భారత ప్రభుత్వ పద్మ విభూషణ్(1992), తామ్రపత్రి పురస్కారం(1972), ఎపి ప్రభుత్వ అనువాద పురస్కారం (1969), బూర్గుల రామకృష్ణారావు మెమోరియల్ పురస్కారం (1981), తెలంగాణ ప్రజలకే ప్రేమగా ప్రజా కవి బిరుదు, పలు సాహితీ సంఘాల పురస్కారాలు, కాకతీయ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్(1992), రామినేని/గాడిచర్ల ఫౌండేషన్ అవార్డు, గురజాడ అవార్డు (1996), మద్రాస్ కళాసాగర్ పురస్కారం (1996) లాంటివి ఎన్నో కాళోజీ చేతుల్లోకి చేరి మురిసిపోయాయి.

'హింస తప్పు రాజ్య హింస మరీ తప్పు అంటూ సామాన్యుడే నా దేవుడు' అన్న కాళోజీ 13 నవంబర్ 2002 రోజు తుది శ్వాస విడిచారు. ఆయన అందించిన విశిష్ట సేవలకు ప్రతిగా ప్రభుత్వం వరంగల్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి కాళోజీ హెల్త్ యూనివర్సిటీ, హనుమకొండలో సమావేశ మందిరానికి కాళోజీ కళాక్షేత్రం అని పేరు పెట్టడం జరిగింది.

**(09 సెప్టెంబర్ తెలంగాణ భాషా దినోత్సవం శుభ సందర్భంగా)**


డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఎల్ నినోతో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం

యావత్ ప్రపంచాన్ని వణికిస్తున్న ఎల్ నినో తో ఆర్థిక వ్యవస్థ విధ్వంసం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎందుకంటే, దీని ప్రభావం కేవలం వ్యవసాయానికే పరిమితం కాదు. గ్రామీణ ఉపాధిపై, పశుసంపదపై, తాగునీటి లభ్యతపై, విద్యుత్ ఉత్పత్తిపై కూడా ప్రభావం ఉంటుంది. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గితే సాగు దెబ్బతింటుంది. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గుతుంది. విద్యుత్ కొరత పరిశ్రమల ఉత్పత్తిని ప్రభావితం చేస్తుంది. వ్యవసాయ దిగుబడులు తగ్గితే గ్రామీణ ఆదాయం తగ్గుతుంది. గ్రామీణ కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. దాని ప్రభావం తయారీ రంగం నుంచి సేవా రంగం వరకు విస్తరిస్తుంది. చివరికి ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. అందువల్ల వాతావరణ మార్పులను కేవలం పర్యావరణ సమస్యగా కాకుండా ఆర్థిక సమస్యగా కూడా చూడాల్సిన అవసరం ఏర్పడింది. భారత్ వంటి వ్యవసాయాధారిత దేశంలో ఆహార ద్రవ్యోల్బణం మొత్తం ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. సాధారణ కుటుంబం నెలవారీ ఖర్చులో అత్యధిక భాగం ఆహారానికే వెచ్చిస్తుంది. బియ్యం, పప్పులు, వంటనూనె, కూరగాయలు, పాలు, గుడ్లు, పండ్ల ధరలు పెరిగితే మధ్యతరగతి కుటుంబాలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటాయి. పేద కుటుంబాల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుంది. వారు ఇతర ఖర్చులను తగ్గించుకోవచ్చు కానీ, ఆహారాన్ని పూర్తిగా తగ్గించుకోలేరు. అందువల్ల ఆహార ద్రవ్యోల్బణం సామాజిక అసమానతలను మరింత పెంచుతుంది. రెపో రేటు స్థిరంగా ఉన్నా, ఆహార ధరలు పెరిగితే సామాన్యుడికి ఆ స్థిరత్వం వల్ల పెద్దగా ఉపయోగం ఉండదు. ఇక్కడే ద్రవ్య విధానం పరిమితులు స్పష్టంగా కనిపిస్తాయి. రిజర్వు బ్యాంకు తన వద్ద ఉన్న సాధనాలతో మార్కెట్‌లో నగదు లభ్యతను నియంత్రించగలదు. రుణాల ఖర్చును ప్రభావితం చేయగలదు. ద్రవ్యోల్బణ అంచనాలను నియంత్రించడానికి ప్రయత్నించగలదు. కానీ పంటలు పండించడం దాని చేతిలో లేదు. నిల్వ గిడ్డంగులు నిర్మించడం దాని బాధ్యత కాదు. రవాణా వ్యవస్థను మెరుగుపరచడం, వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం, చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, ఉపాధి కల్పించడం వంటి బాధ్యతలు ప్రభుత్వాలపై ఉంటాయి. అందువల్ల ద్రవ్య విధానం, ప్రభుత్వ ఆర్థిక విధానం పరస్పరం అనుసంధానమై పనిచేయకపోతే ఆశించిన ఫలితాలు రావు.

ఇదే సమయంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా మరో అనిశ్చిత దశలోకి అడుగుపెడుతోంది. అమెరికా, యూరప్, చైనా వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థల వృద్ధి మందగించడం, అంతర్జాతీయ వాణిజ్య విధానాలలో మార్పులు, భౌగోళిక ఉద్రిక్తతలు, చమురు ధరల అస్థిరత, సరఫరా గొలుసుల్లో అంతరాయాలు ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులపై ప్రభావం చూపుతున్నాయి. గతంలో కొవిడ్ మహమ్మారి ప్రపంచానికి ఒక పాఠం నేర్పింది. ప్రపంచీకరణ ఎంత బలంగా ఉన్నప్పటికీ, ఒక సంక్షోభం వచ్చినప్పుడు సరఫరా గొలుసులు ఎంత వేగంగా దెబ్బతింటాయో ప్రపంచం చూసింది. ఇప్పుడు అదే ప్రమాదం వాతావరణ మార్పులు, యుద్ధాలు, వాణిజ్య ఆంక్షల రూపంలో మళ్లీ కనిపిస్తోంది. అలాంటి పరిస్థితుల్లో భారతదేశం కేవలం వడ్డీ రేట్లపైనే ఆధారపడకుండా భవిష్యత్తు ఆర్థిక సవాళ్లకు ఇప్పటి నుంచే సిద్ధమవ్వాలి. ఇలాంటి పరిస్థితుల్లో భారతదేశం ముందున్న అతిపెద్ద సవాలు ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే ఆర్థిక వృద్ధిని కొనసాగించడం. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి వడ్డీ రేట్లను అమాంతం పెంచితే పెట్టుబడులు తగ్గుతాయి. పరిశ్రమలు విస్తరణ ప్రణాళికలను వాయిదా వేస్తాయి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రుణాల భారం పెరుగుతుంది. ఉపాధి అవకాశాలు తగ్గుతాయి. మరోవైపు వడ్డీ రేట్లను తక్కువగా ఉంచితే మార్కెట్‌లో నగదు ప్రవాహం పెరిగి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యతను సాధించడమే కేంద్ర బ్యాంకుకు అత్యంత క్లిష్టమైన బాధ్యత. అందుకే రిజర్వు బ్యాంకు ప్రస్తుతం వేచి చూసే విధానాన్ని అవలంబించింది. అంతర్జాతీయ పరిస్థితులు, ఆహార ధరలు, ఇంధన వ్యయం, ఎల్ నినో ప్రభావం వంటి అంశాలను నిశితంగా పరిశీలిస్తూ భవిష్యత్తు నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేసింది. అయితే ద్రవ్యోల్బణ నియంత్రణ బాధ్యతను పూర్తిగా రిజర్వు బ్యాంకుపైనే వదిలేయడం సమంజసం కాదు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర మరింత కీలకం. ముఖ్యంగా ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించాలంటే వ్యవసాయ ఉత్పత్తిని పెంచడం తప్ప మరో మార్గం లేదు. సాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం, వర్షపు నీటి సంరక్షణను గ్రామస్థాయిలో విస్తరించడం, సూక్ష్మ సేద్యాన్ని ప్రోత్సహించడం, వాతావరణ మార్పులను తట్టుకునే విత్తనాల అభివృద్ధి, పంటల వైవిధ్యీకరణ వంటి చర్యలు అత్యవసరం.

> ఎల్‌నినో పరిస్థితులను సమర్థంగా తట్టుకోవాలంటే పంట మార్పిడి విధానం ఒక్కటే మార్గమన్న రీతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. కానీ, ఇతరత్రా చర్యలు, ముందస్తు జాగ్రత్తలు కూడా అత్యవసరం. ఇప్పటికీ ఎండాకాలమే కొనసాగుతున్నట్టు కనిపిస్తోంది. కాలంకాని కాలంలో, తీవ్రమైన వాతావరణ మార్పుల నేపథ్యంలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. విష జ్వరాలు వేధిస్తున్నాయి. కొవిడ్ కంటే భయానకమైన పరిస్థితులు తలెత్తడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన స్పందించాలి. సరైన నిర్ణయాలు తీసుకోవాలి. ప్రజలను ఎల్‌నినో ప్రభావం నుంచి, దేశాన్ని ఆకలి కేకల నుంచి రక్షించాలి.




ఎల్ నినో వంటి పరిస్థితులు తరచూ సంభవిస్తున్న ప్రస్తుత కాలంలో వ్యవసాయాన్ని పాత పద్ధతులకే పరిమితం చేస్తే ఆహార భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉంది. ఉత్పత్తి పెరిగినా రైతుకు తగిన ధర రాకపోవడం, వినియోగదారుడు అధిక ధర చెల్లించడం భారత వ్యవసాయ రంగంలోని మరో వైరుధ్యం. దీనికి ప్రధాన కారణం సరఫరా గొలుసులో ఉన్న లోపాలు. దేశంలో ఇప్పటికీ పంటల కోత అనంతరం భారీ స్థాయిలో ఆహార నష్టం జరుగుతోంది. తగిన గిడ్డంగులు లేకపోవడం, శీతల నిల్వ వ్యవస్థలు పరిమితంగా ఉండటం, రవాణా సదుపాయాల లోపం, మధ్యవర్తుల ఆధిపత్యం వంటి సమస్యలు ధరలను అస్థిరంగా మారుస్తున్నాయి. కాబట్టి ద్రవ్యోల్బణ నియంత్రణలో భాగంగా గిడ్డంగుల నిర్మాణం, కోల్డ్ చైన్ వ్యవస్థ విస్తరణ, వ్యవసాయ లాజిస్టిక్స్ ఆధునికీకరణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకునే విధానం కూడా సమయోచితంగా ఉండాలి. కొరత ఏర్పడిన తరువాత చర్యలు తీసుకోవడం కంటే, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను బలోపేతం చేయడం అవసరం. ఏ పంట ఉత్పత్తి తగ్గే అవకాశముందో ముందుగానే అంచనా వేసి, అవసరమైతే దిగుమతులపై సకాలంలో నిర్ణయం తీసుకోవాలి. అవసరం లేని సందర్భాల్లో ఎగుమతులపై ఆంక్షలు విధించడం లేదా అకస్మాత్తుగా విధానాలు మార్చడం రైతు, వ్యాపారి, వినియోగదారులందరికీ అనిశ్చితిని పెంచుతుంది. విధానాలలో స్థిరత్వం కూడా ధరల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తుంది. భారతదేశం మరో ముఖ్యమైన అంశంపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలి. అది ఇంధన భద్రత. దేశం ఇప్పటికీ ముడి చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడుతోంది.

ప్రపంచంలో ఎక్కడైనా యుద్ధం జరిగినా, సముద్ర రవాణా అంతరాయం ఏర్పడినా, చమురు ధరలు పెరిగినా దాని ప్రభావం భారత మార్కెట్‌పై వెంటనే కనిపిస్తుంది. రవాణా వ్యయం పెరుగుతుంది. ఎరువుల తయారీ ఖర్చు పెరుగుతుంది. విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడుతుంది. చివరకు ప్రతి వస్తువు ధర పెరుగుతుంది. కాబట్టి సౌరశక్తి, పవనశక్తి, గ్రీన్ హైడ్రోజన్, జీవ ఇంధనాలు వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధి కేవలం పర్యావరణ పరిరక్షణ కోసం మాత్రమే కాదు, ద్రవ్యోల్బణ నియంత్రణ కోసం కూడా అవసరమైన ఆర్థిక వ్యూహం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సంభవించే భవిష్యత్తు సంక్షోభాలను కూడా తక్కువ అంచనా వేయరాదు. వాతావరణ విపత్తులు, భౌగోళిక ఘర్షణలు, అంతర్జాతీయ వాణిజ్య యుద్ధాలు, సాంకేతిక ఆధిపత్య పోటీ, సరఫరా గొలుసుల అంతరాయాలు, ప్రభుత్వ రుణభారం పెరగడం వంటి అంశాలు కలిసి కొత్త తరహా ఆర్థిక సంక్షోభాలకు దారితీయవచ్చు.

2008 ఆర్థిక సంక్షోభం ప్రపంచ బ్యాంకింగ్ వ్యవస్థ బలహీనతను బయటపెట్టింది. కోవిడ్ మహమ్మారి ప్రపంచ సరఫరా వ్యవస్థ ఎంత సున్నితంగా ఉందో నిరూపించింది. రాబోయే సంక్షోభాలు ఈ రెండింటికంటే భిన్నంగా ఉండే అవకాశం ఉంది. అందువల్ల పాత అనుభవాలతోనే కొత్త సమస్యలను ఎదుర్కోవడం సాధ్యం కాదు. అందుకే దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన రక్షణ కవచం అవసరం. విదేశీ మారక నిల్వలను పటిష్టంగా ఉంచడం, ప్రభుత్వ ఆర్థిక లోటును అదుపులో ఉంచడం, బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలను తగ్గించడం, దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, సెమీకండక్టర్లు, అరుదైన ఖనిజాలు, ఎరువులు, ఔషధ ముడి పదార్థాలు వంటి వ్యూహాత్మక రంగాల్లో దిగుమతులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడం అత్యవసరం. ఆర్థిక భద్రత అంటే కేవలం బ్యాంకుల్లో డబ్బు ఉండటం కాదు. అవసరమైన సమయంలో దేశానికి అవసరమైన వస్తువులను దేశంలోనే ఉత్పత్తి చేసుకునే సామర్థ్యం కూడా కావాలి. చిన్న, మధ్య తరహా పరిశ్రమలే భారత ఉపాధికి వెన్నెముక. వీటిని బలోపేతం చేయకుండా ఆర్థిక వృద్ధి సమ్మిళితంగా ఉండదు. చౌక రుణాలు ఇవ్వడం ఒక్కటే కాదు, సాంకేతిక పరిజ్ఞానం అందించడం, ఎగుమతి అవకాశాలు కల్పించడం, డిజిటల్ మౌలిక వసతులు మెరుగుపరచడం, చెల్లింపుల జాప్యాన్ని తగ్గించడం వంటి సంస్కరణలు కూడా సమాంతరంగా అమలవాలి. అలాగే నైపుణ్యాభివృద్ధిపై పెట్టుబడులు పెంచకుండా యువతకు ఉపాధి కల్పించడం అసాధ్యం. పేదరిక నిర్మూలనకు కూడా ఆర్థిక వృద్ధి ఒక్కటే సరిపోదు. వృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరాలి. ప్రభుత్వ విద్య బలపడాలి. ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం పెరగాలి. పోషకాహార కార్యక్రమాలు సమర్థంగా అమలవ్వాలి. మహిళల ఆర్థిక భాగస్వామ్యం పెరగాలి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర ఉపాధి అవకాశాలు విస్తరించాలి. ఆదాయ అసమానతలను తగ్గించే విధానాలు అమల్లోకి రావాలి. అప్పుడే ఆర్థికాభివృద్ధి గణాంకాల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కూడా కనిపిస్తుంది.

ఆర్‌బిఐ ఈసారి కూడా రెపో, రివర్స్ రెపో రేట్లను యథాతథంగా కొనసాగించడం ప్రస్తుత పరిస్థితుల్లో వివేకవంతమైన నిర్ణయమే కావచ్చు. అది మార్కెట్లకు స్థిరత్వాన్ని అందించవచ్చు. రుణగ్రహీతల కు తాత్కాలిక ఊరటనివ్వవచ్చు. కానీ అదే సమయం లో విధాన నిర్ణేతలకు ఒక హెచ్చరిక కూడా. ముందు న్న సవాళ్లు వడ్డీ రేట్లతో మాత్రమే పరిష్కరించగలవి కావు. ఎల్ నినో ప్రభావం, వాతావరణ మార్పులు, ఆహార భద్రత, ఇంధన దిగుమతులపై ఆధారపడటం, ప్రపంచ ఆర్థిక అనిశ్చితులు, సాంకేతిక మార్పు లు, ఉపాధి సంక్షోభం వంటి అనేక అంశాలు సమష్టిగా దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయబోతున్నా యి.

ఏనుగు వేంకటేశ్వరరావు

## 'ఆకలి' తగ్గినా.. ఆహార భద్రత ఎక్కడ?

ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వెలువడిన 'ది స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషియన్ ఇన్ ది వరల్డ్' (ఎస్ఒఎఫ్ఐ) 2026 నివేదిక ప్రపంచ ఆహార భద్రతపై పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ నివేదికను అనుసరించి, ప్రపంచవ్యాప్తంగా ఆకలి వరుసగా మూడో ఏడాది తగ్గింది. 2022లో 8.6 శాతంగా ఉన్న పోషకాహార లోపం 2025 నాటికి 7.8 శాతానికి తగ్గింది. అయినప్పటికీ ప్రపంచంలో 64.5 కోట్ల మంది ఇప్పటికీ తగినంత ఆహారం పొందలేకపోతున్నారు. అంతకంటే పెద్ద సమస్య ఏమిటంటే, సుమారు 269 కోట్ల మంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. ఈ నివేదికలో అత్యంత ముఖ్యమైన పరిణామం ఆఫ్రికాకు సంబంధించినది. చరిత్రలో తొలిసారిగా ఆకలితో బాధపడుతున్న ప్రజల సంఖ్యలో ఆఫ్రికా ఆసియాను అధిగమించింది. ఆఫ్రికాలో సుమారు 30.9కోట్ల మంది, అంటే జనాభాలో 20 శాతం మంది ఆకలిని ఎదుర్కొంటున్నారు. ఆసియాలో ఈ సంఖ్య 29.2 కోట్లు, అంటే 6 శాతంగా ఉంది. ప్రస్తుత ధోరణులు కొనసాగితే 2030 నాటికి ప్రపంచంలోని పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిలో సుమారు 56 శాతం మంది ఆఫ్రికాలోనే ఉంటారని అంచనా. ఆఫ్రికాలోని ఘర్షణలు, పేదరికం, వాతావరణ మార్పులు, ఆహార ధరల పెరుగుదల ఈ పరిస్థితిని మరింత తీవ్రం చేస్తున్నాయి. సూడాన్, డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో వంటి దేశాల్లో యుద్ధాలు వ్యవసాయ ఉత్పత్తిని, సరఫరా వ్యవస్థలను దెబ్బతీశాయి. ఇంధనం, ఎరువుల ధరలు పెరగడం కూడా రైతులపై ఒత్తిడిని పెంచింది. ఆహారం అందుబాటులో ఉండటం ఒక్కటే ఆకలిని నిర్మూలించదు. ప్రజలు తీసుకునే ఆహారంలో ప్రోటీన్లు, పప్పుధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పాలు, గుడ్లు, గింజలు వంటి పోషక పదార్థాలు లేకపోతే ఆరోగ్యకరమైన జీవితం సాధ్యం కాదు. 2025లో ఆరోగ్యకరమైన ఆహారం కోసం ప్రపంచవ్యాప్తంగా ఒక వ్యక్తికి రోజుకు కనీస వ్యయం 4.28 డాలర్ల 'పర్చేసింగ్ పవర్ పారిటీ'(పిపిపి)కి పెరిగింది. ఆహార ద్రవ్యోల్బణం దీనికి ప్రధాన కారణం. ప్రపంచ జనాభాలో 32.7 శాతం మంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోయారు. ఆఫ్రికాలో ఈ సమ స్య మరింత




తీవ్రంగా ఉంది. అక్కడ 66.6 శాతం మందికి ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులో లేదు. పిల్లలు, మహిళల ఆహార వైవిధ్యం కూడా ఆందోళన కలిగిస్తోంది. 6– 23 నెలల వయసున్న పిల్లల్లో కేవలం 30.8 శాతం మందే కనీస ఆహార వైవిధ్యాన్ని పొందుతున్నారు. 15–49ఏళ్ల మహిళల్లో ఈ నిష్పత్తి 62.7 శాతంగా ఉంది. అంటే దాదాపు ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరికి తగినంత వైవిధ్యమైన ఆహారం అందడం లేదు. రక్తహీనత, తక్కువ జనన బరువు, ఎదుగుదల లోపం, బాల్య స్థూలకాయం వంటి సమస్యలను 2030 నాటికి తగ్గించాలనే ప్రపంచ లక్ష్యాలు కూడా ప్రస్తుత వేగంతో సాధించే పరిస్థితిలో లేవు. అందుకే వ్యవసాయ విధానాలు కేవలం బియ్యం, గోధుమ వంటి ప్రధాన ధాన్యాల ఉత్పత్తిపైనే దృష్టి పెట్టకుండా పప్పు లు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు వంటి పోషక ఆహార ఉత్పత్తిని పెంచాలి. కోత తర్వాత నిల్వ, శీతలీకరణ, రవాణా వంటి మౌలిక సదుపాయాలను కూడా బలోపేతం చేయాలి. కాగా, మన దేశం ఆహార విధానంలో మార్పు అవసరాన్ని ఈ నివేదిక వల్ల స్పష్టమవుతోంది. బియ్యం, గోధుమల ఉత్పత్తి, పంపిణీపై నిర్మించిన ఆహార భద్రతను ఇప్పుడు పోషక వైవిధ్యంతో అనుసంధానించాలి. పండ్లు, కూరగాయలు, పప్పులు, పాలు, గుడ్లు వంటి పోషక ఆహారాల ధరలు సాధారణ కుటుంబాలకు అందుబాటులో ఉండేలా సరఫరా వ్యవస్థలను మెరుగుపరచాలి. వాతావరణ మార్పుల నేపథ్యంలో వర్షాధార వ్యవసాయానికి తగిన రక్షణ కల్పించాలి.

( అసెంబ్లీ మీడియా పాయింట్ )

## బిఆర్ఎస్ ఎమ్మెల్యేల అసభ్య ప్రవర్తన : ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా పోలీసుల ఎదుట చొక్కాలు విప్పి బిఆర్ఎస్ ఎంఎల్ఎలు అసభ్యకరంగా ప్రవర్తించారని, ఇదే నేర్పారా బిఆర్ఎస్ ఎంఎల్ఎలకు కెసిఆర్ అని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ నర్సింగ్‌రావు ప్రశ్నించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎంఎల్ఎలు కెటిఆర్, హరీశ్‌రావు ఉద్దేశపూర్వకంగానే వారి పార్టీ ఎంఎల్ఎలను సమర్థించే పనులు చేస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ నేతలు కావాలనే దళిత సమాజాన్ని అవమానపరస్తున్నారన్నారు. స్పీకర్ తల్లిని అవమానించిన ఎంఎల్‌సి తాతా మధును సభ నుంచి డిస్మిస్ చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని బల్మూరి వెంకట్ స్పష్టంచేశారు.

## స్పీకర్‌కు కెసిఆర్ క్షమాపణ చెప్పాలి : విప్ ఆది శ్రీనివాస్



ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి అసెంబ్లీ స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ గేటు వద్ద మొన్న జరిగిన ఘటనపై ఇప్పటివరకు కెసిఆర్ విచారణ వ్యక్తం చేయలేదన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు విధులు నిర్వర్తిస్తున్న పోలీసులను తోసి వేశారన్నారు. పైగా కట్టు కట్టించుకొన్న ఓ బిఆర్ఎస్ ఎమ్మెల్యేకు ఈరోజు చూస్తే ఎలాంటి గాయం లేదన్నారు. కేవలం సానుభూతి పొందడానికే బిఆర్ఎస్ వాళ్ళు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు.

## సమాజం తలదించుకొనేలా బిఆర్ఎస్ ఎమ్మెల్యేల తీరు : విప్ రామచంద్రు నాయక్



సభ్యసమాజం తలదించుకొనే విధంగా మొన్న బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రవర్తించారని ఎంఎల్‌ఎ,విప్ రామచంద్రు నాయక్ మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో ఆరాచకాలు, అక్రమాలు, అవినీతి చేసి మళ్లీ ఇప్పుడు అధికారం పోయి అల్లర్లకు తెరలేపుతున్నారని ధ్వజమెత్తారు. దళిత సామాజిక వర్గాన్ని అవమానపరిచేవిధంగా బిఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. స్పీకర్ పట్ల దురుసుగా మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధు సభ్యత్వం రద్దు చేయాలని కోరారు.

## ప్రజల ఇబ్బందులపై చర్చ జరగాలి : బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్



అసెంబ్లీలో రాష్ట్ర భవిష్యత్తు మీద, ప్రజల ఇబ్బందుల మీద చర్చ జరగాలని బిజెపి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బిఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. గత పదేళ్లలో కెసిఆర్ చేసిన అక్రమాలను కాంగ్రెస్ కాపాడుతున్నదన్నారు. తాము ఇచ్చిన వాయిదా తీర్మానాలపై చర్చ జరపడం లేదన్నారు. 22ఎ భూ బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పెండింగ్ డిఎ బకాయిలు, పిఆర్‌సిల మీద, రైతాంగం సమస్యలపై చర్చ జరగాలని కోరారు.

## తెలంగాణ అస్తిత్వానికే ప్రమాదం తెచ్చుకొన్నట్టే : ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి




కెసిఆర్ చావు కోరుకోవడమంటే తెలంగాణ అస్తిత్వానికి ప్రమాదం తెచ్చుకొన్నట్టేనని బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ ఎర్రవల్లిలో కెసిఆర్ ఇంటి దగ్గర వెయ్యి డప్పులతో దాడి చేస్తాం, ఆయన చావు కోరుకొంటామని షాద్‌నగర్ ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ వ్యాఖ్యానించారని, అది సిఎం రేవంత్ రెడ్డి అన్నట్టేనని ఆయన పేర్కొన్నారు. ఎంఎల్‌ఎ శంకర్‌పై కేసు నమోదు చేయాలని డిజిపిని కోరుతున్నామన్నారు. అసెంబ్లీకి రావాల్సిన కొందరు ఎమ్మెల్యేలు ఎర్రవల్లిలోని కెసిఆర్ ఇంటిపై దాడి చేయాలని మకాం వేసినట్టు సమాచారం ఉన్నదన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే కెసిఆర్‌ను రాజకీయంగా ఎదుర్కోవాలని వేముల సవాల్ చేశారు.

## మా గొంతు నొక్కేందుకు యత్నిస్తున్నారు : బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద




కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన ఘోరంగా విఫలమైంది కనుకే తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఎంఎల్‌ఎ కెపి వివేకానంద పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు సజావుగా జరగాలని, అందుకు బిఆర్ఎస్ సహకరించేందుకు సిద్ధంగా ఉన్నదన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా చేసే ప్రయత్నం చేస్తూ, కేసులు పెడుతున్నారన్నారు. సాటి మహిళలను అవమానపరిచే విధంగా మంత్రి సీతక్క మాట్లాడుతున్నారన్నారు. మొన్న ఘటనపై స్పష్టత ఇస్తామంటే మైక్ ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని అస్సాం సిఎం హిమంత బిశ్వ శర్మ తిడితే కెసిఆర్ బహిరంగంగా ఖండించారని గుర్తుచేశారు. మహిళా ఎంఎల్‌ఎల పట్ల సిఎం దురుసుగా మాట్లాడుతున్నారని, ఆయన మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## పోలీసులను అడ్డంపెట్టుకొని రెచ్చగొడుతున్నారు : ఎంఎల్‌ఎ కోవా లక్ష్మీ



కొంతమంది కాంగ్రెస్ ఎంఎల్‌ఎలు పోలీసులను అడ్డం పెట్టుకొని కావాలనే రెచ్చగొడుతున్నారని ఎంఎల్‌ఎ కోవా లక్ష్మి అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆడవాళ్ల దగ్గర మగ పోలీసులను, మగవాళ్ల చుట్టూ ఆడ పోలీసులను పెట్టారు, ఇది అసెంబ్లీలో చరిత్ర లేదన్నారు. మొన్న జరిగిన ఘటనపై విచారణ చేసుకోండి, వీడియోలు కూడా ఉన్నాయన్నారు. సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి వచ్చి కెసిఆర్ పైన బూతు పురాణాలు మాట్లాడుతున్నారని, ఇప్పుడు సిఎంగా కెసిఆర్ వున్నారా? అంటూ ప్రశ్నించారు. సిఎం రేవంత్ రెడ్డికి చేతగాకపోతే తప్పుకోండి కెసిఆర్ పాలన చేస్తారని పేర్కొన్నారు.

## దోపిడీ బయటపెడతామనే సభకు రానిస్తలేరు : బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి



ప్రజల ఆస్తులను దోచుకోవడానికే భూభారతి తెచ్చారని, దానిపై చర్చ జరపడం ఇష్టంలేక వారి దోపిడీని బయటపెడతామని తమను సభకు రాకుండా అడ్డుకొంటున్నారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే జి.జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ కెసిఆర్‌పై దాడికి సిఎం రేవంత్ రెడ్డి పోలీస్ ఎస్కార్ట్ ఇచ్చి మరీ పంపిస్తున్నారన్నారు. ఇంటెలిజెన్స్‌కు తెలియకుండా సిఎం పనిచేస్తున్నారని, చాలా మంది అధికారులు చేతులెత్తుస్తున్నారని పేర్కొన్నారు. కెసిఆర్ పై దాడికి వెళ్లే వారిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే తాము అధికారంలోకొచ్చిన తర్వాత చర్యలుంటాయని పేర్కొన్నారు.

## స్పీకర్‌ను బెదిరించేలా మాట్లాడటం

# ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

### మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యల గురించి మంగళవారం రెండోరోజు కూడా చర్చ జరిగింది. చర్చలో శాసనసభావ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ, బిఆర్ఎస్ సభ్యుల తీరును తీవ్రంగా తప్పుబట్టారు. రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ స్థానాన్ని బెదిరించేలా మాట్లాడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. సభలో బిఆర్ఎస్ సభ్యులు హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ సభను ఏ విధంగా నడపాలనే దానిపై స్పీకర్‌ను నిర్దేశిస్తూ, ఇలా చేయొద్దు, అలా చేయొద్దు అని శాసించడానికి ప్రతిపక్ష నేతలెవరని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ వ్యవస్థను బెదిరించేలా ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టని మండిపడ్డారు. స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారాన్ని ఏదో అనుకుంటే లేదా భావిస్తే అన్న చర్చకు తావులేదని, ఏం జరిగిందనేది వీడియోల్లో అత్యంత స్పష్టంగా రికార్డై కనిపిస్తుందన్నారు. ఉన్నతమైన స్పీకర్ వ్యవస్థపై జరిగిన దాడి వ్యవహారాన్ని పక్కన పెట్టాలని కోరడం ఎంతవరకు సమంజసమని శ్రీధర్ బాబు ప్రశ్నించారు. చట్టసభ నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. మహిళా ఎమ్మెల్యేల ఘటనపై ప్రభుత్వం ఇప్పటికే నివేదిక కోరిందని, విచారణ అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను పక్కన పెట్టాలంటున్న బిఆర్ఎస్ నేతలు, స్పీకర్ పట్ల బెదిరింపు ధోరణితో సభ నడవదని గుర్తించాలన్నారు. మహిళా సభ్యుల అంశాన్ని చూపిస్తూ స్పీకర్‌పై జరిగిన అవమానాన్ని విస్మరించాలని కోరడం సరైంది కాదన్నారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తిపై ఇలా మాట్లాడటం ఎప్పుడూ చూడలేదన్నారు.

**ముందు క్షమాపణ చెప్పాలి : అడ్లూరి లక్ష్మణ్**

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన వ్యక్తి స్పీకర్ స్థానంలో ఉండటాన్ని బిఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. స్పీకర్ తల్లిని అవమానించిన అంశంపై కెసిఆర్ సభకు వచ్చి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళిత వర్గానికి చెందిన స్పీకర్‌ను అవమానించడం రాజ్యాంగ వ్యవస్థను అవమానించినట్లేనన్నారు. దళితుడిని సిఎం చేస్తామని చెప్పి, మాట తప్పారని, ద్రోహం చేశారని అన్నారు. ఏనాడైనా కెసిఆర్ అంబేద్కర్ వర్ధంతికి వచ్చారా? అని ప్రశ్నించారు. ఆనాడు సంపత్ కుమార్ ఏం తప్పు చేశారని ఆయనపై నిషేధం విధించారని నిలదీశారు. మహిళలను ముందు పెట్టుకుని రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. యావత్ తెలంగాణ జాతి స్పీకర్ పక్షాన నిలుస్తుందన్నారు. బిఆర్ఎస్ ముందుగా స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కెటిఆర్ ఓ పోలీసు అధికారి గల్లా పట్టి కొట్టారని, హరీశ్ రావు మహిళా అధికారుల ముందు షర్ట్ విప్పారని అన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించి ఉంటే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసిందన్నారు.

**మహిళలను రాజకీయాలకు వాడొద్దు : సీతక్క**

మంత్రి సీతక్క మాట్లాడుతూ ఎమ్మెల్యే తాతా మధు వ్యాఖ్యాలకు కెసిఆర్ నైతిక బాధ్యత వహించి, సభకు వచ్చి, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యేలను రాజకీయ ప్రయోజనాల కోసం ముందుకు నెట్టారని ఆరోపించారు. మహిళా పోలీసు అధికారుల ఎదుట బిఆర్ఎస్ నేతలు అనుచితంగా ప్రవర్తించారని, మహిళా పోలీస్ అధికారుల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా? అని ప్రశ్నించారు. డ్యూటీలో ఉన్న పోలీసులపై చేయి చేసుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అసెంబ్లీ దేవాలయం లాంటిదని, అలాంటి చోట గందరగోళానికి తావు ఉండకూడదన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలికి తీయాలని ఆయన కోరారు. బిఆర్ఎస్ మహిళా నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు. కవితను పార్టీ నుంచి ఎందుకు బహిష్కరించారని మంత్రి సీతక్క ప్రశ్నించారు.

**22ఎ భూములపై చర్చ జరపాలి : ఏలేటి మహేశ్వర్ రెడ్డి**

సభలో బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి 22ఎ నిషేధిత భూముల అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది రైతులు, భూ యజమానులను ప్రభావితం చేస్తున్న ఈ అంశంపై ప్రత్యేక చర్చ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎప్పుడు చర్చ చేపడుతుందో స్పష్టత ఇవ్వాలని కోరారు. అందుకు మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ బిఎసి సమావేశంలో 22ఎ అంశంపై స్వల్పకాలిక చర్చ చేపడుతామని నిర్ణయం తీసుకున్నామని, సమగ్రంగా చర్చ జరుపుతామని తెలిపారు.

## నా సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులు ఎన్నడూ చూడలేదు

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆవేదన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసనసభను తాను ఎల్లప్పుడూ అత్యంత ప్రజాస్వామ్యయుతంగా నడిపించానని, అయితే శాసనసభాపతి స్థానాన్ని అవమానించిన ఘటనపై సభలో మాట్లాడిన మాజీ మంత్రి హరీష్ రావు క్షమాపణ చెబుతారని భావిస్తే, ఆయన అసలు విషయాన్ని పక్కదారి పట్టించేలా మాట్లాడారని తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితులను చూడలేదని, ఈ ఘటనతో రాష్ట్రమంతా అట్టుడుకుతోందని పేర్కొన్నారు. అసెంబ్లీలోని స్పీకర్ ఛాంబర్‌లో మంగళవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో స్పీకర్ ఇష్టాగోష్టిగా మాట్లాడారు. గతంలో కెసిఆర్ వ్యవహరించినట్లుగా తాము నియంతృత్వంగా వ్యవహరించలేదని, విపక్ష సభ్యులపై వెంటనే అనర్హత వేటు కూడా వేయలేదని స్పీకర్ అన్నారు. బిఆర్ఎస్ మహిళా సభ్యులపై జరిగిన ఘటన ఆరోపణలను కూడా నిశితంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పీకర్ హామీ ఇచ్చారు. అయితే అసెంబ్లీ వద్ద కెటిఆర్, పాడి కౌశిక్ రెడ్డి, నవీన్ రెడ్డిలు పోలీసులపై భౌతిక దాడికి దిగినట్లు స్పష్టంగా కనిపించిందని ఆయన తెలిపారు. ప్రస్తుతం అసెంబ్లీ కొత్తగా ఎలాంటి ఆంక్షలు విధించలేదని, 2014లో బిఆర్ఎస్ ప్రభుత్వంలో అసెంబ్లీ రూపొందించిన నిబంధనలనే ఇప్పుడు తాము అమలు చేస్తున్నామని, టీషర్టులపై నినాదాలు ఉండటం వల్లే వాటిని సభలోకి అనుమతించలేదని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రతి అసెంబ్లీ సమావేశాల కంటే ముందే ప్రతిపక్ష నేతలకు మర్యాదపూర్వకంగా ఫోన్ చేసే సంప్రదాయాన్ని తాను పాటిస్తున్నానని, ఆ మేరకు తాను మాజీ సిఎం, ప్రతిపక్ష నేత కె.చంద్రశేఖర్ రావుకు కూడా ఫోన్ చేశానని, ఆరోగ్యం బాగుంటే సభకు హాజరవుతానని ఆయన చెప్పారని స్పీకర్ వెల్లడించారు. సభ గౌరవాన్ని కాపాడేందుకు ఎవరిపైనైనా కఠిన చర్యలు తీసుకునే పూర్తి రాజ్యాంగబద్ధ అధికారాలు స్పీకర్‌కు ఉంటాయని, అయినా తాము వెంటనే అలాంటి చర్యలు చేపట్టలేదని ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ అదానీ చిత్రాలున్న దుస్తులతో పార్లమెంటుకు వెళ్లిన విషయం తాను చూడలేదన్నారు.

## ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు..

# కెసిఆర్ వ్యూహంలో భాగమే

### టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కించపరిచేలా ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు చేయడం బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ వ్యూహంలో భాగమేనని టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. తాతా మధు మాట్లాడింది బిఆర్ఎస్ స్క్రిప్ట్ అని, వ్యూహం రూపొందించి ఆయనను రంగంలోకి దించారని విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో మంగళవారం మహేశ్ కుమార్ మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ తాతా మధు వ్యాఖ్యలను కెసిఆర్ ఇప్పటి వరకు ఖండించకపోవడం ఆ పార్టీ దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమన్నారు. కెసిఆర్ కంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే సామాజిక స్పృహ ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. పదేళ్లు సిఎంగా ఉన్న కెసిఆర్ దళిత స్పీకర్‌ను అవమానించినా ఖండించలేదని మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. మహిళలు లేకుండానే కేబినెట్ నడిపిన కెసిఆర్‌కు సామాజిక న్యాయం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. పదేళ్లలో కెసిఆర్ ఎప్పుడూ అంబేద్కర్‌కు దండ వేయలేదని ఆరోపించారు. దళితుడైన స్పీకర్‌ను 'అధ్యక్షా' అని పిలవాల్సి వస్తుందనే కారణంతోనే కెసిఆర్ అసెంబ్లీకి రాలేదని విమర్శించారు. ఏ రాష్ట్రంలోనూ ప్రతిపక్ష నేత ఫామ్‌హౌస్‌లో ఉండటం చూడలేదని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి భట్టి విక్రమార్కను ప్రతిపక్ష నేత పదవి నుంచి తొలగించారని, రాజయ్యను అర్ధరాత్రి బర్తరఫ్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో దళితులకు అత్యున్నత పదవులు కల్పించామని తెలిపారు.


**త్వరలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఖరారు**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థుల వడపోత పూర్తయిందని, రెండు మూడు రోజుల్లో పేర్లు ఖరారయ్యే అవకాశం ఉందని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. ఖమ్మం–నల్గొండ–వరంగల్, హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ నియోజకవర్గాలకు చెరో నాలుగు పేర్లను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. రెండో నియోజకవర్గాన్ని మంత్రి దామోదర్ రాజనర్సింహ పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. 22ఏ అంశాన్ని సమూలంగా సమీక్షించి సవరించాలని సిఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారని చెప్పారు. మాజీ మంత్రి కొండా సురేఖతో రెండోసారి వివాదాన్ని ముగించుకోవాలని తానే సూచించానన్నారు. తాను మంత్రి పదవి కోరుకోలేదని, ఇప్పటివరకు ఎవరూ తనను అడగలేదని మహేష్‌కుమార్ స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయాలన్నదే కాంగ్రెస్ నేతలందరి ఆకాంక్ష అని ఆయన తెలిపారు.

## తాతా మధు వ్యాఖ్యలపై శాసన మండలిలో

# రెండో రోజు వాడీ వేడి చర్చ








**ప్రజాపక్షం/హైదరాబాద్:** శాసన సభ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వాఖ్యలపై శాసనమండలిలో రెండో రోజు కూడా వాడివేడిగా చర్చ జరిగింది. సభ ప్రారంభం కాగానే ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి అరెస్ట్‌ల అంశంపై శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటన చేశారు. దీంతో సభలో ఉన్న బిఆర్ఎస్ శ్రేణులు అసలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిల వివరణ తీసుకోకుండానే ఎలా అరెస్ట్ చేస్తారని నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారిపై వ్యవహరించిన తీరుపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల దౌర్జన్యం నశించాలని బిఆర్ఎస్ సభ్యులు నినాదాలు చేస్తూ చైర్మన్ పోడియం ముందు నిరసన వ్యక్తం చేశారు. సభ వాయిదా పడే వరకు ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ శాసనసభ స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనదని, ఆ పదవిలో ఉన్న వ్యక్తిపై కులపరమైన వ్యాఖ్యలు చేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. దళితులను అవమానించే సంస్కృతిని దేశ చరిత్రలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. దళితుల పట్ల బిఆర్ఎస్ ఎప్పుడూ వ్యతిరేక వైఖరినే అవలంబిస్తోందని పేర్కొన్నారు. దళితుడు స్పీకర్‌గా ఉన్నందుకే ప్రతిపక్ష నేత కెసిఆర్ అసెంబ్లీకి రావడం లేదని విమర్శించారు. బిఆర్ఎస్ నేతలు అడుగడుగునా మహిళలు, దళితులను అవమానపరుస్తున్నారని మండిపడ్డారు. సోమవారం జరిగిన సంఘటన బాధాకరమని, స్పీకర్ తల్లిపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సభను కించపరచడమేనని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇలాంటి ఘటనలు జరగడం దురదృష్టకరమని అన్నారు. తాతా మధు స్పీకర్‌పై చేసిన వాఖ్యలను ఒక వ్యక్తిపై కాకుండా, సభాపతి పదవికి అవమానం జరిగినట్లు భావించి పార్టీలకతీతంగా స్పీకర్‌కు మద్దతు తెలపాలని కోరారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ వెనుకబడిన జాతులకు చట్ట సభల్లో కనీసం మాట్లాడే అవకాశం కూడా బిఆర్ఎస్ ఇవ్వదని విమర్శించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ స్పీకర్‌పై తాతామధు చేసిన వాఖ్యలు యావత్ దళిత సమాజాన్ని, సభను అవమానించే విధంగా ఉన్నాయని అన్నారు. ఈ సభతో పాటు సభ్యులు ప్రజాస్వామ్యం గౌరవాన్ని పెంపొందించేలా ప్రవర్తించాలని సూచించారు. ఎమ్మెల్సీ చింతపండు నవీన్ (తీన్మార్ మల్లన్న) మాట్లాడుతూ బి.ఆర్. అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కుల ద్వారా బడుగు, బలహీన వర్గాల వర్గాలకు చెందిన వ్యక్తులు ఉన్నత స్థానాలకు చేరుకోవడం బిఆర్ఎస్ నేతలకు మింగుడు పడడం లేదని విమర్శించారు. స్పీకర్‌పై తాతా మధు చేసిన వాఖ్యలు వంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే తాతా మధు సభ్యత్వం రద్దు చేయడంతో పాటు శాఖపరమైన చర్యలు చేపట్టాలని చైర్మన్‌ను కోరారు.

**బిఆర్ఎస్ తీరుపై మంత్రి సీతక్క ఫైర్..**

శాసనమండలిలో బిఆర్ఎస్ సభ్యుల వ్యవహారశైలిపై రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్‌ను దూషించిన వారిని సభ నుంచి బహిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. సభకు నైతిక విలువలు, సంప్రదాయాలు ఉన్నాయని, వాటిని సభ్యులంతా గౌరవించాలని సూచించారు. మహిళా పోలీసులపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అసభ్యంగా చేతులు వేసి నెట్టివేశారని సీతక్క ఆరోపించారు. ఈ వ్యవహారంపై మహిళా కమిషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హరీష్‌రావు స్పీకర్ పోడియం వైపు దూసుకెళ్లే పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. "ఏం.. స్పీకర్‌ను కొడతారా? నిన్న దూషించారు.. నేడు కొడతారా?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టి రాజకీయాలు చేయడం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ భూతులు మాట్లాడే వారిని సమర్థించే సంస్కృతి బిఆర్ఎస్ పార్టీది అని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్సీ కొదండరాం మాట్లాడుతూ సోమవారం జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని చైర్మన్‌ను కోరారు. తాతా మధు చేసిన వాఖ్యలు ఒక వ్యక్తి మీద కాదు, రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించాలని అన్నారు. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సభలో బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని అభివర్ణించారు.

## పోలీసుల వైఖరిపై కూడా చర్యలు

### బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తాతా మధు, నవీన్‌రెడ్డి దాడిల ఘటన వ్యవహారంలో తప్పు చేసిన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ శాసన మండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి రెండు వర్గాలపైనా నిష్పక్షపాతంగా విచారణ జరిపి, తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎవరు తప్పు చేసినా వారిని రక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బిజెపి తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. మహిళా ఎమ్మెల్యేలను పోలీసులు తోసివేయడం, చీర లాగడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలపై కూడా సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


తెలంగాణ ప్రభుత్వం
**జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్ కార్యాలయం**
PIU డివిజన్, నల్లగొండ.

"షార్ట్ టెండర్ ప్రకటన"

Lr.No.: D3/Tenders/08/2026-27/DPRENLG తేదీ: 05.09.2026

నల్లగొండ జిల్లా, PIU నల్లగొండ డివిజన్ పరిధిలోని నల్లగొండ పట్టణంలో, మొత్తం **రూ.74.73 లక్షల** అంచనా వ్యయంతో చేపట్టే (9) పనులకు సంబంధించి టెండర్లు ఆహ్వానించడమైనది. **దరఖాస్తుకు చివరి తేదీ:** 15.09.2026, **టెండర్ షెడ్యూల్స్ జారీ తేదీ:** 16.09.2026, **టెండర్ స్వీకరణ మరియు తెరిచే తేదీ:** 17.09.2026. మరిన్ని వివరాలకు **సంప్రదించవలసిన చిరునామా:** DPRE PIU నల్లగొండ కార్యాలయం, (ZPP కాంప్లెక్స్, 2వ అంతస్తు), మున్సిపల్ కార్యాలయం ఎదురుగా, నల్లగొండ టౌన్.

సం/- జిల్లా పంచాయత్‌రాజ్ ఇంజనీర్,
P.I.U.,:: నల్లగొండ.

DIPR R.O. No. : 9481-PP/CL/ADVT/2026-27, Date: 08-09-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
పటాన్‌చెరు సర్కిల్-46, శేరిలింగంపల్లి జోన్.

షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-22/CMC/PTC-C-46/2026-27, తేది: 08.09.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ /ఇఎండి | డౌన్‌లోడ్ ప్రారంభ తేది | బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం | ఇఇ పేరు & చిరునామా |
|---|---|---|---|---|---|
| షార్ట్ టెండర్ నోటీసు నెం. Engg-22/CMC/PTC-C-46/ 2026-27, తేది: 08.09.2026 | 1 సంఖ్య - 20 మీ. x 10 మీ. కొలతలు మరియు 1.32 మీ. లోతు కలిగిన పోర్టబుల్ నీటి ట్యాంక్ సరఫరా మరియు ఏర్పాటు. | రూ. 15.00 లక్షలు | 08.09.2026 మ.3.00 గం.లకు | 11.09.2026 మ.3.00గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్ - 46. ఫోన్ నెం. 7331189492 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.tender.telangana.gov.in, పటాన్‌చెరు సర్కిల్-46లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పటాన్‌చెరు సర్కిల్-46,
ఎస్ఎల్‌పి జోన్, సిఎంసి.

DIPR R.O. No. : 9530-PP/CL/ADVT/2026-27, Date: 08-09-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, నార్సింగి సర్కిల్-45, ఎస్ఎల్‌పి జోన్ : సిఎంసి

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

NIT. No. 26/EE/CIR-45/SLPZ/CMC/1-1/2026-27 తేది: 08.09.2026

| NIT No. | పని కేటగిరి | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 26/EE/CIR-45/ SLPZ/CMC/1-1 /2026-27, తేది: 08.09.2026 | ఎస్‌డబ్ల్యూఎం పని | రూ. 26.00 లక్షలు | 09.09.2026 మ.3.00 గం.లకు, 12.09.2026 ఉ.10.30 గం.ల వరకు | ఇఇ, సర్కిల్-45, ఎస్ఎల్‌పిజెడ్, సిఎంసి. సెల్ నెం. 9063816949 |

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-45,
సిఎంసి.

DIPR R.O. No. : 9598-PP/CL/ADVT/2026-27, Date: 08-09-2026

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం :: కల్వకుర్తి**
నాగర్‌కర్నూల్ జిల్లా.

టెండర్ నోటీసు నెం: E1/KLKY/TENDER NOTICE-08/2026-27, తేదీ: 08.09.2026

కల్వకుర్తి మున్సిపాలిటీ కమిషనర్ ఆదేశాల మేరకు, సాధారణ నిధులు మరియు ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద వివిధ పనుల కోసం 'ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది.

'ఇ-ప్రొక్యూర్‌మెంట్' నోటీసు

| క్ర.సం. | పని పేరు | అంచనా వ్యయం (లక్షలలో) |
|---|---|---|
| 1. | 2026-27 సాధారణ నిధి కింద కల్వకుర్తి మున్సిపాలిటీలో మటన్ మార్కెట్ షట్టర్ల నిర్వహణ, మరమ్మతులు మరియు షట్టర్ల లోపల నేల (bed) ఏర్పాటు పనులు. | 10.00 లక్షలు |
| 2. | 2026-27 సాధారణ నిధి కింద కల్వకుర్తి మున్సిపాలిటీలోని వివిధ ప్రాంతాలలో ప్రధాన వర్షపు నీటి కాలువల నుండి పూడిక తీత పనులు. | 5.00 లక్షలు |
| 3. | ప్రత్యేక అభివృద్ధి నిధి కింద నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మున్సిపాలిటీలోని వార్డు నెం. 07లో వైశ్య శ్మశానవాటికకు ప్రహరీగోడ మరియు వేదిక నిర్మాణం. | 5.00 లక్షలు |
| 4. | ప్రత్యేక అభివృద్ధి నిధి కింద నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మున్సిపాలిటీలోని వార్డు నెం. 09, సంజాపూర్‌లో ప్రజల వినియోగం కోసం కమ్యూనిటీ హాల్ నిర్మాణం. | 5.00 లక్షలు |

| | | |
|---|---|---|
| 1. | మొత్తం పనులు | నాలుగు |
| 2. | అంచనా విలువ | రూ. 25.00 లక్షలు |
| 3. | బిడ్ సమర్పణ ప్రారంభ తేదీ మరియు సమయం | 09.09.2026 ఉదయం 11:30 గంటలకు |
| 4. | బిడ్ సమర్పణ ముగింపు తేదీ మరియు సమయం | 18.09.2026 సాయంత్రం 5:00 గంటలకు |

మరిన్ని వివరాలను "www.eprocurement.gov.in" అనే ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో చూడవచ్చు. **బిడ్లను ఆహ్వానిస్తున్న అధికారి:** కమిషనర్, కల్వకుర్తి మున్సిపాలిటీ, నాగర్‌కర్నూల్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం; సెల్ నెం. 9110540243, 7330690590.

సం/- కమిషనర్
కల్వకుర్తి మున్సిపాలిటీ

DIPR R.O. No. : 9559-PP/CL/ADVT/2026-27, Date: 08-09-2026

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
09-09-2026
www.prajapaksham.in




## యూటర్న్ సమస్యలపై అఖిలపక్షం ఏకాభిప్రాయ తీర్మానం

**ప్రజాపక్షం/చర్లపల్లి:** నాగారం డివిజన్ పరిధిలోని ఓల్డ్ విలేజ్‌కు చెందిన అఖిలపక్షం నాయకులు నాగారం సత్యనారాయణ కాలనీలోని కమ్యూనిటీ హాలులో సమావేశం ఏర్పాటు చేసుకుని సమస్యలపై చర్చించారు. నాగారంలో నెలకొన్న రోడ్డు, యూటర్న్, పాదచారులు దాటేందుకు అవసరమైన ప్రదేశాలపై చర్చించి సమస్యలు పరిష్కరించుకునేందుకు కృషి చేయాలన్నారు. ప్రజల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అందరూ ఏకాభిప్రాయానికి వచ్చి పాదచారులు రోడ్డు దాటేందుకు నాలుగు స్పాట్లు ఎంపిక చేసి నిర్ణయం తీసుకున్నారు. సమస్యల పరిష్కారానికి డిసిపి, సిపిలకు వినతి పత్రం అందజేయాలని అఖిలపక్షం నాయకులు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధు, నవీన్‌రెడ్డిలను ఎమ్మెల్సీ పదవుల నుంచి తొలగించాలి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని ఘట్‌కేసర్, ఎదులాబాద్, పోచారం,డివిజన్ అధ్యక్షు లు బొక్క ప్రభాకర్ రెడ్డి, సామల అమరేందర్, కర్రె రాజేష్‌లు మంగళవారం బొక్క ప్రభాకర్‌రెడ్డి ఆఫీసులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బొక్క



ప్రభాకర్ రెడ్డి, కర్రె రాజేష్, అమరేందర్‌లు మాట్లాడుతూ రాష్ట్ర శాసనసభ స్పీకర్ రాజ్యాంగబద్ధమైన అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి అని అలాంటి పదవిలో ఉన్న నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన వారిని ఎమ్మెల్సీ పదవుల నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని ప్రకటించి ఆ హామీని నిలబెట్టుకోలేదని, దళిత కుటుంబాలకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి అమలు చేయలేదని విమర్శించారు. దళితులకు ఇచ్చిన డిప్యూటీ సిఎం పదవిని కూడా కొంతకాలానికే తొలగించారని ఆరోపించారు. దళితులను హేళనగా చూస్తూ అగౌరపరిచే బుద్ధి కెసిఆర్‌ది అని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధ పదవులకు గౌరవం ఇవ్వడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని భవిష్యత్తులో ఇటువంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా రాజకీయ నాయకులు సంయమనం పాటించాలని కాంగ్రెస్ నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు బొక్క సంజీవ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




## పేదరికాన్ని జయించి డాక్టరేట్ సొంతం

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** శామీర్‌పేట మండలం లాల్‌గడిమలక్‌పేటకు చెందిన కత్తి యాదగిరి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జంతు శాస్త్రంలో పరిశోధన పూర్తిచేసి పిహెచ్‌డి డాక్టరేట్ పట్టా సాధించారు. ప్రొఫెసర్ నీరజ పర్యవేక్షణలో ఔషధ మొక్కలతో కోళ్లలోని నులిపురుగులు నివారణపై పరిశోధన చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం 85వ స్నాతకోత్సవంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ఉప కులపతి కుమార్ మొలుగారం, భారత్ బయోటెక్ వ్యవస్థాపకుడు కృష్ణ ఎల్లా చేతుల మీదుగా యాదగిరి డాక్టరేట్ పట్టాను మంగళవారం అందుకున్నారు. పేదరికాన్ని జయించడానికి విద్యే మార్గమని భావించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన యాదగిరిని కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, గ్రామస్థులు అందించారు.

## పంట వివరాలు డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదు :ఏడిఎ వెంకటేశం

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** చిట్టిగిద్ద గ్రామంలో పంట నమోదు ప్రక్రియను వికారాబాద్ వ్యవసాయ శాఖ అధికారులు, మండల వ్యవసాయ అధికారి జ్యోతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడిఎ వెంకటేశం మాట్లాడుతూ,



మండలం లోని 22 రెవెన్యూ గ్రామాలకు ఎంపిక చేసిన గ్రామ వాలంటీర్ల ద్వారా రైతుల పంట వివరాలను డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి రైతు తమ పొలంలో సాగుచేస్తున్న పంట వివరాలను గ్రామ వాలంటీర్ వద్ద డిసిఎస్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. పంట నమోదు ప్రక్రియకు సెప్టెంబర్ 30 చివరి తేదీ అని తెలిపారు. వరి సన్న రకాలకు ప్రభుత్వం అందించే బోనస్ పొందాలంటే గుర్తించిన ఏడు సన్న రకాల వరి పంట వివరాలను డిజిటల్ క్రాఫ్ట్ సర్వే లో నమోదు చేసుకోవాలని, ఇందుకు గడువు రేపటితో ముగియనున్నందున రైతులు వెంటనే నమోదు చేసుకోవాలని ఏడిఎ వెంకటేశం సూచించారు.

## మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అరెస్ట్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ఎర్రవల్లిలోని మాజీ సిఎం కెసిఆర్ ఫామ్‌హౌస్‌కు బయల్దేరి వెళ్తున్న మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మి లను శామీర్‌పేట పోలీసులు మంగళవారం శామీర్‌పేట రాజీవ్ రహదారిపై అడ్డుకున్నారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ కెసిఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి పిలుపు నిచ్చింది. దీంతో ఫామ్‌హౌస్ ముట్టడికి బయల్దేరిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడానికి బయల్దేరిన మాజీ



మంత్రి కెటిఆర్, హరీష్‌రావు, కెపి వివేకనందా, పల్లా రాజేశ్వరరెడ్డి, కౌశిక్ రెడ్డిలను హకింపేట ప్రాంతంలో అరెస్ట్ చేసి జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, కోవ లక్ష్మిలను శామీర్‌పేటలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన పికెటింగ్‌లో జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి, ఇన్స్‌పెక్టర్ కొండ నర్సింహారెడ్డి అరెస్ట్ చేసి బోయిన్‌పల్లిలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# మేడ్చల్ జిల్లాకు పాకిన రాజకీయ రగడ

### అరెస్టులు, ఆందోళనలు, దిష్టిబొమ్మల దహనాలు







**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి రి/బోడుప్పల్/ ఉప్పల్ :** స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అసెంబ్లీ వద్ద ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యల రగడ మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు పాకింది. ఉదయం ఎర్రవెల్లిలోని కెసిఆర్ నివాసానికి బయలుదేరిన పార్టీ కెటిఆర్, హరీష్‌రావు తదితర ఎమ్మెల్యేల వాహనాలను మేడ్చల్ జిల్లా పరిధిలోని హకీంపేట ప్రాంతంలో ముందస్తుగానే పెద్ద సంఖ్యలో మోహరించిన పోలీసులు ఆపి అడ్డుకొన్న క్రమంలో ఎమ్మెల్యేల ఆగ్రహంతో ఎదురు తిరిగి వాదించటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో బొల్లారం చౌరాస్తా నుండి ఎర్రవెల్లి వైపు ఎమ్మెల్యేలంతా పాదయాత్రగా బయలుదేరి వెళుతామని భీష్మించుకోవటంతో చివరికి పార్టీ నేతలందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని జవహర్‌నగర్, బొల్లారం పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు.మరో వైపు ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఆయా ప్రాంతాలకు చెందిన బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా ఆందోళనలకు దిగటంతో పలు చోట్ల స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగి తాతా మధు దిష్టిబొమ్మను ధగ్దం చేసి నిరసన వ్యక్తం చేసారు. అదే సమయంలో దీనికి ప్రతిగా బిఆర్ఎస్ శ్రేణులు సైతం నిరసనకు దిగటంతో ఇరు పార్టీ శ్రేణుల మధ్య ఉద్రిక్తవాతావరణం తలెత్తింది. అప్పటికే ఆ ప్రాంతంలో మోహరించిన పోలీసు బలగాలు పరిస్థితి చేయిదాటి పోకుండా నిరసనలకు దిగిన బిఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తాము శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే అదుపులోకి తీసుకోవటం పట్ల బిఆర్ఎస్ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులతో వాదనలకు దిగారు. పోలీసు వర్గాలు కాంగ్రెస్ పార్టీ తొత్తులుగా వ్యవహరిస్తున్నారంటూ బిఆర్ఎస్ నాయకులు ధ్వజమెత్తారు.కుషాయిగూడ పోలీసులు నిరసనలకు దిగిన బిఆర్ఎస్ నేతలు కాసం మహిపాల్ రెడ్డి,బద్రుద్దీన్,ప్రభుదాస్, అంజయ్య తదితరులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బోడుప్పల్ ప్రాంతంలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మను మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ తదితరులు దహనం చేసి బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వైపు వెళ్లేందుకు యత్నించగా పోలీసులు వారిని అడ్డుకొన్నారు. మరో పక్క జవహర్‌నగర్ ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిఆర్ఎస్ శ్రేణులు ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేసారు. మల్కాజిగిరి ప్రాంతంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసనలు తెలిపారు. బిఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసారు.

## స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా భారీ ర్యాలీ

### పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య



**ప్రజాపక్షం /వికారాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పై తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య, జిల్లా కేంద్రంలోని చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రెస్ట్ హౌస్ నుండి ఎంఆర్‌పి చౌరాస్తా వరకు భారీ ర్యాలీతో నిరసన కార్యక్రమం నిర్వహించి అనంతరం స్థానిక ఎన్‌టిఆర్ చౌరస్తావద్ద కెసిఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు, నవీన్‌రెడ్డిని ఎమ్మెల్సీ పదవి నుండి తప్పించాలని, స్పీకర్‌కు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సంస్కారం గల నాయకుడు అని రాజకీయాల్లో చిన్నప్పటి నుండి కష్టపడి మచ్చలేని నాయకునిగా స్పీకర్ స్థాయికి ఎదిగారని, స్పీకర్ స్థాయి అని కూడా చూడకుండా మాట్లాడారని, నిన్న జరిగిన సంఘటన చరిత్రలో ఒక చీకటి రోజుగా మిగులుతుందని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అధ్యక్షులు ధారసింగ్ జాదవ్, వికారాబాద్, మర్పల్లి, ధారూర్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, పట్టణ పార్టీ అధ్యక్షులు, కౌన్సిలర్లు,తదితరులు పాల్గొన్నారు.

## సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు అవగాహన కల్పించాలి : కలెక్టర్ దీపక్‌తివారి

**ప్రజాపక్షం/వికారాబాద్ :** సాంకేతిక పరిజ్ఞానం పై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ అధికారులను ఆదేశించారు. మంగళవారం వికారాబాద్ మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామం లో మొక్కజొన్న కంది పంటలను జిల్లా కలెక్ట ర్ క్షేత్రస్థాయిలో పర్యటించి పరశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రైతులకు



పంటల సాగుపై నైతనసాంకేతిక పై అవగాహన కల్పించాలన్నారు. వర్షాభావ ప్రభతవం వల్ల పంటల నష్టాన్ని నివారించేందుకు రైతులకు పలు సలహాలు ఇవ్వాలని అధికారులకు సూచించారు. నానో యూరియా వాడకం పట్ల రైతుల్లో అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ బస్వరాజ్ , జిల్లా వ్యవసాయ అధికారి కవిత, తహసీల్దార్ లక్ష్మి నారాయణ మండల వ్యవసాయ అధికారి ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

## గృహ నిర్బంధాలతో ఉద్యమాలు ఆపలేరు

**ప్రజాపక్షం/బోడుప్పల్:** ప్రతిపక్షాల గొంతుకలను అణచివేసే విధం గా గృహ నిర్బంధాలతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని ఫిర్జాదిగూడ మాజీ మేయర్, బిఆర్ఎస్ నేత జక్క వెంకటరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. కాంగ్రెస్ పార్టీ విధానాలకు నిరసనగా ప్రజాస్వామ్య రీతిలో వెళ్లేందుకు సిద్ధమవుతున్నామని తమ నేతలను గృహనిర్బంధాలు చేసి పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని పాలించే కాంగ్రెస్ పార్టీ చెప్పే ప్రజాపాలన అంటే ఇదేనా అని ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించి న తీరు అమానుషంగా ఉందని, దీన్ని ప్రజలంతా వ్యతిరేకిసున్నారన్నారు. రేవంత్‌రెడ్డి పాలనా వైఫల్యంతో ఎన్నికల హామీలను నెరవేర్చ క పోగా ప్రశ్నించే వారిని అడ్డుకోవటం ఎంతవరకు సబబన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు రఘువర్ధనర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు హరిశంకరరెడ్డి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## కోడింగ్ పోటీలో అనురాగ్ యూనివర్సిటీ సత్తా

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** సాంకేతిక రంగంలో విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీస్తూ అనురాగ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కోడ్‌వర్స్–2026 కోడింగ్ పోటీలో విద్యార్థులు ప్రతిభ చాటారు. సమస్య పరిష్కారం, తార్కిక ఆలోచన పోటీ ప్రోగ్రామింగ్ పై పట్టు పెంపొందించడమే లక్ష్యంగా సెప్టెంబర్ 1న ఈ పోటీ నిర్వహించారు.



అనురాగ్ విశ్వవిద్యాలయంలోని కృత్రిమ మేధస్సు యంత్ర అభ్యాస విభాగానికి చెందిన కోడింగ్ కబ్స్ క్లబ్ ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం బిటెక్ విద్యార్థుల కోసం నిర్వహించిన పోటీకి హ్యాకర్‌రాంక్ సహకారం అందించింది. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలి దశలో 224 మంది పోటీపడగా ప్రతిభ ఆధారంగా 60 మందిని రెండో దశకు ఎంపిక చేశారు. నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరిస్తూ విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. రెండో దశలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అభినందనలు బహుమతులు అందజేశారు. తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచా రు. ఈ కార్యక్రమాన్ని అధ్యాపక సమన్వయకర్త డా.పద్మిని చట్టు, విద్యార్థి సమన్వయకర్త అభినవ్ రెడ్డి సమన్వయంతో నిర్వహించారు. కృత్రిమ మేధస్సు యంత్ర అభ్యాస విభాగాధిపతి డా.ఎ. మల్లికార్జున రెడ్డి నాయకత్వంలో పోటీ విజయవంతమైంది. కార్యక్రమానికి సహకరించిన విశ్వవిద్యాలయ యాజమాన్యం ఉన్నతాధికారులకు కోడింగ్ కబ్స్ క్లబ్ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/బంట్వారం :** బంట్వారం మండల కేంద్రంలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా పరిషత్తు ఉన్న పాఠశాల విద్యార్థులు కార్యక్రమంలో భాగంగా 'అందరు చదవాలి అందరు ఎదగాలి', 'అక్షర జ్యోతి వెలిగించు అవని వెలుగు అందించు' అంటూ నినాదాలతో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా అక్షరాస్యతా దినోత్స వేడుకలను జరుపుకుంటారు. సమాజంలో ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్యావకాశాలు కల్పించేందుకు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్న ప్రభుత్వం





**ప్రజాపక్షం/జవహర్ నగర్:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మరణాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోరుకోవడం అత్యంత దారుణమని, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని మాజీమంత్రి, బిఆర్ఎస్ నేత తన్నీరు హరీష్ రావు తీవ్రంగా మండిపడ్డారు. ఎర్రవల్లి వైపు వెళ్తున్న హరీష్ రావు సహా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులను పోలీసులు హకీంపేట వద్ద అదుపులోకి తీసుకుని, జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ సిఎం కెసిఆర్ చావును కోరుకోవడం సంస్కారహీనమని దుయ్యబట్టారు.

**సభ్యత్వ రద్దు డిమాండ్:** కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వీర్లపల్లి శంకర్ శాసనసభ సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**మహిళా ఎమ్మెల్యేలపై దాడి:** అసెంబ్లీ ప్రాంగణంలో మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని, పోలీసుల వైఖరిని హరీష్ రావు తీవ్రంగా ఖండించారు. విలేకరుల సమావేశం లో హరీష్ రావుతో పాటు మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు బండారి లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, కెపి వివేకానంద, ఎమ్మెల్సీలు, జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య, తదితరులు పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవాలపై అవగాహన సమావేశం

**ప్రజాపక్షం/నవాబుపేట్ :** వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని నవాబుపేట్ ఎస్సై గిరి అన్నారు. మంగళవారం నవాబుపేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వినాయక మండపాల నిర్వాహకులతో పోలీసులు ఆర్గనైజింగ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులకు ఎస్సై గిరి పలు సూచనలు చేశారు. మండపాల ఏర్పాటుకు సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. డిజెలు, సౌండ్ సిస్టమ్‌లను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వినియోగించాలని తెలిపారు. విద్యుత్ భద్రత, అగ్నిప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని, మహిళలు, చిన్నారులు, భక్తుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మండపాల నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడరాదని అధికారులు స్పష్టం చేశారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, యువజన సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





## మధ్యవర్తిత్వం ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కరించవచ్చు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** మధ్యవర్తిత్వం ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కరించవచ్చునని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జిఎస్ఎల్ ప్రియాంక అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం కేసులు, మధ్యవర్తిత్వులకు సమావేశం నిర్వహించి మీడియేషన్ ఫర్ నేషన్ 3.0 గూర్చి అవగాహన, ఈ మధ్యవర్తిత్వం ద్వారా కేసులు త్వరితగతిన, కుటుంబ తగాదాలు, కమర్షియల్ డిస్ప్యూట్స్, ఆస్తి తగాదాలు అన్ని రకాల సివిల్, ఆయోదయోగ్యమైన కేసులు పరిష్కరించవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా ఒక కరపత్రం విడుదల చేశారు. ఈ సమావేశంలో మల్కాజ్‌గిరి, మేడ్చల్, కూకట్‌పల్లి మీడియేటర్స్ పాల్గొన్నారు.



## మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించండి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అలియాబాద్ మున్సిపాలిటిలో వనమహోత్సవం–2026 పురస్కరించుకుని పలు వార్డుల్లో ప్రతి ఇంటికి ఆరేసి మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపాలిటిలో పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా వనమహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని నిరంతరం పర్యవేక్షిస్తు కాపాడాలని అధికారులకు, ప్రజాప్రతినిధులుకు సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ మౌనిక దినేష్, నాయకుడు రాంప్రసాద్‌గౌడ్, ఎఇఇ సనా షాహీన్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ తాత మధు, నవీన్‌రెడ్డిలను బర్తరఫ్ చేయ్యాలి : బంట్వారం సర్పంచ్‌లు

**ప్రజాపక్షం/బంట్వారం :** ఎమ్యెల్సి తాత మధు, నవీన్ రెడ్డిలను వెంటనే బర్తరఫ్ చేయాలని బంట్వారం మండల కేంద్రంలో మండల సర్పంచులు మంగళవారం డిమాండ్ చేశారు. సర్పంచ్‌లు మాట్లాడుతూ దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ కూమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరైనవి కావని ఎమ్యెల్సి తాత మధు, నవీన్ రెడ్డిలు వెంటనే స్పీకర్ గడ్డం ప్రసాద్ కూమార్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బాలయ్య, సంజీవయ్య, కమలమ్మ, నాయకులుపాల్గొన్నారు.



## బిఆర్ఎస్ నాయకుల అరెస్టులు

**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లా వ్యాప్తంగా బిఆర్ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసిన వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేష్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. మాజీ మండల పార్టీ అధ్యక్షులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వికారాబాద్ సోషల్ మీడియా అనిల్ యువనాయకులు శుభన్‌రెడ్డి అధ్వర్యంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ చావుకోరడం నిరసిస్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం పోలీసులు అరెస్టు చేసి విడిచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయడం చేతకాక డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని అన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కోసం నిరంతరం వెంటాడుతామన్నారు. తప్పుచేయడనుకున్న తాతా మధు తప్పుచేశారు అని అధికారపార్టీ నాయకులు విమర్శించడం చూస్తుంటే ఓడిపోతాం అనే భయం పట్టుకుందన్నారు.

# గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

భక్తుల భద్రత,
పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట
ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి







**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని ఎలాంటి అవాంతరాలు లేకుండా సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నామని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో మంగళవారం కమిషనర్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. నిమజ్జన ఏర్పాట్ల పురోగతిని సమీక్షించిన కమిషనర్, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రస్తావించిన సమస్యలు, అవసరాలపై చర్చించారు. సమావేశంలో అదనపు కమిషనర్ (పారిశుద్ధ్యం) సి.ఎన్.రఘుప్రసాద్, చీఫ్ ఇంజనీర్ బి.ఎల్.శ్రీనివాస్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. నిమజ్జన ప్రాంల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్రేన్‌లు, అంబులెన్సులు, ఫైర్ ఇంజిన్లు, అవసరమైన సిబ్బందిని అందుబాటులో ఉంచాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు, క్రౌడ్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. నిమజ్జనం జరిగే చెరువులు, పాండ్‌ల వద్ద పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని, క్లీనింగ్, డీసిల్టింగ్ పనులను పూర్తి చేసి అవసరమైన చోట తాజా నీటిని నింపాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రాంతాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, లైటింగ్, భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

### కృత్రిమ నిమజ్జన కొలనుల పరిశీలన

సహజ జలవనరులపై నిమజ్జన ప్రభావాన్ని తగ్గించే లక్ష్యంతో ఎంఎంసి పరిధిలో ఏర్పాటు చేస్తున్న కృత్రిమ గణేశ్ నిమజ్జన కొలనుల ఏర్పాట్లను కమిషనర్ క్షేత్రస్థాయిలోపరిశీలించారు. మన్సూర్‌నగర్ బేబీపాండ్ నాగోల్ సర్కిల్, నాగోల్ బేబీ పాండ్ ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించారు. చిన్న పరిమాణంలోని గణేశ్ విగ్రహాలను కృత్రిమ నిమజ్జన కొలనుల్లోనే నిమజ్జనం చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎల్.బి.నగర్ జోన్ పరిధిలోని హయత్‌నగర్ ఎంపిడిఓ, ఎంఆర్ఓ కార్యాలయం, సరూర్‌నగర్, ఎన్‌టిఆర్ నగర్ వెజిటబుల్ మార్కెట్, సరూర్‌నగర్ ప్రభుత్వ కళాశాల మైదానం, బైరామల్ గూడ జంక్షన్, హయత్‌నగర్ ఎక్వార్టర్స్ పార్క్, సచివాలయనగర్ ట్రయాంగిల్ పార్క్ వద్ద ప్రతిపాదించిన కృత్రిమ నిమజ్జన ప్రాంతాలను కమిషనర్ పరిశీలించారు.

### ఎప్పటికప్పుడు చెత్త తరలించాలి

చెత్త పేరుకపోకుండా ఎప్పటికప్పుడు తరలించేందుకు చర్యలు చేపట్టాలని ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. నాగోల్ సర్కిల్ పరిధిలోని జైపూర్ కాలనీ రోడ్డులో కమిషనర్ తనిఖీ నిర్వహించారు. గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల వద్ద చెత్త పేరుకుపోవడాన్ని గుర్తించారు. చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఎల్.బి.నగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం ఎస్‌సిటిని పరిశీలించిన కమిషనర్, సాట్ ఆటోల నిర్వహణ, వ్యర్థాల తరలింపు ప్రక్రియను సమీక్షించారు.

## మహిళల అభివృద్ధికి పాటుపడాలి



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** మహిళల అభివృద్ధి కోసం పాటుపడాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మాజీ జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు,గోపులారం మాజీ సర్పంచ్ పొడవు శ్రీనివాస్ జన్మదిన సందర్భంగా గ్రామంలోని 41 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి వారికి కుట్టుమిషన్లను అందించారు. గ్రామంలో యువకులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బొల్లారం వెంకటరెడ్డి, మోకిలా కాంగ్రెస్ అధ్యక్షుడు గౌండ్ర సత్యం, సర్పంచ్‌లు చిట్టి శేఖర్, బండ లక్ష్మీ నరసింహ, రవీందర్ రెడ్డి, హరిత కృష్ణారెడ్డి, బీరయ్య, లక్ష్మణ్ నాయక్, ఎంపిడిఓ ప్రవీణ్ కుమార్, ఎపిఓ నాగభూషణం, నాయకులు కాంతిరెడ్డి, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు వేగవంతం



**ప్రజాపక్షం/యాచారం :** మండలంలో ఉపాధి హామీ పథకం కింత చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను వేగవంతం చేయాలని ఎంపిడిఓ రాధరాణి అన్నారు. మండల పరిధిలోని ధర్మన్నగూడ, గ్రామంలో పర్యటించారు. నర్సరీలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కలను నాటాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామపంచాయతీ రికార్డులను సక్రమంగా రాయాలన్నారు. అవకతవకలు జరిగితే పంచాయతీ కార్యదర్శులపై చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉపాధిహామీ పథకం ఎపిఓ లింగయ్య, పాల్గొన్నారు.

## ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం




**ప్రజాపక్షం/యాచారం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో పూర్తిగా విఫలం అయ్యాయని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో డివైఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా మహాసభలు జరిగాయి మహాసభలకు ముఖ్యఅతిధిగా అనగంటి వెంకటేశ్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అలంపల్లి జంగయ్య, రాఘువేంధర్, జిల్లా కార్యదర్శి జగన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు శివశంకర్, మహెశ్, దినేశ్, కవిత, ప్రశాంత్, శివ, హఫిజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఆపదలో ఉన్న పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఫరూఖ్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం అయ్యావారిపల్లి గ్రామానికి చెందిన సురేష్ కుమార్తె చిన్నారి నిషిక ఆనారోగ్యంతో హైద్రాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపధ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఒక లక్ష వరకు ఎల్‌ఓసి మంజూరైందని, ఆ ఎల్‌ఓసి బాధితురాలి కుటుంబ సభ్యులకు అంధించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, సింగిల్ విండో వైస్ చైర్మన్ తుపాకుల శేఖర్, రమేష్, హరినాథ్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, మాధవులు, ప్రసాద్, జంగయ్య, గంగారాం, జాంగారి రవి, యాదగిరి పాల్గొన్నారు.

## మంటపాలకు అనుమతి తప్పనిసరి



**ప్రజాపక్షం/కొందుర్గు:** గణేష్ ఉత్సవాలకు ఏర్పాటు చేసే ప్రతి మంటపానికి అన్‌లైన్‌లో ధరఖాస్తులు చేసుకునేందుకు నిర్వహకులు కృషి చేయాలని కొందుర్గు ఎస్ఐ బిఎస్ఎస్ వరప్రసాద్ వివరించారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలో గణేష్ ఉత్సవాలపై శాంతి సంఘం సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కొందుర్గు ఎస్ఐ చత్రిక, హెచ్ కానిస్టేబుల్ శ్రీనయ్యతోపాటు గణేష్ మంటపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## కారు–బైక్ ఢీకొని యువకుడు మృతి



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** కారు బైక్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో జరిగింది. చిన్న శంకర్ పల్లికి చెందిన నిశ్వంత్(19) మధ్యాహ్నం సమయంలో అతని ఫ్రండ్ వెంకటేష్ తో కలిసి శంకర్‌పల్లి నుంచి బద్దం సురేందర్ రెడ్డి గార్డెన్ వైపు బైక్‌పై వెళ్తుండగా ఆగి ఉన్న ఫార్చునర్ కారును ఢీకొట్టారు. దీంతో తీవ్ర గాయాలయిన నిశ్వంత్‌ను వెంటనే సంగారెడ్డి గవర్నమెంట్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. వెనకాల కూర్చున్న అతని స్నేహితుడికి తీవ్ర గాయాలయ్యాయి. శంకర్‌పల్లి పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నారు.

## పోషణ మాసంపై అవగాహన

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** పోషణ మాసం సందర్భంగా నిర్దేశించిన ప్రధాన అంశాలపై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి అన్నారు. మంగళవారం మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 9వ జాతీయ పోషణమాసం 2026 కార్యక్రమాలకు సంబంధించిన అంశాలతో కూడిన పోస్టర్‌ను జిల్లా సంక్షేమ అధికారి జి.శాంతిశ్రీలో కలిసి అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహించనున్న పోషణ మాసం సందర్భంగా జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం,ఆరోగ్యం, బాలల సమగ్ర అభివృద్ధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

## హియరింగ్ ప్రక్రియలో సందేహాల నివృత్తి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రతి దరఖాస్తుదారునికి హియరింగ్ ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాజేంద్రనగర్‌లోని ఇవిఎం గోడౌన్‌ను, తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సర్ హియరింగ్ ప్రక్రియను కలెక్టర్ సి.నారాయణరెడ్డి తనిఖీ చేశారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్‌లో భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఇతర ఎన్నికల సామగ్రి, వాటిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఇవిఎంలు, ఎన్నికల సామగ్రిని భద్రపరుస్తున్న తీరును సంబంధిత అధికారులను అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్‌ను తెరిచి ఇవిఎంలు, ఇతర ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. తనిఖీ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎన్నికల నిబంధనల ప్రకారం గోడౌన్‌కు తిరిగి సీల్ వేయించారు. అనంతరం రాజేంద్ర నగర్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్(సర్) హియరింగ్ ప్రక్రియ ను కలెక్టర్ పరిశీలించారు. హియరింగ్‌కు హాజరవుతున్న ప్రజలతో మాట్లాడి, వారి దరఖాస్తులు, సమర్పిస్తున్న పత్రాల వివరాలను తెలుసుకున్నారు. ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా హియరింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుదారునికి హియరింగ్ ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్‌డిఓ శ్రీధర్, తహసీల్దార్, వేర్‌హౌస్ ఇన్‌చార్జ్ రాములు, ఎన్నికల విభాగం అధికారి రవీంద్ర గుప్తా పాల్గొన్నారు.

## శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు

షాద్‌నగర్ జోన్ డిసిపి శిరీష




**ప్రజాపక్షం/కొత్తూరు:** గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు నిర్వాహకులు కృషి చేయాలని షాద్‌నగర్ జోన్ డిసిపి శిరీష సూచించారు. మంగళవారం కొత్తూరు మండల కేంద్రంలో నిర్వహించిన శాంతి సంఘం సమావేశానికి వివిధ గ్రామాల నుండి నిర్వాహకులు హాజరయ్యారు. వివిధ రాజకీయ పార్టీలతోపాటు కుల సంఘాలు, విద్యావేత్తలు హాజరై తమతమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా డిసిపి శిరీష మాట్లాడుతూ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే సమయంలో పోలీస్ శాఖ, విద్యుత్ శాఖల నుండి అనుమతులు తీసుకోవాలని సూచించారు. గణేష్ మండపాల వద్ద విధిగా సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, బలవంతపు చందాలకు పాల్పడితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సాధ్యమైనంత వరకు మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు కృషి చేయాలని, ఏమైన ఇబ్బందులు ఉంటే 112కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సౌండ్ బాక్స్‌లు రాత్రి 10గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని, డిజెలకు ఎలాంటి అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రతి గణేష్ మండపంలో నిర్వాహకులు విధిగా ఉండాలని, విగ్రహాల వద్ద ఆసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాన్స్‌కో ఎఇ రమేష్‌గౌడ్ మాట్లాడుతూ విద్యుత్ ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, సొంత నిర్ణయాలు తీసుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. మండపాలు ఏర్పాటు చేయవద్దని, నాణ్యమైన విద్యుత్ వైరు ఏర్పాటు చేసుకొవాలని, విధిగా ఎంసిబి బాక్స్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీనారాయణ, కొత్తూరు సిఐ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

## సబితమ్మపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ బిఆర్ఎస్ ఆందోళన



**ప్రజాపక్షం/శంకర్‌పల్లి:** మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ శంకర్‌పల్లి పట్టణంలో మండల కార్యాలయం, ప్రధాన చౌరస్తాల వద్ద బిఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసుల తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ప్రధాన చౌరస్తాలో ఎమ్మెల్యే శంకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించే తీరు బాధ్యతాయుతంగా ఉండాలన్నారు. సబితా ఇంద్రారెడ్డిపై జరిగినట్లు ఆరోపణలు వస్తున్న పోలీసుల వ్యవహారశైలినిఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్, మున్సిపల్ అధ్యక్షుడు బద్దం శశిధర్ రెడ్డి, న్యాయవాది ఉపేందర్‌రెడ్డి, నాయకుడు వాసుదేవ్ కన్నా, ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, శేరిగూడ సర్పంచ్ ఇంద్రసేనారెడ్డి, కొండకల్ సర్పంచ్ శేఖర్, నాయకలు బి.శ్రీధర్, దోసాద నరసింహారెడ్డి, సత్యానారాయణరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గండేటి శ్రీనాథ్ గౌడ్, మహేందర్‌రెడ్డి, సుధాకర్, విజయ్ కుమార్, మన్నె లింగం ముదిరాజ్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దిష్టిబొమ్మ దహనం

**ఇబ్రహీంపట్నం/ఇబ్రహీంపట్నం :** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధును తక్షణమే సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చౌరస్తా సమీపంలో సాగర్ రహదారిపై రాస్తారోకో ధర్నా నిర్వహించి తాత మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో గడ్డన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, నాయకులు శ్రీధర్, కొత్త కురమ శివకుమార్, రాచర్ల వెంకటేశ్వర్లు, కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మంఖాల దాసు, ఎండి.గౌస్, హన్మంతరెడ్డి, కౌన్సిలర్లు నీలం భాను బాబు, దారు రాఘవేందర్, భార్గవి రాజు, రాందాస్ నాయక్, కోడూర్ రమేష్‌తో పాటు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## తాతా మధును మండలి నుంచి బర్తరఫ్ చేయాలి

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు
చల్లా నరసింహారెడ్డి డిమాండ్




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తాతా మధును శాసన మండలి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ రాష్ట్ర అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ శాసనసభ గౌరవాన్ని, స్పీకర్ పదవి ప్రతిష్ఠను కించపరిచే విధంగా బిఆర్ఎస్ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. డిసిసి అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన తాతా మధు వెంటనే క్షమాపణ చెప్పాలని, ఆయనపై తగిన చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్ పదవి అత్యంత గౌరవప్రదమైనదని, ఆ పదవిని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర టి పిసిసి ప్రధాన కార్యదర్శి సానం శ్రీనివాస్, రాష్ట్ర ఎస్‌సి సెల్ వైస్ చైర్మన్ జల్పల్లి నరేందర్, నాయకులు గుర్రం రణధీర్‌రెడ్డి, సులోచన, నర్కూడ గ్రామసర్పంచ్ శేఖర్ యాదవ్, నాయకులు సంజయ్ యాదవ్, ఖలీద్, మహేందర్, బొబ్బిలి శేఖర్, సామ ఇంద్రపాల్‌రెడ్డి, హర్మిందర్ సింగ్, మంగళారం గోవర్ధన్‌రెడ్డి, ధనంజయ్, సాయినికేశ్, విఘ్నేష్ కట్కూరి, పృథ్వీ గౌడ్, గోపాలకృష్ణ, స్వప్న, మహేష్ గౌడ్, చందు యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోండి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ జాతిపిత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చావుకోరిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని సభ్యత్వం రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మలను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పిలుపుమేరకు నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల కేంద్రాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజకీయ విమర్శలు చేయాలంటే విధానాలు, పాలనపై చేయాలని, వ్యక్తిగతంగా దిగజారుడుగా మాట్లాడటం సరికాదని హెచ్చరించారు. ప్రజల మనోభావాలు దెబ్బతిసే విధంగా ఉన్నాయని, ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే బిఆర్ఎస్ శ్రేణులు చూస్తు ఊరుకునే ప్రసక్తి లేదన్నారు. బాధ్యతయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్యే హుందాగా వ్యవహరించాలని, చేసిన వ్యాఖ్యలకు తక్షణమే తెలంగాణ సమాజం ముందు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, మాజీ ఎంపిపిలు, మాజీ వైస్ ఎంపిపి, సర్పంచులు, బిఆర్ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

## రూ.1.42 కోట్ల హాష్ ఆయిల్ స్వాధీనం



**ప్రజాపక్షం/కొత్తూర్:** కొత్తూర్ పోలీసులు, ఎస్ఓటటి, షాద్‌నగర్ జోన్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో రూ.1.42 కోట్ల విలువైన 11.319 కిలోల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం ఇన్ముల్ నర్వలోని పిఅండ్ జి కంపెనీ రోడ్డు సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని హెచ్.ధ్రువ్ అలియాస్ ధ్రువ్ జోషి (30)గా గుర్తించారు. అతను మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా అల్వాల్‌కు చెందినవాడని, ప్రస్తుతం ఒడిషాలో నివసిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతని వద్ద ఉన్న బ్యాగ్ తనిఖీ చేయగా 11ప్యాకెట్లలో హాష్ ఆయిల్ లభించింది. విచారణలో ఈ హాష్ ఆయిల్‌ను ఒడిశాకు చెందిన రోహిత్ అనే వ్యక్తి వద్ద నుంచి తీసుకుని కొత్తూర్ ప్రాంతంలో విక్రయించేందుకు తీసుకువచ్చినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు 11.319కిలోల హాష్ ఆయిల్‌తో పాటు ఒక మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్‌ను డిసిపి శిరీష, ఎసిపి ఎస్.లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో, ఇన్‌స్పెక్టర్ బి.నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## జిఒ-97 రద్దు చేయాలి



**ప్రజాపక్షం/గోషామహల్:** జిఒ 97, శక్తి స్కీమ్‌ను రద్దుచేసి పాత పద్ధతిలో పాలిటెక్నిక్ విద్యను కొనసాగించాలని విద్యార్థి సేన అధ్యక్షుడు టికె శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యార్థి సేన ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి యత్నించగా పోలీసులు వారిని అరెస్ట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థుల హక్కు... ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి పెండింగ్ నిధులను తక్షణమే విడుదల చేసి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. శక్తి స్కీమ్, జిఒ 97ను రద్దు చేసి పాత పద్ధతిన పాలిటెక్నిక్‌ను కొనసాగించాలన్నారు.

## మాదకద్రవ్యాలకు యువత దూరం



**ప్రజాపక్షం/హైదరాబాద్‌సిటీ:** మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్ నాంపల్లి కార్యదర్శి ఎ.శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సెషన్స్ డివిజన్, నాంపల్లి హైదరాబాద్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, నివారణ అలాగే చట్టపరమైన అంశాలపై న్యాయ అవగాహనలో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

## హామీలు అమలు చేయాలి



**ప్రజాపక్షం/పంజాగుట్ట/అమీర్‌పేట్/సనత్‌నగర్:** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. మాజీ కార్పొరేటర్ మహేష్‌యాదవ్ పంజాగుట్టలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని డిమాండ్ చేశారు. ఇదిలాఉండగా.. బల్కంపేట్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ కార్పొరేటర్ శేషు కుమారి వినతిపత్రం అందించారు. కాగా బిఆర్‌ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నేతలు సురేందర్, గడ్డం శ్రీధర్, జయంత్, బాలకృష్ణ, మోహన్, ప్రభాకర్, జంగయ్య, ఇందిర, సునీత, రజిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

## హస్తం నేతల నిరసన



**ప్రజాపక్షం/ముషీరాబాద్:** స్పీకర్‌ను అవమానించిన ఎమ్మెల్సీ మధుపై చర్యలకు డిమాండ్ చేస్తూ ముషీరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గం నేతలు ఇందిరాపార్క్ క్రాస్‌రోడ్డు వద్ద భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. ముషీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ విభాగం చైర్మన్ కె.సుబ్బారావు నేతృత్వంలో ఈ నిరసన జరిగింది. కార్యక్రమంలో సికింద్రాబాద్ జిల్లా ఎస్సీ వైస్ చైర్మన్ రమేష్ యాదవ్, కవాడిగూడ డివిజన్ ప్రెసిడెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## తాతా దిష్టిబొమ్మ దహనం



**ప్రజాపక్షం/యూసుఫ్‌గూడ:** స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసభ్య పదజాలంతో దూషించారని ఆరోపిస్తూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. యూసుఫ్‌గూడ బస్తీలోని అంబేద్కర్ విగ్రహం వద్ద తాతా మధు దిష్టిబొమ్మను దహనం చేశారు.

## మాలలకు తీరని అన్యాయం




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** రిజర్వేషన్ల ప్రక్రియలో మాల సామాజిక వర్గానికి తీరని అన్యాయం జరిగిందని నేషనల్ అంబేద్కర్ సేన ఆరోపించింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలూకా రాజేష్ మాట్లాడుతూ...ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో మాలలకు జరిగిన అన్యాయాలపై చర్చించి ఈనెల 16 లోపు రెండు రోస్టర్ పాయింట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో మాల సంఘాల నాయకులు నాను, బొమ్మల రాజన్న, భాస్కర్, విజయ్, మణికంఠ పాల్గొన్నారు.

## వీధుల్లో వినాయక సామాగ్రి



**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** విక్రయించే వస్తువు ఎక్కడ? అనేది కాదు. వినియోగానికి ఏ మేరకు ఉపయుక్తం.. అనేది ముఖ్యం. ఈ నేపథ్యంలోనే పది రోజుల పాటు అట్టహాసంగా జరిగే వినాయక ఉత్సవాల నేపథ్యంలో సుల్తాన్‌బజార్ వీధుల్లో ప్లాస్టిక్ అలంకరణ సామాగ్రి విక్రయిస్తున్నారు. చిరువ్యాపారులకు ఈ విక్రయాలు ఉపాధి అందిస్తున్నాయి. రంగురంగుల కృత్రిమ పూలు, ఆకర్షణీయమైన జాలీలు, థర్మాకోల్ ఆర్చరీలు, విద్యుత్ దీపాల సెట్టింగులతో రూపొందించిన మినీ మండపాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కోఠి, ఇసామియాబజార్, బ్యాంక్‌స్ట్రీట్, తిలక్‌పార్క్, సుల్తాన్‌బజార్, పుత్లీబౌలి.. తదితర ప్రాంతాల్లో లభిస్తున్న అలంకరణ సామాగ్రి విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

### విద్యా సంస్థల్లో ఫైర్ సేఫ్టీపై

# కఠిన నిబంధనలు

- ఫైర్ ఎన్‌ఒసిలపై ఏకరీతి విధానం.. త్వరలో ప్రాక్టికల్ చెక్‌లిస్ట్
- అనధికార వ్యక్తులను నమ్మొద్దు: ఫైర్ సర్వీసెస్ డిజి విక్రమ్ సింగ్ మాన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యా సంస్థల్లో అగ్నిప్రమాదాల నివారణ, విద్యార్థులు, సిబ్బంది ప్రాణరక్షణకు అవసరమైన ఫైర్ సేఫ్టీ ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ డిజి విక్రమ్ సింగ్ మాన్ స్పష్టం చేశారు. విద్యా భవనాలకు ఫైర్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఒసి) జారీ, తనిఖీల ప్రక్రియపై స్పష్టత కల్పించేందుకు మంగళవారం హైదరాబాద్‌లోని ఫైర్ సర్వీసెస్ డీజీ కార్యాలయంలో విద్యా సంస్థల ప్రతినిధులతో పరస్పర చర్చా సమావేశం నిర్వహించారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో వివిధ వయసుల విద్యార్థులు ఎక్కువ సమయం గడుపుతున్నందున ప్రతి విద్యా భవనంలో కనీస అగ్నిమాపక భద్రతా చర్యలు తప్పనిసరిగా ఉండాలని డీజీ పేర్కొన్నారు. ఫైర్ సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉండటంతో పాటు అవి ఎప్పటికప్పుడు పనిచేసే స్థితిలో ఉండేలా నిర్వహణ చేపట్టాలని సూచించారు. సమావేశంలో సుమారు 30 మంది విద్యా సంస్థల సంఘాల ప్రతినిధులు పాల్గొని ఫైర్ ఎన్‌ఓసీ విధానం, భద్రతా నిబంధనల అమలు, పాత భవనాల్లో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా ఇప్పటికే నిర్మించిన భవనాల్లో సెట్‌బ్యాక్స్, బయటకు వెళ్లే మార్గాలు (మీన్స్ ఆఫ్ ఎస్కేప్), భవన వినియోగదారుల సంఖ్యకు అనుగుణంగా ప్రాణ రక్షణ ఏర్పాట్లు కల్పించడం వంటి అంశాలపై ప్రతినిధులు తమ సందేహాలను వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే కొనసాగుతున్న పాఠశాలలు, జూనియర్ కళాశాలల తనిఖీల్లో అధికారులు ఒకే విధమైన ప్రమాణాలను పాటించేలా ఏకరీతి చెక్‌లిస్ట్, విధానాన్ని రూపొందించాల్సిన అవసరంపై సమావేశంలో చర్చ జరిగింది. పాత భవనాల్లో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని తనిఖీల సమయంలో అధికారులు అనుసరించాల్సిన ప్రాక్టికల్ చెక్‌లిస్ట్‌ను ఫైర్ శాఖ త్వరలో జారీ చేస్తుందని డిజి హామీ ఇచ్చారు. ఫైర్ ఎన్‌ఒసిల నకిలీ తయారీ, ఫోర్జరీ, అనధికారిక ఎన్‌ఒసిల సమర్పణను అరికట్టేందుకు పారదర్శకమైన, సమర్థవంతమైన ధ్రువీకరణ వ్యవస్థను రూపొందించాల్సిన అవసరాన్ని కూడా సమావేశంలో ప్రస్తావించారు. ఫైర్ ఎన్‌ఒసిలు ఇప్పిస్తామని హామీ ఇచ్చే అనధికార వ్యక్తులు, మధ్యవర్తుల బారిన పడవద్దని డీజీ విక్రమ్ సింగ్ మాన్ విద్యా సంస్థల యాజమాన్యాలను హెచ్చరించారు. ఇలాంటి చర్యలు సమస్యలకు దారితీయడంతో పాటు చట్టపరమైన చర్యలకు కారణమవుతాయని స్పష్టం చేశారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలను నిర్వహించేందుకు స్వేచ్ఛ ఉన్నప్పటికీ, సంబంధిత అగ్నిమాపక భద్రతా నిబంధనలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాల్సిందేన నిపాటించాల్సిందేనని పేర్కొన్నారు.

## పాఠశాలలను ఫైర్ ఎన్‌ఒసి నుంచి మినహాయించాలి

- ప్రస్తుతం ఉన్న పాఠశాలకు స్వీయ ధ్రువీకరణ తీసుకుంటే సరిపోతుంది
- ఫైర్ శాఖ డైరెక్టర్ కు విన్నవించిన ట్రస్మా బృందం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రస్తుతం నిర్వహిస్తున్న పాఠశాలలకు ఫైర్ ఎన్‌ఒసిల నుంచి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాల యాజమాన్య సంఘం (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నానక్ రామ్ గూడ లోని తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ సివిల్ డిఫెన్స్ డిపార్ట్మెంట్ (ఐ ఆర్ డి ఎ ) డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ కి ప్రతినిధి బృందం వినతి పత్రాన్ని అందజేశారు. ఫైర్ ఎన్ ఒ సి పొందడం లో ఎకనామికల్ పాఠశాలల నిర్వహకులు పడుతున్న బాధలు,వాస్తవాలను ఆయన దృష్టికి తీసుకురావడం తీసుకెళ్లారు. నూతన నిబంధనలు రూపకల్పనాలో తమ అభిప్రాయాలను, సూచనలను పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే నడుస్తున్న పాఠశాలలకు కూడా ఫైర్ ఎన్‌ఓసి ని అడగడం సరికాదని ఎస్ ఎన్ రెడ్డి తెలిపారు. పాఠశాల నిర్వాహకుల వద్ద నుంచి స్వీయ ధ్రువీకరణ తీసుకుంటే సరిపోతుందని తెలిపారు. డే స్కాలర్ స్కూల్స్ కమర్షియల్ క్యాటగిరిలో పరిగణించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. సెట్బాక్ లో రిలాక్సేషన్ ఇవ్వాలని కోరారు. ఎన్ ఓ సి సర్టిఫికేషన్ ఫీజు నామినల్ చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో ఫైర్ సేఫ్టీ అవేర్నెస్ ప్రోగ్రాం కండక్ట్ చేయాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలను ఇతర వ్యాపార సముదాయాలు, హోటళ్లు, సినిమా థియేటర్లతో పోల్చి చూడవద్దని వాటికి పాఠశాలకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని పాఠశాలను ప్రత్యేక కేటగిరి కింద పరిగణించి నిబంధనలను సరళీకృతం చేయాలని కోరారు. ఇందుకు డైరెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కె అనిల్ కుమార్,కోశాధికారి కె శ్రీకాంత్ రెడ్డి లు హాజరయ్యారు.

## గురువు లేనివారు గురుతు ఎరుగరు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** గురువు లేని వారికి గుర్తింపు ఉండదని ప్రముఖ విద్యావేత్త సంఘ సేవకులు, నోబుల్ స్కూల్స్, ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ అధినేత తాజుద్దీన్ అన్నారు.లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 సి లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ సిటీ ఆధ్వర్యంలో కాప్రా సర్కిల్ పరిధిలోని కాప్రా నోబుల్ పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయుడుగా గుర్తింపు పొందిన ఆయనను లయన్స్ అధ్యక్షులు వడ్లోజు జ్యోతిర్మయాచారి సన్మానించారు. అనేక మందికి ఉచిత విద్యను అందిస్తూ తన ఔదార్యాన్ని చాటుతున్న తాజుద్దీన్ లాంటి సంఘ సేవాకులను సన్మానించడం గొప్ప విషయని అన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు బిక్షపతి, లయన్ శివరాజ్,అనంతలక్ష్మి, నర్సింహారెడ్డి,ప్రియాంక,ప్రభాకర్,పాండురంగ చారి,రవి తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ అసిస్టెంట్ పోచయ్యకు 'లయన్స్' అవార్డు



**ప్రజాపక్షం / రవీంద్రభారతి :** గత 20 ఏళ్లుగా గణితం విద్యాబోధన చేస్తూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్న స్కూల్ అసిస్టెంట్ కర్రె పోచయ్య ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందారు. మంగళవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320డి ఆధ్వర్యంలో గురు పూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ ఇంటర్నేషనల్ నుంచి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ప్రశంసా పత్రం అందుకొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని పిఎంశ్రీ జడ్పిహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తూ 2009 నుంచి పదోతరగతి విద్యార్థులకు గణితం బోధిస్తున్నానని తెలిపారు. లయన్స్ ఇంటర్నేషనల్ వారు తన సేవలు గుర్తించి అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉన్నదన్నారు. ఈ అవార్డు తన ఉపాధ్యాయ వృత్తికి మరింత గౌరవాన్ని, బాధ్యతను తెచ్చి పెట్టిందని పోచయ్య తెలిపారు.

## ఉద్యోగుల సమస్యలకై 10న 'చలో హైదరాబాద్'



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిజిఇ జెఎసి హైదరాబాద్ సిటీ నాయకులు కందూరి వెంకట్, కట్కూరి శ్రీకాంత్ పిలుపు మేరకు 'చలో హైదరాబాద్' మహా ధర్నాలో భాగంగా మంగళవారం రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయ ఆవరణలో 'భోజన సమయంలో నిరసన ప్రదర్శన' నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారుల నుంచి చిన్న స్థాయి ఉద్యోగుల వరకు పాల్గొని తమ అసంతృప్తికి ప్రధాన కారణాలైన పిఆర్‌సి అమలు, 6 డిఎలు, సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు, జిపిఎఫ్ బకాయిల చెల్లింపు, ఇహెచ్‌ఎస్ పథకం ద్వారా ఆరోగ్య పరిరక్షణ తదితర సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 10న జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిజిఇ జెఎసి నాయకులు కట్కూరి శ్రీకాంత్, కందూరి వెంకట్, టిజిఓ నాయకులు కృష్ణ యాదవ్, వనజ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

### నగరంలో ఉచిత మట్టి వినాయక విగ్రహాల...

## పంపిణీకి హెచ్‌ఎండిఎ ఏర్పాట్లు

hmda Growing Global


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి) వినాయక విగ్రహాల వినియోగాన్ని తగ్గించేందుకు హెచ్‌ఎండిఎ ఈ ఏడాది కూడా ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. 'ఎకో గణేశ్', 'గ్రీన్ గణేశ్', 'క్లే గణేశ్' భావనను ప్రజల్లో విస్తృతంగా ప్రోత్సహిస్తూ 2017 నుంచి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తోంది. ఈ ఏడాది మొత్తం 80 వేల 8 అంగుళాల మట్టి వినాయక విగ్రహాలు, 53 వేల ఒక అడుగు ఎత్తు విగ్రహాలు కలిపి 1.33 లక్షల విగ్రహాలను నగరంలోని 34 కేంద్రాల్లో ప్రజలకు, స్వచ్ఛంద సంస్థలకు ఉచితంగా పంపిణీ చేయనుంది. ఈనెల 9 నుంచి 13 వరకు ఈ పంపిణీ కార్యక్రమం కొనసాగనుంది. జూబ్లీహిల్స్‌లోని ఆరోగ్యశ్రీ కార్యాలయం, కెబిఆర్ పార్క్, పెద్దమ్మ ఆలయం, మాధాపూర్‌లోని శిల్పారామం, మైండ్‌స్పేస్ జంక్షన్, ఉప్పల్ శిల్పారామం, ట్యాంక్‌బండ్ సచివాలయం, ఎన్‌టిఆర్ గార్డెన్, సరూర్ నగర్ ప్రియదర్శిని పార్క్, వనస్థలిపురం రాజీవ్ గాంధీ పార్క్, మెల్కోటే పార్క్, సికింద్రాబాద్ గణేశ్ ఆలయం, మీర్‌పేట్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, నాగోల్, తార్నాక, బేగంపేట్ తదితర ప్రాంతాల్లో విగ్రహాల పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అదనంగా మియాపూర్, కూకట్‌పల్లి, మాధాపూర్, కెపిహెచ్‌బి, గేటెడ్ కమ్యూనిటీలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌లలో మొబైల్ పంపిణీ కేంద్రాల ద్వారా కూడా మట్టి విగ్రహాలను అందించనున్నారు. నగరంలోని చెరువులు, సరస్సులు, ఇతర జలవనరులు కాలుష్యానికి గురి కాకుండా ఉండేందుకు ప్రజలు తప్పనిసరిగా మట్టి వినాయక విగ్రహాలనే ఉపయోగించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు దూరంగా ఉండాలని హెచ్‌ఎండిఎ అధికారులు విజ్ఞప్తి చేశారు. పర్యావరణహిత వినాయక చవితి నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి. శ్రీనివాస్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తుండగా, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. గణేశ్ సమన్వయం చేస్తున్నారు.

## ఖైరతాబాద్ జోన్ పరిధిలో.. అక్రమ నిర్మాణాల జోరు



**ప్రజాపక్షం/బేగంపేట్:** నూతన క్యూర్ చట్టం రూపొందుతున్నా.. ఖైరతాబాద్ జోన్ పరిధిలోకి వచ్చే అమీర్‌పేట్, బేగంపేట్, సింధీకాలనీ తదితర ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలు ఆగడం లేదు. ప్యారడైజ్ హోటల్ వెనుక భాగంలో ఏకంగా నాలుగు భవనాలు నిర్మితమవుతున్నట్లు స్థానికులు మండిపడుతున్నారు. సింధీ కాలనీలోని శబ్నం బేకరీ పక్కనే అనుమతులు లేకుండా సెల్లార్ చేపట్టినట్లు విమర్శలున్నాయి. మైత్రివనంకు ఎదురుగా ఉన్న ఎంఐజిహెచ్10 భవనంలో ఇటీవల అగ్నిప్రమాదం చోటుచేసుకోగా.. పటిష్టత పరీక్షలు చేపట్టకుండానే నిర్మాణం చేపట్టడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయాలపై టౌన్‌ప్లానింగ్ ఎసిపి టి.రమేష్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు. ఇకనైనా ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ స్పందించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

## అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ సదస్సు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** అంతర్జాతీయ రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన ప్రతిష్ఠాత్మక సదస్సు ఇంటర్నేషనల్ రియల్ ఎస్టేట్ కాన్ఫరెన్స్ సెప్టెంబర్ 25 నుంచి 27 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్లో జరగనుంది. ది డోర్ టు వాట్ హ్యాపెన్స్ నెక్స్ట్ అనే థీమ్‌తో నిర్వహించే సదస్సుకు 35కి పైగా దేశాల నుంచి 1,500 మందికి పైగా రియల్ ఎస్టేట్ నిపుణులు, డెవలపర్లు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు, ఆర్థిక సంస్థలు, టెక్నాలజీ కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేషనల్ అసోసియేషన్ ఆఫ్ రియల్టర్స్ ఇండియా చైర్మన్ సుమంత్‌రెడ్డి అరని, శైలేందర్ సింగ్ మాట్లాడుతూ.. ఐ ఆర్ ఈ సి 2026 భారత రియల్ ఎస్టేట్ రంగానికి కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. భారత్‌ను ప్రపంచ రియల్ ఎస్టేట్ మార్కెట్లతో నేరుగా అనుసంధానించేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని పేర్కొన్నారు.

# పెండింగ్ ఫీజులిచ్చే వరకు ఉద్యమిస్తాం

- రూ.8 వేల కోట్లు తక్షణమే చెల్లించాలి
- విద్యార్థుల ర్యాలీలో ఎంపి ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం / హిమాయత్‌నగర్:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు చెల్లించేంతవరకు ఉద్యమిస్తామని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఫీజుల స్కీంను ఎత్తివేసే కుట్రలను మానుకోవాలని, పాత పద్ధతిలోనే ఫీజులివ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ మంగళవారం బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్లు మోదీ రాందేవ్, నిఖిల్ పటేల్ సంయుక్త ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు బర్కత్‌పుర రెడ్డి కాలేజీ నుంచి నారాయణగూడ చౌరస్తా వరకు భారీ ర్యాలీ, ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజుల స్కీంకు బడ్జెట్ ఇవ్వకుండా సిఎం రేవంత్ రెడ్డి పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. గత ముఖ్యమంత్రులంతా విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటే, ప్రస్తుతం సిఎం తిరోగమన చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మూడేళ్లుగా పెండింగ్ ఫీజులివ్వాలని విద్యార్థులు ఉద్యమిస్తుంటే ప్రభుత్వం పెడచెవిన పెట్టడం సరికాదన్నారు. ఎపిలో ఫీజుల స్కీం పకడ్బందీగా అమలు చేస్తున్నారన్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణలో ఫీజుల స్కీం అమలుకు అవరోధాలేంటని ప్రశ్నించారు. ఫీజుల బకాయిలివ్వకుండా మొండి వైఖరి కొనసాగిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి పూర్తి వ్యతిరేకత వస్తుందని కృష్ణయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో బిసి సంఘం నేతలు నరేశ్ గౌడ్, చిక్కుడు బాలయ్య , రాజు నేత, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## సిఐని కలిసిన కమిటీ సభ్యులు

**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి నూతన కమిటీ సభ్యులు మధురానగర్ సిఐ ప్రభాకర్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గణేశ్ ఉత్సవాల నిర్వహణ, పోలీసు శాఖకు సహకారం తదితర అంశాలపై చర్చించారు. సిఐని కలిసిన వారిలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మ ణ్, కోకన్వీనర్ గణేశ్ ప్రసాద్‌సింగ్, బోడ రవికిరణ్, రాయారం విఘ్నేశ్వర్, అర్జున్ తదితరులున్నారు.

## 'అనగనగా' కలినరీ ప్రారంభం

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** ఎఫ్ అండ్ బీ ఆంత్రప్రెన్యూర్లు రోహిత్ వాసిరెడ్డి, గోపీచంద్ చెరుకూరి 'అనగనగా తెలుగు కలినరీ పేరుతో ఏర్పాటైన రెస్టారెంట్‌ను ప్రారంభించారు. తెలుగు వంటకాల వారసత్వాన్ని పరిరక్షించి, తెలుగు ఆహారం, కథలు వంటి వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశ్యంతో రోహిత్ వాసిరెడ్డి, గోపీచంద్ చెరుకూరిలతో పాటు వారి భాగస్వాములు వినయ్‌రెడ్డి, జి.కృష్ణ చైతన్య, జీవీఎస్ సుధీర్, ఎస్.అనిల్ కలిసి 'ఓనమాలు' అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.

## చెఫ్ ఆఫ్ ది ఇయర్ ఫైనలిస్ట్

**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** ప్రముఖ తెలుగు సెలబ్రిటీ చెఫ్ కాంతి కిరణ్ తమ్మా మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. బ్రిటన్‌లో 'ది స్ట్రీస్ సర్క్యూట్ లిమిటెడ్ చెఫ్ డైరెక్టర్‌గా ఉన్న ఆయనను ప్రతిష్ఠాత్మక బీఐహెచ్ స్పాట్‌లైట్ అవార్డ్స్2026 లో 'చెఫ్ ఆఫ్ ది ఇయర్' విభాగంలో ఫైనలిస్ట్‌గా ఎంపిక చేశారు.

## ఫుల్‌టైమ్ సిఐని నియమించరా?

**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** వివిఐపి జోన్ పరిధిలోకి వచ్చే జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏం జరిగినా సంచలనంగానే మారుతుంది. ఇటీవల స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఇద్దరు సిఐలు సస్పెండ్ అయ్యారంటే ఫోకల్ కేసుల వ్యవహారం ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడి సోదరుడు పబ్‌లో పూటుగా మద్యం సేవించి రెండు వర్గాలుగా విడిపోయి అర్ధరాత్రి తన్నుకున్న వ్యవహారంలో 21 మందిపై మూడు కేసులు నమోదు చేసినా.. వివరాలను గోప్యంగానే ఉంచడం విమర్శలకు తావిస్తున్నది. ఇకనైనా జూబ్లీహిల్స్ పిఎస్‌కు పూర్తిస్థాయి సిఐని నియమించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

## దండోరా ఉద్యమం కొనసాగాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ:** అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలంటే దండోరా ఉద్యమం కొనసాగాలని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్ఎస్పి సీనియర్ నాయకులు బత్తిని సుధాకర్ మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పి అనుబంధ విభాగాల మండలాల నూతన కమిటీల సమావేశంలో జరిగిన అంశాలను ఆయన వివరించారు. సమాజంలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను రూపుమాపి సమానత్వాన్ని సాధించడమే ఎమ్మార్పీఎస్ ప్రధాన ఆశయమన్నారు. ఎమ్ఎస్పి సీనియర్ నాయకులు బత్తిని సుధాకర్ మాదిగ అధ్యక్షతన ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతోందన్నారు. ఎస్పి రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత సాధన కోసం ప్రారంభమైన ఉద్యమం తన పరిధిని విస్తరించుకొని అనేక సామాజిక సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేసిందని తెలిపారు.

## హామీలు అమలు కాలేదు

**ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపిస్తూ రహీంపురా గ్రౌండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఇంచార్జి మహేందర్ కుమార్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో శీలం సరస్వతి, క్రాంతి, వాసుదేవరావు, బిగిని శ్రీనివాస్, రాజేందర్, కుమార్, ఎర్ర రవికుమార్, వర్ధన్ సురేష్, బొట్టు సురేష్, రాజు, కావేటి సందీప్, గోపాల్ సింగ్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా బుల్లెట్ రైలు పనులు

### కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్

**న్యూఢిల్లీ:** తొలి బుల్లెట్ రైలు త్వరలోనే పట్టాలెక్కబోతోంది. బుల్లెట్ రైలుకు సంబంధించి ముంబైఅహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈ ప్రాజెక్టు వివరాలను మంగళవారం వెల్లడించారు. పనులు ఊహించిన దానికంటే వేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాదినాటికి సూరత్ బిలిమోరా మధ్య మొదటి సెక్షన్‌ను ప్రారంభించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు. అలాగే వాపీ సూరత్ సెక్షన్ సివిల్ నిర్మాణ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. 508 కిలోమీటర్ల పొడవునా విస్తరించి ఉన్న ఈ హైస్పీడ్ కారిడార్ పనులు సెప్టెంబరు 2017లో ప్రారంభించారు. ఇది మహారాష్ట్ర, గుజరాత్, దాద్రా అండ్ నాగర్ హవేలీ మీదుగా సాగుతుంది. ప్రయాణికుల సదుపాయం కోసం ఈ మార్గంలో ముంబై, థానే, విరార్, బోయిసర్, వాపీ, బిలిమోరా, సూరత్, భరూచ్, వడోదర, ఆనంద్, అహ్మదాబాద్, సబర్మతి స్టేషన్లు నిర్మిస్తున్నారు. ఈ స్టేషన్ల డిజైన్లను ఆయా నగరాల స్థానిక సంస్కృతి, గుర్తింపు ప్రతిబింబించేలా, ఆధునిక ఆర్కిటెక్చర్, మల్టీమోడల్ కనెక్టివిటీతో తీర్చిదిద్దుతున్నారు. రైలు పట్టాలపైనే కాకుండా, వాహనాల తయారీ పనులు కూడా జోరుగా సాగుతున్నాయి. టెస్టింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొదటి కోచ్ ఇప్పటికే సిద్ధమైంది. గం.కు 320 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణించే ఈ బుల్లెట్ రైలు అందుబాటులోకి వస్తే... అహ్మదాబాద్ నుంచి ముంబైకి ప్రయాణ సమయం కేవలం 2 గంటల 58 నిమిషాలకు తగ్గిపోతుంది. తాజా అంచనాల ప్రకారం ఈ కారిడార్‌లో మొదటి పూర్తిస్థాయి బుల్లెట్ రైలు సర్వీస్ ఆగస్టు 2027లో ప్రారంభం కానుంది.

## సత్యనికేతన్ ఘటనపై
# సిపిఐ ఆందోళన

### బాధితులకు పరిహారం, బాధ్యులపై చర్యలు, విద్యార్థుల భద్రతకు తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్



**న్యూఢిల్లీ:** ఢిల్లీ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణానికి సమీపంలో సత్యనికేతన్ వద్ద భవనం కూలిన ఘటనపై సిపిఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘటనలో బాధిత కుటుంబాలకు భారీ పరిహారం ప్రకటించాలని, ప్రమాదానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఢిల్లీలోని అన్ని విద్యార్థి వసతిగృహాల్లో భద్రతా తనిఖీలు చేపట్టాలని, ప్రతి డీ కళాశాలలో విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని సిపిఐ డిమాండ్ చేసింది. సిపిఐ జాతీయ కార్యదర్శి, ఎంపీ పి.సంతోశ్‌కుమార్, సిపిఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ దినేశ్ వర్ష్నే, ఏఐఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేశ్ సీరంగరాజ్, ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ సత్య నికేతన్ భవన ప్రమాద స్థలాన్ని సందర్శించి... సహాయక చర్యల్లో పాల్గొంటున్న వారిని వివరాలు తెలుసుకున్నారు. సహాయక చర్యలకు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ కార్యకర్తలు 24 గంటలూ అందుబాటులో ఉండి బాధిత కుటుంబాలకు సహకరిస్తున్నారని నేతలు తెలిపారు. ఈ ఘటన నిర్మాణ భద్రత, నియంత్రణ వ్యవస్థల్లో లోపాలను ఎత్తిచూపుతోందని వారు పేర్కొన్నారు. ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన వారికి తగిన పరిహారం అందించడంతో పాటు వారి కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీలోని అన్ని పీజీలు, హాస్టళ్లు, విద్యార్థుల వసతి గృహాలపై సమగ్ర భద్రతా తనిఖీలు నిర్వహించి, ప్రమాదకర భవనాలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నిర్లక్ష్యం, అవినీతి, నిబంధనల ఉల్లంఘన, నిర్మాణ లోపాలు, నియంత్రణ సంస్థల వైఫల్యాలకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీడీపీలో కనీసం 6 శాతం కేటాయించాలని సీపీఐ డిమాండ్ చేసింది. కష్టపడి డీలో ప్రవేశం పొందిన విద్యార్థులు అధిక అద్దెలు చెల్లించి అసురక్షిత పీజీల్లో ఉండాల్సిన పరిస్థితి రాకూడదని, సురక్షిత వసతి, విద్య కల్పించడం ప్రభుత్వ బాధ్యతేనని స్పష్టం చేసింది.

## అమిత్ షా నేతృత్వంలో
# నేర రాజధానిగా ఢిల్లీ

### సంగీతకారుడిని కొట్టి చంపిన ఘటనపై కాంగ్రెస్ ఆగ్రహం




**న్యూఢిల్లీ :** మణిపూర్‌కు చెందిన ఒక సంగీతకారుడిని కొట్టి చంపిన ఘటనపై కాంగ్రెస్ మోదీ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పెరుగుతున్న ఈ అరాచకాన్ని అరికట్టడానికి హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలోని మంత్రిత్వ శాఖ ఏం చేస్తోందని రాహుల్‌గాంధీ ప్రశ్నించారు. ఈ ఘటనపై త్వరితగతిన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కిలోకారి గ్రామంలోని తన అపార్ట్‌మెంట్ బయట కొందరు డెలివరీ సిబ్బంది, ధాబా ఉద్యోగులు మద్యం సేవిస్తూ గట్టిగా అరుస్తుండగా వారిని వారించినందుకు, వారు తనపై దాడి చేయడంతో 54 ఏళ్ల మణిపురి సంగీతకారుడు సి. విక్రమ్ సింగ్ మరణించారు. ఈ కేసులో పోలీసులు ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేయగా, ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. 'మణిపూర్‌కు చెందిన ప్రముఖ సంగీతకారుడు చోంగ్థమ్ విక్రమ్ సింగ్ జీ, తన ఇంటి బయట శబ్దాన్ని తగ్గించమని కొందరిని అడగడానికి కిందకు వెళ్లారు. అందుకు గాను ఆయనను కొట్టి చంపారు' అని మంగళవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. తన సొంత దేశ రాజధానిలో, తన ఇంటి ముందే ఒక తండ్రి హత్యకు గురయ్యారని ఆయన అన్నారు. ఇలాంటి అనేక ఘటనల తర్వాత ఢిల్లీలోని ఈశాన్య ప్రాంతానికి చెందిన ప్రతి కుటుంబం నేడు ఒకే ప్రశ్న అడుగుతోందని, తాము ఇక్కడ సురక్షితంగా ఉన్నామా? అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ప్రశ్నించారు. ముఖ్యంగా ఈశాన్య ప్రాంత ప్రజలపై పెరుగుతున్న ఈ అరాచకాన్ని అరికట్టడానికి షా నేతృత్వంలోని హోం శాఖ, ఢిల్లీ పోలీసులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటనపై త్వరితగతిన విచారణ జరగాలని, దోషులను శిక్షించాలని ఉద్ఘాటించారు. అలాగే విక్రమ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మణిపూర్‌కు చెందిన ప్రముఖ సంగీతకారుడైన సింగ్‌ను ఒక మూక నిర్దాక్షిణ్యంగా హత్య చేయడం బిజెపి పాలనలో నెలకొన్న పూర్తి అరాచకానికి మరో భయంకరమైన నిదర్శనమని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. హోం మంత్రి అమిత్ షా పాలనలో ఢిల్లీ 'నేరాల రాజధాని'గా మారిందని ఆరోపించారు. 'విద్యార్థులకు భద్రత లేదు. మహిళలు ప్రతిరోజూ అఘాయిత్యాలను ఎదుర్కొంటున్నారు. ఈశాన్య భారతదేశ ప్రజలు వివక్షను ఎదుర్కొంటున్నారు. దళితులు, ఆదివాసులు, మైనారిటీలు తీవ్ర అభద్రతా భావంతో ఉన్నారు. హోం మంత్రి అమిత్ షా పర్యవేక్షణలో ఢిల్లీ నేరాలకు రాజధానిగా మారింది. జాతీయ రాజధానిలో ఏటా అత్యధిక స్థాయిలో నేరాలు నమోదవుతున్నాయని ఎన్‌సిఆర్‌బి నమోదు చేస్తోంది' అని ఖర్గే అన్నారు. మృతుల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారికి న్యాయం జరగాలి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మోదీ ప్రభుత్వ అసమర్థత వల్ల మణిపూర్ ప్రజలు తమ రాష్ట్రంలోనూ, వెలుపలా బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ నడిబొడ్డున మణిపూర్‌కు చెందిన ప్రముఖ సంగీతకారుడిని అత్యంత దారుణంగా హత్య చేయడం జాతీయ స్థాయి అవమానమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా అన్నారు. 'కొంత మందిని శబ్దం తగ్గించమని కోరినందుకే ఆయనను దారుణంగా కొట్టి చంపేశారు. పరిస్థితి ఇంతలా దిగజారిందా? కనీసం తమ ఇంటి ముంగిట కూడా ఒక యువ తండ్రికి భద్రత లేదా? న్యాయం జరగాలి' అని ఆమె 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. 'ఈ హత్యకు పాల్పడిన వారిపై ఢిల్లీ పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలి. ఇది దేశ రాజధాని, మన నగరంలో హింస అదుపు లేకుండా చెలరేగడాన్ని మనం అనుమతించలేం. విక్రమ్ జీ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. న్యాయం కోసం జరిగే పోరాటంలో మేము మీకు అండగా ఉంటాం' అని ప్రియాంకా గాంధీ అన్నారు.

# అనర్హులను టీచర్లుగా నియమించొద్దు: సుప్రీం



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించి సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. విద్యావ్యవస్థలో నాణ్యతను కాపాడేందుకు అర్హత లేని వ్యక్తులను టీచర్లుగా నియమించకూడదని స్పష్టం చేసింది. ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీ నిబంధనల ప్రకారం నిర్దేశించిన అర్హతలు తప్పనిసరిగా ఉండాలని స్పష్టంచేసింది. నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని వారిని కొత్తగా నియమించడం మాత్రమే కాకుండా... ఇప్పటికే సర్వీసులో ఉన్న వారిని కూడా కొనసాగించడానికి వీల్లేదని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఉపాధ్యాయుల నియామకాల్లో విద్యార్థుల ప్రయోజనాలు, బోధనా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. ప్రభుత్వ సర్వీసుల్లోకి ఉపాధ్యాయులను విలీనం చేసే పేరుతో పారదర్శకమైన, పోటీతత్వ నియామక ప్రక్రియను పక్కన పెట్టడంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన సందర్భంగా సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. ఎలాంటి పారదర్శక నియామక ప్రక్రియ లేకుండా అర్హతలు లేని వ్యక్తులను ప్రభుత్వ సర్వీసుల్లోకి తీసుకోవడాన్ని అంగీకరించబోమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఆర్‌టీఈ, ఎన్‌సీటీఈ, యూజీసీ నిబంధనలకు అనుగుణంగా అర్హతలు ఉన్నవారినే ఉపాధ్యాయులుగా నియమించాలని పేర్కొంది. అర్హత ప్రమాణాలు పాటించకుండా నియామకాలు చేపడితే విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. దీంతో టీచర్ల నియామకాల్లో ఇకపై నిబంధనలు, పారదర్శకత, మెరిట్‌కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## జెఎస్ఎస్‌సి–సిజిఎల్ పరీక్షలో అవకవతకలు
# మరో వ్యక్తిని అరెస్టు చేసిన సిఐడి

**రాంచీ :** జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జెఎస్ఎస్‌సి) నిర్వహించిన 'కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్' (సిజిఎల్) పరీక్షలో జరిగిన అక్రమాలకు సంబంధించి, రాష్ట్ర పోలీసుల క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సిఐడి) మరో వ్యక్తిని అరెస్టు చేసినట్లు మంగళవారం ఒక అధికారి తెలిపారు. బిహార్‌లో జరిగిన ఈ అరెస్టుతో కలిపి, 2023లో జరిగిన సిజిఎల్ పరీక్షలో చోటుచేసుకున్న అక్రమాలకు సంబంధించి రాష్ట్ర దర్యాప్తు సంస్థ ఇప్పటివరకు 11 మందిని అదుపులోకి తీసుకుంది. ఈ అక్రమాలపై గత నెలలో రాంచీలో ఉద్యోగార్థులు పలు రోజుల పాటు నిరసనలు తెలిపారు. బిహార్‌లోని పాట్నా జిల్లా, నెవారా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక గ్రామానికి చెందిన రాజన్ కుమార్‌ను సోమవారం సిఐడి అరెస్టు చేసిందని ఆ అధికారి పేర్కొన్నారు. నిందితుడు పలువురు జెఎస్ఎస్‌సి–సిజిఎల్ అభ్యర్థులను పశ్చిమ బెంగాల్‌లోని నియమత్‌పూర్‌లో ఉన్న ఒక హోటల్‌కు తీసుకెళ్లి, పరీక్షకు సంబంధించిన ప్రశ్నలు, సమాధానాలను వారికి కంఠస్థం చేయించాడు అని ఆయన చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా పలువురు అభ్యర్థులు అక్రమ ప్రయోజనం పొందారని, వారిలో కొందరు పరీక్షలో విజయం సాధించారని ఆ అధికారి తెలిపారు. ఈ కేసులో ఇంతకు ముందు అరెస్టు అయిన 10 మందిలో నలుగురు జెఎస్ఎస్‌సి–సిజిఎల్ పరీక్షలో విజయం సాధించిన అభ్యర్థులే ఉన్నారు. ప్రధాన నిందితుడు అభయ్ తివారీతో పాటు అతని భార్య, సోదరుడిని కూడా సిఐడి అదుపులోకి తీసుకుంది. ఉద్యోగార్థుల నిరసనల నేపథ్యంలో, జెఎస్ఎస్‌సి–సిజిఎల్ 2023తో సహా పలు నియామక పరీక్షలను రద్దు చేస్తున్నట్లు జార్ఖండ్ ప్రభుత్వం ఆగస్టు 17న ప్రకటించింది. అయితే, ఉద్యోగం కోల్పోతామనే ఆందోళనతో విజేతలైన అభ్యర్థులు దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జార్ఖండ్ హైకోర్టు స్టే విధించింది. పరీక్షలో జరిగినట్లు ఆరోపించబడుతున్న అక్రమాలపై జార్ఖండ్ సిఐడికి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరుపుతోంది.

# ఐవి ద్రవాలు తీసుకునేందుకు జారంగే అంగీకారం

### 11వ రోజూ కొనసాగిన నిరాహారదీక్ష



**జాల్నా :** మరాఠా రిజర్వేషన్ల ఉద్యమకారుడు మనోజ్ జారంగే చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష మంగళవారానికి 11వ రోజుకు చేరుకుంది. అయితే ఆయన ఆరోగ్యం క్షీణించింది. రక్తంలో చక్కెర స్థాయిలు గణనీయంగా పడిపోవడంతో, ఆయన ఐవి ద్రవాలను తీసుకోవడానికి అంగీకరించారని అధికారులు తెలిపారు. మహారాష్ట్రలోని జాల్నా జిల్లా అంతర్వాలి సార్తి గ్రామంలో నిరసన చేపట్టిన జారంగే, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్, ఎమ్మెల్యే ప్రసాద్ లాడ్ ఫోన్ కాల్స్ చేసిన తర్వాత తెల్లవారుజామున 2:30 గంటల ప్రాంతంలో చికిత్సకు అంగీకరించారని వారు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుండే ఆయన డిమాండ్లపై పని ప్రారంభిస్తుందని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని ఆ నాయకులు ఉద్యమకారుడికి హామీ ఇచ్చారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆగస్టు 29న తన తాజా నిరాహార దీక్షను ప్రారంభించిన జారంగే, మరాఠా వర్గానికి ఓబిసి కేటగిరీ కింద రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్, సతారా గెజిట్ రికార్డుల అమలుతో పాటు, అర్హులైన మరాఠా వర్గీయులకు కున్బీ కుల ధృవీకరణ పత్రాలను జారీ చేయాలని ఆయన కోరుతున్నారు. వాడిగోద్రిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ శుభమ్ రాథోడ్ తెలిపిన వివరాల ప్రకారం, జారంగే రక్తంలో చక్కెర స్థాయి 66 ఎంజి/డిఎల్‌కు పడిపోయింది. ఆయన బరువు 52 కిలోల నుండి 45 కిలోలకు తగ్గింది. ఉదయం 7 గంటల వరకు ఆయనకు నాలుగు బాటిళ్ల ఐవి ద్రవాలను అందించారు. పుణె, థానే, నాసిక్, ముంబయి వంటి ప్రధాన జిల్లాల నుండి మరాఠాలు సెప్టెంబర్ 12న అంతర్వాలి సార్తి వద్ద భారీ సంఖ్యలో సమావేశం కావాలని ఆ ఉద్యమకారుడు సోమవారం పిలుపునిచ్చారు.

## పినరయ్ విజయన్, వీణపై
# ఎఫ్ఐఆర్ నమోదు చేయండి

### డిజిపికి ఇడి లేఖ

**కొచ్చి/న్యూఢిల్లీ :** కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్ (సిఎంఆర్ఎల్)కు సంబంధించిన లంచం ఆరోపణ కేసులో కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆయన కుమార్తె వీణ టి,అల్లుడు పి.ఎ. మహమ్మద్ రియాస్, మరికొందరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కేరళ డిజిపికి లేఖ రాసినట్లు అధికారిక వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ కేసులో తమ దర్యాప్తులో వెల్లడైన అంశాలను ప్రస్తావిస్తూ, మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ)లోని సెక్షన్ 66 (2) కింద కేంద్ర దర్యాప్తు సంస్థ ఈ సమాచారాన్ని పంపినట్లు ఆ వర్గాలు పిటిఐకి వెల్లడించాయి. పిఎంఎల్ఎ కింద జరిపిన సోదాలు, దర్యాప్తులో లభించిన సాక్ష్యాల ఆధారంగా, అవినీతి నిరోధక చట్టం, ఇతర చట్టాల నిబంధనల కింద విజయన్, వీణ, ఆమె భర్త, మాజీ మంత్రి అయిన రియాస్, అలాగే మరికొందరిపై పోలీసు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఇడి కోరినట్లు ఆ వర్గాలు తెలిపాయి. కేరళకు చెందిన మైనింగ్ సంస్థ సిఎంఆర్ఎల్, వీణకు చెందిన (ప్రస్తుతం మూతపడిన) 'ఎక్సలాజిక్ సొల్యూషన్స్' సంస్థకు 'ఐటి కన్సల్టెన్సీ సేవల' ముసుగులో రూ. 2.78 కోట్ల మేర అక్రమ చెల్లింపులు జరిపిందని ఇడి ఆరోపిస్తోంది. రాజధాని తిరువనంతపురంలో విజయన్‌తో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్న వీణ నివాసంలో ఈ కేంద్ర దర్యాప్తు సంస్థ జూన్‌లో సోదాలు నిర్వహించి, ఆ తర్వాత ఆమెను విచారించింది. వీణపై జరిపిన సోదాల సమయంలో కొన్ని 'చేతిరాత' గల పత్రాలను స్వాధీనం చేసుకున్నామని, వాటిలో దుబాయ్‌కి జరిగిన కొన్ని నిధుల బదిలీలకు సంబంధించిన వివరాలు ఉన్నాయని ఆ సంస్థ ఆగస్టులో ఒక ప్రకటనలో తెలిపింది. కాగా, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ స్పందిస్తూ ఇడి ఇప్పుడు రియాస్‌ను లక్ష్యంగా చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తన కుమార్తెపై ఇడి నమోదు చేసిన కేసును విజయన్ రాజకీయ కక్షసాధింపు చర్యగా అభివర్ణించారు.

## స్కూల్‌లో మౌలిక సాదుపాయాల కోసం
# కలెక్టరేట్‌కు విద్యార్థుల పాదయాత్ర

### మూడు నెలలుగా విద్యుత్తు లేకపోవడంతో హాస్టల్ చీకటిమయమైందని విద్యార్థినుల ఆవేదన



**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్‌లో, పాఠశాల హాస్టల్ సౌకర్యాలు దయనీయ స్థితిలో ఉన్నాయని, నెలల తరబడి విద్యుత్తు లేకపోవడం, అపరిశుభ్రమైన ఆహారం, మెస్ ఉన్నాయని ఫిర్యాదు చేస్తూ 45 మందికి పైగా బాలికలు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలవడానికి గంటల తరబడి నడిచారు. పాఠశాల ప్రిన్సిపాల్, గిరిజన సంక్షేమ శాఖ నుండి ఎటువంటి సమాధానాలు రాకపోవడంతో, బటౌలీలోని శివ్‌పూర్‌లో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు అంబికాపూర్‌లోని జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్లు పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నారు. గత మూడు నెలలుగా విద్యుత్తు లేకపోవడంతో తమ హాస్టల్ చీకటిమయమైందని విద్యార్థినులు ఆరోపించారు. అంతే కాకుండా, నాసిరకం ఆహారం, అపరిశుభ్రమైన మెస్‌తో పాటు, పాఠశాలలో ఉపాధ్యాయుల తీవ్ర కొరత ఉందని, దీని కారణంగా సాధారణ ఫిజిక్స్, కెమిస్ట్రీ తరగతులకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని వారు తెలిపారు. ఈ ఆకస్మిక నిరసన స్థానిక యంత్రాంగం అంతటా భయాందోళనలు సృష్టించడంతో, గిరిజన సంక్షేమ శాఖ అసిస్టెంట్ కమిషనర్ లలిత్ శుక్లా బైల్‌కోటా వద్ద వారిని అడ్డగించారు. అప్పటికే ఆ బాలికలు దాదాపు ఆరు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. శుక్లా హామీలు ఇస్తూ వారిని వారించేందుకు ప్రయత్నించారు. అయితే, పట్టుదలగా ఉన్న విద్యార్థులు చర్చలకు నిరాకరించి, కలెక్టర్ అజిత్ వసంత్‌ను స్వయంగా కలవాలని పట్టుబట్టారు. అప్పుడు అధికారులు వారిని మిగిలిన దూరం కలెక్టరేట్‌కు తరలించడానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి, తక్షణమే సరిదిద్దుతామని వారికి హామీ ఇచ్చారు. విద్యుత్ అంతరాయాన్ని ఆలస్యం లేకుండా పరిష్కరించాలని, హాస్టల్ మెస్‌లో కఠినమైన పరిశుభ్రతను పాటించేలా చూడాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి అతిథి ఉపాధ్యాయులను నియమించాలని ఆయన అధికారులను ఆదేశించారు. లోపాలపై విచారణ జరిపి, సవివరమైన నివేదికను సమర్పించేందుకు వసంత్, జాయింట్ కలెక్టర్ శారదా అగర్వాల్, సీతాపూర్ ఎస్‌డిఎం ఫగేష్ సిన్హా, అసిస్టెంట్ డైరెక్టర్ కిరణ్ రాజ్‌పుత్‌లతో కూడిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని ఆశ్రమ హాస్టళ్లలో వారం రోజుల్లోగా భౌతిక తనిఖీలు నిర్వహించాలని నోడల్ అధికారులను కూడా ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో గిరిజన విద్యార్థులు హాస్టల్ సమస్యను లేవనెత్తుతూ కలెక్టర్ కార్యాలయానికి పాదయాత్ర చేయడం ఇది మూడవసారి. వసంత్ ఇచ్చిన హామీల తర్వాత, విద్యార్థులను బస్సులో వారి హాస్టల్‌కు తిరిగి పంపించారు. తీవ్రమైన అలసట, డీహైడ్రేషన్, ఒత్తిడి కారణంగా, విద్యార్థులలో ఒకరు కలెక్టరేట్ ప్రాంగణంలో స్పృహ కోల్పోయి కుప్పకూలిపోయారు. ఆమెను వెంటనే చికిత్స కోసం అంబులెన్స్‌లో మెడికల్ కాలేజ్ ఆసుపత్రికి తరలించారు.

## సత్యానిదే విజయం
# రాహుల్‌పై మోదీ విమర్శలు



**వడోదర:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్రమోదీ ఎదురుదాడి చేశారు. విపక్షాల అబద్ధాలను యువత ఆకాంక్షలు, గళం అధిగమిస్తాయని మోదీ అన్నారు. తప్పుదోవ పట్టించే వారు అన్నిచోట్ల ఉంటారని, కానీ యువత సత్యాన్నే అనుసరిస్తుందని, దేశ భవిష్యత్తును వారే నిర్ణయిస్తారని తెలిపారు. ఎవరెన్ని అబద్ధాలు చెప్పినా చివరికి సత్యానిదే విజయమని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ చాత్రోంకి గూంజ్ పేరిట విద్యార్థులతో మాట్లాడుతోన్న విషయాన్ని మోదీ పరోక్షంగా ప్రస్తావించారు. గుజరాత్‌లోని వడోదరలో 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో ఆయన మంగళవారం మాట్లాడారు. అదేసమయంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మోదీ మాట్లాడుతూ 'దేశంలో ప్రభుత్వాల పని సంస్కృతిలో వచ్చిన మార్పునకు వెస్ట్రర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఒక ఉదాహరణ. దానికి సంబంధించి చివరి దశ కూడా పూర్తయింది. 2004లో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. దీని అమలు కోసం 2006లో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. 2014 వరకు దానికి సంబంధించిన ఫైళ్లు అక్కడక్కడే తిరిగాయి' అని పీఏ పాలనపై మోదీ ఆరోపించారు. పదేళ్లలో వారు 50 వేల టాయిలెట్లు కూడా కట్టించలేదని, తాము 50 వేల రైలు బోగీలు నిర్మించామని చెప్పారు. యువత గురించి మాట్లాడిన ప్రధాని... ఏఐ యుగానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఏఐ నైపుణ్యాలు ఐటీ రంగానికి మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. రూఫ్‌టాప్ సోలార్ విస్తరణ గురించి ప్రస్తావించారు. 'ఇప్పుడు ఎన్నో కుటుంబాలు విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారిపోయాయి. సౌర ఉత్పత్తి, అమర్చడం, సర్వీస్ విస్తరించడంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి' అని వివరించారు. ఇప్పుడు దేశం చిప్స్ నుంచి షిప్స్ వరకూ తయారీ రంగంలో కొత్త చరిత్ర లిఖిస్తోందన్నారు.

# ఎంపిఎస్‌సి ప్రశ్నా పత్రం లీక్

### మహారాష్ట్రలో అభ్యర్థుల నిరసన

**ఛత్రపతి శంభాజీనగర్ :** ప్రశ్న పత్రాల లీక్‌లు, పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలపై మహారాష్ట్రకు చెందిన ఛత్రపతి శంభాజీనగర్‌లో ఎంపీఎస్‌సీ అభ్యర్థులు భారీ సంఖ్యలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇటీవల నియామక పరీక్షల నిర్వహణపై ఒక ఉన్నత స్థాయి విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతి చౌక్ వద్ద గుమికూడిన నిరసనకారులు... మహారాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీఎస్‌సీ) లో అత్యున్నత పదవుల్లో ఎటువంటి అవినీతి మరక లేని వారిని అధికారులను తక్షణమే నియమించాలని కోరారు. ఇటువంటి నిరసన ప్రదర్శనే సోమవారం పూణేలో జరిగింది. 'తుకారాం ముండే (రాష్ట్ర ఎఫ్‌డీఏ కమిషనర్) వంటి సచ్ఛీలురులను ఎంపీఎస్‌సీకి నియమించాలి. విద్యార్థులు తమకు న్యాయం చేయాలని మాత్రమే కోరుతున్నారు. రైతు కుటుంబాలకు చెందిన మేము తల్లిదండ్రులను ఆశలను నెరవేర్చేందుకు ఇక్కడకు చదువుకునేందుకు వచ్చాము' నిరసనలో పాల్గొన్న అభ్యర్థి ఒకరి తెలిపారు. కోవిడ్19 మహమ్మారి తర్వాత నిర్వహించిన పరీక్షల గురించి అభ్యర్థులకు అనుమానాలున్నాయని, వాటిపై కూడా విచారణ జరపాలని మరొక అభ్యర్థి కోరారు. 'మేము ఏమి చేస్తున్నామో మాకు తెలుసు. పరీక్షలకు హాజరయ్యేందుకు నేను నాలుగేళ్లుగా చదువుతున్నాను. కానీ డబ్బులు పెట్టినవారు ప్రయోజనం పొందారు' అని అన్నారు. ఎంపీఎస్‌సీపై తమకు నమ్మకం పోయిందని మరొక అభ్యర్థి ఆవేదన వ్యక్తం చేశారు. 'మాకు ద్రోహం జరిగింది. వరుస సీటు నంబర్లు ఉన్న అభ్యర్థులకు నియామక పత్రాలు అందుతున్నాయి. ఇది యాదృచ్ఛికం కాకపోవచ్చు' అని తెలిపారు.

## క్రీడా కోటా ప్రభుత్వ ఉద్యోగాలు
# నకిలీ సర్టిఫికెట్ల రాకెట్ గుట్టురట్టు



**పూణే:** క్రీడా కోటా కింద ప్రభుత్వ ఉద్యోగాలు కోరుకునే అభ్యర్థులకు కురాష్ టోర్నమెంట్ల పేరుతో వెయ్యికి పైగా నకిలీ సర్టిఫికెట్లు పంపిణీ చేసిన ఒక రాకెట్‌ను పూణే పోలీసులు చేధించి... ఇద్దరిని అరెస్టు చేశారని ఒక అధికారి మంగళవారం తెలిపారు. అరెస్టు అయిన నిందితులు మహారాష్ట్ర కురాష్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి అసలు జరగని రాష్ట్ర స్థాయి పోటీల కోసం రికార్డులను తప్పుగా సష్టించారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసపూరిత పత్రాలను ఉపయోగించి ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న కనీసం 60 మందిని పోలీసులు గుర్తించారని ఆ అధికారి తెలిపారు. కురాష్ అనేది మధ్య ఆసియాలో ఉద్భవించిన ఒక రకమైన నిటారుగా నిలబడి చేసే జాకెట్ రెజ్లింగ్. ఇది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన క్రీడ అని, మహారాష్ట్ర కురాష్ అసోసియేషన్ అధ్వర్యంలో 2012 నుంచి మహారాష్ట్రలో దీనిని ఆడుతున్నారని పోలీసులు తెలిపారు. క్రీడా కోటా కింద ప్రభుత్వ ఉద్యోగాలు కోరుకునే అభ్యర్థులకు కురాష్ వంటి క్రీడలలో నకిలీ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు అందిన తర్వాత ఈ విషయం వెలుగులోకి వచ్చిందని ఒక అధికారి తెలిపారు. 'ఫిర్యాదు అందిన తర్వాత మేము విచారణ ప్రారంభించాము. ఆర్టీఐ దరఖాస్తు ద్వారా పొందిన పత్రాలను కూడా పరిశీలించగా మాకు అనేక వ్యత్యాసాలు కనిపించాయి' అని ఆయన అన్నారు. 2016 నుంచి 2019 మధ్య జరిగిన పోటీలను ఇండియన్ కురాష్ అసోసియేషన్‌తో సంబంధం లేని సంస్థలు నిర్వహించాయని, సర్టిఫికెట్లపై ఉన్న సంతకాలను స్కాన్ చేసి అతికించారని విచారణలో తేలిందని ఆ అధికారి తెలిపారు. పోలీసుల ప్రకారం, 2016 నుంచి 2022 మధ్య పోటీలు జరిగినట్లు చూపించే రికార్డులను సష్టించడం కోసం ఇద్దరు నిందితులు తొమ్మిది నుంచి పది సంవత్సరాల క్రితం తేదీలతో జిల్లా స్థాయి సంఘాల నుంచి నకిలీ భాగస్వామ్య పత్రాలను పొందారు. కనుగొన్న వ్యత్యాసాలలో 2016 17 లో జారీ చేసినట్లుగా చెబుతున్న సర్టిఫికెట్లలో జిల్లా పేరు ఉస్మానాబాద్‌కు బదులుగా ధరాశివ్ అని పేర్కొనడం కూడా ఉంది. వాస్తవానికి ఆ పేరు 2023 లో మాత్రమే మార్చబడింది. అదేవిధంగా పూర్వపు ఔరంగాబాద్ జిల్లాకు చెందిన సర్టిఫికెట్లలో ఛత్రపతి శంభాజీనగర్ అని పేర్కొనడం కూడా కనిపించిందని ఆ అధికారి తెలిపారు. మహిళల కేటగిరీకి చెందిన సర్టిఫికెట్లపై పురుషుల పేర్లు ఉన్నట్లు... అలాగే అనేక సర్టిఫికెట్లకు సీరియల్ నంబర్లు లేనట్లు కూడా పోలీసులు గుర్తించారని ఆయన వివరించారు.

### వెయ్యికి పైగా జారీ... ఇద్దరి అరెస్టు

ఈ రాకెట్ 2016 తర్వాత ప్రారంభమైనట్లు కనిపిస్తోందని, వెయ్యికి పైగా సర్టిఫికెట్లు పంపిణీ చేసి ఉండవచ్చని తెలిపారు. ఇలాంటి సర్టిఫికెట్లను వివిధ ప్రభుత్వ శాఖలకు తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు 60 మందిని పోలీసులు గుర్తించారని, అయితే దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆ అధికారి తెలిపారు. నిందితులను విచారిస్తున్నామని, ఈ రాకెట్ పరిధిని నిర్ధారించడానికి పోలీసులు ఇతర ఆధారాలను సేకరిస్తున్నారని ఆయన చెప్పారు. పోలీసు శాఖకు చెందిన సిబ్బంది ఎవరైనా డూప్లికేట్ లేదా నకిలీ సర్టిఫికెట్లు పొందారా అనే విషయాన్ని కూడా పోలీసులు ధ్రువీకరిస్తున్నారని తెలిపారు.

# ప్రపంచ ఎగుమతుల్లో చైనా గణనీయ వృద్ధి

**బీజింగ్:**ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది మొదటి ఎనిమిది నెలల్లో చైనా విదేశీ వాణిజ్య ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి సాధించింది.పశ్చిమాసియాలో యుద్ధంవల్ల ఏర్పడిన ఒడిదొడుకులను ఇతరదేశాలకంటే బలంగా చైనా తట్టుకుని నిలబడింది. ఎగుమతులూ దిగుమతులూ గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయని, ఎగుమతులకంటే చిన్న దేశాలకు ఆసరా కల్పించేవిధంగా గణనీయమైన దిగుమతులకు చైనా అవకాశం ఇచ్చిందని జనరల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ కస్టమ్స్ విభాగం తెలియజేసినట్లు జిన్హువా వార్తాసంస్థ పేర్కొంది. ట్రంప్–జిన్‌పింగ్ సమావేశానికి కొద్దిరోజులు ముందుగా ఈ సమాచారం వెలువడింది. వారి సమావేశంలో వాణిజ్యం అతి కీలకమైన అంశంగా ఉంటుంది. ఇటీవలినెలల్లో ఎలక్ట్రిక్ వాహనాలు,పారిశ్రామిక యంత్రాలు,సెమీకండక్టర్ ఉత్పత్తులను ప్రపంచవ్యాప్తంగా చైనా ఎగుమతి చేయడంతో గణనీయవృద్ధికి ఆజ్యం పోసింది. సప్లయ్ చైన్‌లో చైనా దూకుడు ప్రదర్శిస్తుండగా, కృత్రిమ మేధ సంబంధిత మౌలిక సదుపాయాలు,పారిశ్రామిక ఆటోమేషన్‌లో చైనా కీలక పాత్రధారిగా మారిందని బిఎన్‌పి పారిబాస్ అసెట్ మేనేజ్‌మెంట్ లో ఆసియా–పసిఫిక్ విభాగం మార్కెట్ వ్యూహకర్త ఒకరు చెప్పారు. అమెరికా–చైనా మధ్య తీవ్రమైన వాణిజ్యపోటీ ఉంది. ఇరు దేశాలమధ్యా వాణిజ్య ప్రతిష్టంభన ఇటీవలికాలంలో నెలకుంది. అమెరికాకు కీలకమైన ఖనిజాలను చైనా ఎగుమతులు నిలిపివేయగా,అత్యాధునిక టెక్ వస్తువులను చైనాకు అమెరికా విక్రయించడంలేదు. చైనా–యూరోపియన్ యూనియన్ మధ్య కూడా తీవ్రమైన వాణిజ్యలోటు ఉంది. దీనిపై త్వరలో సమావేశం జరుగనున్నది.అన్నిటికంటే ముఖ్యంగా ఈ ఏడాది ఆగస్టునెలలో హైటెక్ వస్తువులు,ఆటోమొబైల్స్‌కు భారీ డిమాండ్ ఉండటంతో చైనా 25 శాతం మేరకు ఎగుమతుల వృద్ధి సాధించిందని పిటిఐ పేర్కొంది. వాణిజ్య మిగులు కూడా రికార్డుస్థాయిలో పెరిగింది.చైనా ఆర్థికవేత్తలు ముందుగా వేసిన అంచనాలకు అనుగుణంగానే ఈ వృద్ధి నమోదైంది.ఆగ్నేయాసియా,లాటిన్ అమెరికా,ఆఫ్రికా దేశాలకు అత్యధికంగా ఎగుమతులు చేయడం ద్వారా అమెరికా విధించే అధిక సుంకాలను చైనా తట్టుకుని నిలదొక్కుకుంది. గత నెలలో చైనాకు అమెరికా ఎగుమతులు 13.3 బిలియన్ డాలర్లు మాత్రమేకావడంతో చైనాకు 29.2 బిలియన్ డాలర్ల మిగులు ఏర్పడింది. యూరోపియన్ యూనియన్‌కు 6.6శాతం, ఆగ్నేయాసియాకు 30.2 శాతం, లాటిన్ అమెరికా దేశాలకు 17.5 శాతం వంతున చైనా ఎగుమతులు చేసింది. దిగుమతులు పెరుగుతున్నప్పటికీ, నిలకడగా ఎగుమతులు పూర్తిస్థాయిలో ఆధిక్యత సాధిస్తాయని,దీనివల్ల ఈ ఏడాదిలో సరికొత్త రికార్డు స్థాయి వాణిజ్య మిగులుకు దారితీస్తుందని ఐఎన్‌జి దచ్‌బ్యాంకులో గ్రేటర్ చైనా ఆర్థికవేత్త లిన్ సాంగ్ చెప్పారు.ఎగుమతులకంటే దిగుమతుల్లో గణనీయమైన పెరుగుదల ఉన్నట్లు చైనా కస్టమ్స్ ఏజన్సీ పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే ఎగుమతులు–దిగుమతులు కలిపి 17.6 శాతం వృద్ధి చెందాయి.ధనరూపేణా ఈ వృద్ధి 5.13 ట్రిలియన్ డాలర్లుగా నమోదైంది. ఒక్క ఎగుమతులు మాత్రమే గత ఏడాదితో పోలిస్తే 14.6 శాతం వృద్ధి (20.17 ట్రిలియన్ యువాన్లు) సాధించాయి. ఒక్క ఆగస్టునెలలోనే చైనా వస్తు వాణిజ్యం 4.65 ట్రిలియన్ యువాన్లుగా నమోదైంది.అదేవిధంగా గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టునెలలో చైనా ప్రపంచ దిగుమతులు 28.2 శాతం పెరిగాయి.జులైనెలలో ఈ వృద్ధి 27.5 శాతంగా నమోదైంది. వాణిజ్య మిగులు జులై నెలలో 112.5 బిలియన్ డాలర్లు ఉండగా, ఆగస్టునెలలో 119.1 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందింది. గత ఏడాది మొత్తానికి చైనా వాణిజ్య మిగులు 1.2 ట్రిలియన్ డాలర్లకు పెరగడంతో అమెరికాసహా ఇతర పెట్టుబడిదారీ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి.

రికార్డుస్థాయిలో వాణిజ్య మిగులు



## పేట్రియాట్ క్షిపణులుసహా

# ఉక్రేన్‌కు బ్రిటన్ 135 మి.డాలర్ల ప్యాకేజీ

**లండన్:**ఒకవైపు శాంతి చర్చలకు సన్నాహాలు జరుగుతున్న సమయంలోనే ఉక్రేన్ గగనతల రక్షణకు 135 మిలియన్ డాలర్లు సహాయం అందజేస్తున్నట్లు బ్రిటన్ ప్రకటించింది.ఈ నేపథ్యంలో మరోవైపు ఉక్రేన్‌పై రష్యా క్షిపణి దాడులు పునరుద్ధరించింది. ఉక్రేన్ రక్షణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు పేట్రియాట్ క్షిపణుల కొనుగోలుకు నిదులు సమకూరుస్తామని,మొత్తం 135 మిలియన్ డాలర్లు (100 మిలియన్ పౌండ్లు) ఆర్థిక సహాయం అందజేస్తామని బ్రిటన్ ప్రభుత్వం ప్రకటించింది. శీతాకాలానికి ముందుగానే రష్యాలో కీలక ప్రాంతాలు,మరిన్ని రిఫైనరీలపై దాడులు చేసేందుకు ఉక్రేన్ సన్నద్ధమవుతున్న తరుణంలో బ్రిటన్ ప్రభుత్వం ఈ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. ఇటీవల బ్రిటన్ ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్, ఆ దేశ రక్షణమంత్రి వెస్‌స్ట్రీట్ ఇద్దరూ ఇటీవల ఉక్రేన్ రాజధాని కీవ్‌లో పర్యటించి అధ్యక్షుడు జెలెన్‌స్కీతో సంభాషణలు చేశారు. శీతాకాల భయం ముంచుకువస్తున్నందువల్ల తమ దేశానికి అదనపు ఆర్థిక ప్యాకేజీ ఇవ్వాలని జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేసిన తర్వాత బ్రిటన్ ప్రభుత్వం మంగళవారం ఈ ప్రకటన చేసింది.గడచిన జూన్ రెండో వారం తర్వాత ఫ్రాన్స్ వేదికగా జరిగిన జి–7 సమావేశంలో కూడా ఉక్రేన్‌కు ఆర్థిక సహాయం చేయాలని యూరోపియన్ యూనియన్ దేశాలు గట్టిగా నిర్ణయించుకున్నాయి.జెలెన్‌స్కీ చాలా ధైర్యవంతుడనీ, రష్యాను గట్టి దెబ్బ తీస్తున్నారని డోనాల్డ్ ట్రంప్ కూడా ఆయనను అభినందించారు. ఆ తర్వాత ఉక్రేన్ సరిహద్దులకు వందల కి.మీ దూరంలో ఉండే రష్యా కీలక రిఫైనరీలపై ఉద్ధృత దాడులు మొదలయ్యాయి. ఉక్రేన్‌కు కీలకమైన ఆయుధాలు సరఫరాచేస్తే సహించేదిలేదని బ్రిటన్‌కు ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరించారు. దీనిపై బర్న్‌హామ్ తీవ్రంగా స్పందిస్తూ, ఎట్టిపరిస్థితుల్లోనూ ఉక్రేన్‌కు యుద్ధ సహాయాన్ని ఆపేదిలేదని స్పష్టం చేశారు. ఈ హెచ్చరికలు,ప్రతిహెచ్చరికల మధ్య 100 మిలియన్ పౌండ్ల ఆర్థిక ప్యాకేజీని బ్రిటన్ ప్రభుత్వం తాజాగా ప్రకటించింది.

**క్షిపణి దాడులు పునరుద్ధరించిన రష్యా ఐదుగురు మృతి:63 మందికి గాయాలు**

మూడు రోజుల కాల్పుల విరమణ తర్వాత ఉక్రేన్‌పై రష్యా తిరిగి దాడులు ప్రారంభించింది.రాజధాని కీవ్ నగరంసహా మూడు జిల్లాలపై క్షిపణులతో దాడులు చేసింది. ఈ దాడుల్లో ఐదుగురు మరణించారు. మరో 63 మంది గాయపడ్డారు. రాజధాని కీవ్‌లో ముగ్గురు మరణించారు. మరో 19 మంది గాయపడ్డారు. మంగళవారం తెల్లవారకముందుగానే ఈ దాడులు జరిగాయి. ఈ క్షిపణి దాడులవల్ల మొత్తం ఐదు జిల్లాలలో నష్టం వాటిల్లినట్లు ఎమర్జెన్సీ విభాగం ప్రకటించింది.ఉక్రేన్ వ్యాప్తంగా ప్రజా మౌలిక సదుపాయాలపై రష్యా క్షిపణులతో దాడులు చేసిందని ఉక్రేన్ అధికారులు చెప్పారు. రెండు బాలిస్టిక్ క్షిపణులు,31 క్రూయిజ్ క్షిపణులు,142 డ్రోన్లతో ఉక్రేన్ వ్యాప్తంగా 29 ప్రాంతాలపై రష్యా దాడులు చేసింది. హోలోసివిస్కీ జిల్లాలో 26 అంతస్తుల నివాసేతర భవనం ఈ దాడుల్లో తీవ్రంగాధ్వంసమైంది.సోలోమైన్‌స్కీ జిల్లాలో ఐదు అంతస్తుల భవనంపై క్షిపణి దాడి చేయడంతో నివాసితులు శిథిలాల్లో చిక్కుకున్నారు.సహాయ బృందాలు పది మందిని సజీవంగా బయటకు తీశాయి. ఇదిలా ఉండగా రష్యాలో రెండు ఎస్‌యు–35ఎస్ యుద్ధ విమానాలు గగనతలంలో ఒకదానితో మరొకటి ఢీకున్నాయని రష్యన్ మీడియా ప్రకటించింది. ఈ ప్రమాదంలో ఒక పైలట్ మరణించారు.



# సౌదీపై హౌతీల భీకర దాడి

**దుబాయ్:**ఇరాన్ మద్దతుగల హౌతీ సైన్యాలు సౌదీ అరేబియాపై భీకర దాడులు చేశాయి. ఈ దాడుల్లో 73 మంది గాయపడ్డారు. ఈ చర్యలను సౌదీఅరేబియా ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. దేశంలోని దక్షిణ ప్రాంతంలో పలు పౌర, ఆర్థిక కేంద్రాలపై క్షిపణులు,డ్రోన్లతో హౌతీసైన్యాలు దాడులు చేశాయి.ఈ దాడుల్లో మహిళలు,పిల్లలు గాయపడ్డారు. అబ్హా అంతర్జాతీయ విమానాశ్రయం,కింగ్ ఖలీద్ వైమానిక స్థావరం, ప్రధాన చమురు కేంద్రం ఆరామ్‌కోలను లక్ష్యంగా చేసుకుని హౌతీలు దాడులు చేశారు. పలు ప్రాంతాల్లో మంటలు చెలరేగాయి. ఇంథన కార్యకలాపాలను చాలా గంటలసేపు నిలిపివేశారు. జిజాన్‌లోని కీలక చమురు శుద్ధికేంద్రానికి కూడా నష్టం వాటిల్లింది.దీంతో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 98 డాలర్లు పైగా పెరిగింది. సైదీ నగరాలైన అభాలోని జాజాన్,నజ్రీన్,ఖమీష్ ముసైత్‌లలో ఉన్న ఆర్థిక,పౌర మౌలిక సదుపాయాలపై దాడులు జరిగినట్లు సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాల ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కీ అల్ మల్కీ చెప్పారు. హౌతీలను అడ్డుకునేందుకు సంకీర్ణ బలగాలు అవసరమైన కార్యాచరణ చర్యలు తీసుకుంటాయన్నారు.

# అమెరికాపై కెనడా ప్రతీకార సుంకాలు

**తాడోపేడో తేల్చుకునేందుకే సిద్ధం**
**ఉత్పత్తులను నిషేధిస్తాం జాగ్రత్త: జమైసన్ గ్రీర్ హెచ్చరిక**

**ఒట్టావా:**అమెరికాతో తాడో పేడో తేల్చుకునేందుకే కెనడా ప్రభుత్వం సిద్ధపడింది. అ మెరికా నుండి దిగుమతయ్యే బిలియన్ డా లర్లు విలువైన వస్తువులపై కెనడా విధించి న భారీ సుంకాలు మంగళవారం నుండి అ మలులోకి వచ్చాయి. దీంతో ఈ రెండు దే శాలమధ్యా సమీప భవిష్యత్తుల్లో ఒక సానుకూల వాణిజ్య ఒప్పందం కుదిరే వాతావరణం కనిపించడం లేదు. అమెరికా–కెనడా మధ్య ప్రపంచంలోనే అతిపెద్ద ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు ఉన్నాయి. ఈ వాణిజ్యం విలువ 2025 ఆర్థిక సంవత్సరం లో 900 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అమెరికా విధించిన సుంకాల కారణంగా ఆగస్టునెలలో 41 వేలమంది కెనడియన్లు ఉద్యోగాలు కోల్పోయారు. అమెరికాపై ఆధారపడటం తగ్గిస్తామని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ ప్రతిజ్ఞ చేశారు. ఇరువైపులా భారీగా సుంకాలు విధించుకోవడంతో ఈ దేశాల వ్యాపారులు నానా సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఐతే ఒక పోల్ సర్వేలో అమెరికాపై కెనడా ప్రతీకార సుంకాలను ప్రజలు సమర్థించారు.అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కెనడా నుండి దిగుమతయ్యే వివిధ రకాల వస్తువులపై ఆగస్టు నెలాఖరులో యాభైశాతానికి పైగా సుంకాలు అమలులోకి తెచ్చారు. కార్లు ,టక్కులపై 25 శాతం సుంకాలతోపాటు పాల ఉత్పత్తులు, మద్యం, హాకీస్టిక్స్, పెర్ఫ్యూమ్స్‌పై కూడా యాభైశాతం సుంకాలు వేశారు. ఈ విషయంలో రెండు దేశాలమధ్య వివాదం చెలరేగింది. ఇప్పు డు కెనడా కూడా ప్రతీకార సుంకాలతో ట్రంప్‌ను సవాలు చేసింది. ఉక్కు, కాటన్ టీ షర్టులు, ఫర్నేచర్ సహా దాదాపు 20 బిలియన్ డాలర్లు విలువైన అమెరికా వస్తువులపై 50 శాతం మేరకు సుంకాలు వర్తిస్తాయి. తాజా చేపలు,ఎండ్రకాయలపై కూడా సుంకాలు కెనడా విధించినప్పటికీ దేశంలోని సముద్ర ఆహార ఉత్పత్తుల వి భాగం నుండి వ్యతిరేకత ఆరవడంతో ఆ సుంకాలను ఉపసంహరించింది. తాము ఒక ఒప్పందం చేసుకోవాలని కోరుకుంటున్నట్లు అమెరికా–కెనడా అధికారులు గతనెలలో ప్రకటించారు. కానీ ఆగస్టు నెలలో జరిగిన చర్చలు విఫలం కావడంతో ఆ తర్వాత వాటిలో పురోగతి కనిపించలేదు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ గతవారం పాత్రికేయులతో మాట్లాడుతూ, అమెరికాతో శాశ్వతమైన వాణిజ్య ఒప్పందాన్ని, ఇరుదేశాలకు ప్రయోజనకరమైన ఉత్తమమైన ఒప్పందానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు. అమెరికా సిద్ధంగా ఉంటే తాజా నిర్ణయాలన్ని రద్దు చేసుకుని కూర్చుని మాట్లాడుకోవడం ద్వారా ఒక ఒప్పందానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మరోవైపు అమెరికా తరపున చర్చల్లో పాల్గొన్న వాణిజ్య ప్రతినిధి జమైసన్ గ్రీర్ మాట్లాడుతూ, నిర్ణయం తీసుకోవాల్సింది కెనడా ప్రభుత్వమేననీ,వారికి ఒక అత్యుత్తమమైన ఆఫర్ ఇచ్చామని, కానీ వారు దానిని నిశితంగా పరిశీలించి వెనుదిరిగారంటూ ''ఇప్పుడు బంతి వారి కోర్టులోనే ఉంది'' అన్నారు. కొన్ని కెనడియన్ ఉత్పత్తులను అమెరికా నిషేధించే ప్రమాదం కూడా ఉందని జమైసన్ గ్రీర్ కెనడాకు ఒక హెచ్చరిక చేశారు.కెనడాకు చెందిన విమాన తయారీ సంస్థ బంబార్డియర్ తన ఉత్పత్తులను దక్షిణ ప్రాంతానికి తరలించకపోతే ఆ సంస్థతో వ్యాపారాన్ని నిలిపివేస్తామని డోనాల్డ్ ట్రంప్ సోమవారం ఒక హెచ్చరిక చేసిన మరునాడే కెనడా సుంకాలు అమలులోకి వచ్చాయి.



# చరమగీతం పాడాలి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. శాసనసభను ప్రజాస్వామ్య దేవాలయంగా భావించి సభ్యులంతా గౌరవప్రదంగా వ్యవహరించాలని సాంబశివరావు కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కన్నీళ్లు పెట్టుకున్న ఘటన ప్రతి ఒక్కరినీ కలచివేసిందని కూనంనేని సాంబశివరావు అన్నారు. స్పీకర్ ఏనాడూ తన పదవి దర్పాన్ని ప్రదర్శించలేదని, ధర్మరాజులోని ధర్మం, భూమాతలోని సహనం కలిగిన వ్యక్తిగా ఆయన అన్నారు. ఆవేశంలోనైనా వ్యక్తిగత దూషణలు, మహిళలను ఉద్దేశించిఅసభ్య పదజాలం ఉపయోగించడం తీవ్రంగా అభ్యంతరకరమన్నారు.ప్రజా సమస్యలను చర్చించాల్సిన సభలో సభ్యులు వ్యక్తిగత విషయాలపై వ్యాఖ్యలు చేయడం సరైంది కాదన్నారు. చొక్కాలు విప్పి ఘర్షణలకు దిగడం కూడా శాసనసభ గౌరవాన్ని దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. 'లా మేకర్స్ కాస్తా లా బ్రేకర్స్‌గా మారుతున్నారు' అని సాంబశివరావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో పుచ్చలపల్లి సుందరయ్య, తరిమెల నాగిరెడ్డి, తెన్నేటి విశ్వనాథం, వావిలాల గోపాలకృష్ణయ్య, గౌతు లచ్చన్న, ఎస్.జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు వంటి నేతలను చూసి సభా సంప్రదాయాలను నేర్చుకునేవారమని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం సభలో ఎలా మాట్లాడాలి అనే దాని కంటే పత్రికల్లో ఎలా రావాలనే దానిపై దృష్టి పెడుతున్న పరిస్థితి ఏర్పడడం బాధాకరమన్నారు. ఆ ఘటనకు సంబంధించి కచ్చితంగా సభా నియామవళి, చట్ట ప్రకారంగా పాత సాంప్రదాయాలు , పాత పద్ధతులు ఎలా ఉన్నాయో వాటికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కూనంనేనిసాంబశివరావు విజ్ఞప్తి చేశారు. అలాగే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పార్లమెంటరీ భాషపై సభ్యులకు శిక్షణ ఇవ్వాలని, ఏ పదాలు సభలో ఉపయోగించవచ్చో స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని కోరారు. హేట్ స్పీచ్‌లపై ఉన్న కమిటీని సమర్థంగా వినియోగించి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సభలో మహిళా ఎమ్మెల్యేల పట్ల ఎవరైనా అమర్యాదగా ప్రవర్తించినా, పోలీసులు అతిగా వ్యవహరించినా వీడియో ఫుటేజీలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు. గతంలో శాసనసభల్లో ఇలాంటి ఘటనలపై తీసుకున్న చర్యలను పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ద్వేషపూరిత ప్రసంగాలు, అనుచిత ప్రవర్తనకు ఇదే చివరి రోజు కావాలని శాసనసభ ప్రజలకు పాఠాలు నేర్పించే ప్రజాస్వామ్య దేవాలయం, బడిలా ఉండాలి అని కూనంనేని సాంబశివరావు అన్నారు.

# బిఆర్ఎస్ ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

మధుసూదనచారి, ఎల్.రమణ, దాసోజు శ్రావణ్‌లతో పాటు మరికొందరు మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతుండగా అడ్డుకోవడంతో అక్కడ కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే వారు అక్కడి నుంచి కదలకపోవడంతో మార్షల్స్ వారిని బలవంతంగా బయటకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో మార్షల్స్, బిఆర్ఎస్ సభ్యుల మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. కొద్దిసేపు అక్కడ గందరగోళ వాతావరణం నెలకొంది.అనంతరం మార్షల్స్ బలవంతంగా వారిని శాసన మండలి ప్రాంగణం నుంచి బయటికి తీసుకువచ్చి పోలీసు వ్యాన్‌లోకి ఎక్కించి తరలించారు.

# నీ తల్లిని కాదు'

(మొదటి పేజీ తరువాయి)


ప్రాంగణంలో సోమవారం జరిగిన ఘటనలు, ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ సభ్యుల మధ్య తీవ్ర స్థాయి వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలకు కెసిఆర్ నైతిక బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలని మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ధనసరి అనసూయ సీతక్క డిమాండ్ చేశారు. ఈ గందరగోళం మధ్య బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి 22ఎ నిషేధిత భూముల జాబితాపై తక్షణమే చర్చ జరపాలని పట్టుబట్టడంతో సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. ఒకే ఊదుటున బిఆర్ఎస్ సభ్యులు స్పీకర్ పోడియం వైపు దూసుకరావడంతో పరిస్థితిని అదుపు చేసేందుకు స్పీకర్ సభను వాయిదా వేశారు.

**'ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి'**

సభ ప్రారంభం కాగానే బిఆర్ఎస్ సభ్యుల ఆందోళనపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఆవేశపడటంపై స్పీకర్ తీవ్రంగా స్పందిస్తూ భావోద్వేగానికి గురయ్యారు. 'మీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారు. ఆవేశం మీకు కాదు.. నాకు ఉండాలి' అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 'సభలో లొల్లిపెడితే నేను భయపడను, మీరు చేసేది తప్పు. నాకున్న ఎనిమిది మంది అక్కాచెల్లెళ్లు ఉన్నారు. వారితో పాటు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి కూడా నా సోదరీమణులే. వారి పట్ల నాకు గౌరవం ఉంది. వారి పట్ల పోలీసుల వ్యవహార శైలిపై నివేదిక కోరాను. రిపోర్టు రాగానే చర్యలు తీసుకుంటాం. కానీ ముందు నా తల్లిని అవమానించినందుకు ఏమి సమాధానం చెబుతారు?' అని హరీశ్ రావును స్పీకర్ నిలదీశారు. కానీ ముందు తన సంగతేంటో చెప్పాలని అన్నారు. తన తల్లిని దూషించిన దానికి సమాధానం చెప్పు హరీశ్ రావు అంటూ స్పీకర్ నిలదీశారు.

# సస్పెన్షన్

(మొదటి పేజీ తరువాయి)



సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ''ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్‌రెడ్డి సభా మర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలను తీవ్రంగా నిరసిస్తోంది. ఈ ఇద్దరు సభ్యులు మహిళల ఎదుట చొక్కాలు విప్పి అనుచితంగా, అసభ్యకరంగా, సమాజం తలదించుకునేలా ప్రవర్తించడాన్ని కూడా ఈ సభ తీవ్రంగా ఖండిస్తోంది. ఇలాంటి ప్రవర్తన శాసనమండలి సభ్యుని హోదాకు ఏమాత్రం తగదని, శాసన సభాపతి గౌరవం, అధికారం రాజ్యాంగ బద్ధ హోదాకు తీవ్ర భంగం కలిగించిందని ఈ సభ భావిస్తోంది. ఇది తెలంగాణ శాసనసభ గౌరవం, సభా హక్కులు, సంస్థాగత సమగ్రతకు విఘాతం కలిగించే చర్యగా ఈ సభ పరిగణిస్తోంది. రాజకీయ విభేదాలు, వ్యక్తిగత అభ్యంతరాలు, భిన్నాభిప్రాయాలు ఏవైనా సరే, సభాపతి హోదాలో ఉన్న వ్యక్తి గౌరవాన్ని, అధికారాన్ని తగ్గించే ఉద్దేశంతో సభ్యులు ప్రవర్తించడాన్ని సమర్థించబోమని ఈ సభ స్పష్టం చేస్తోంది. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించటాన్ని సహించేదిలేదని సభ అభిప్రాయపడుతుంది. తమ పార్టీ సభ్యుల అనుచిత ప్రవర్తనకు ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావు బాధ్యత స్వీకరించి, ఈ సభ హుందాతనం, సభా మర్యాదలను పరిరక్షించేందుకు, శాసనసభాపతికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి. తాతా మధుసూదన్, ఎన్. నవీన్ కుమార్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణ శాసనమండలి సభ్యులుగా ఉన్నందున, ఈ తీర్మానం ప్రతితో పాటు సభ ముందు ఉంచిన ఆధారాలు, సభా హక్కుల ఉల్లంఘన నోటీసు, వాటికి సంబంధించిన కార్యకలాపాల వివరాలను తెలంగాణ శాసనమండలి చైర్మన్‌కు పంపించాలని సభ తీర్మానిస్తోంది. ఈ అంశంపై శాసనమండలి సభా హక్కులు, సభా విధానాలు, క్రమశిక్షణకు సంబంధించిన నిబంధనలకు అనుగుణంగా శాసనమండలి చైర్మన్ తదుపరి చర్యలు తీసుకోవాలి'' అని కోరుతూ మంత్రి దామోదర్ రాజనర్సింహా సభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదిస్తున్నట్లు స్పీకర్ స్థానంలో ఉన్న ప్యానల్ స్పీకర్ కడియం శ్రీహరి ప్రకటించారు.

**దళితులకు అవమానాలు, పోరాటాలు కొత్తకాదు : మంత్రి దామోదర్ రాజ నర్సింహా**

అంతకు ముందు మంత్రి దామోదర రాజ నర్సింహా మాట్లాడుతూ ''దళితులకు అవమానాలు, పోరాటాలు కొత్తకాదు... దళితుల చరిత్ర అంటే పోరాటాల చరిత్ర.. ఆత్మగౌరవ చరిత్ర. ఆత్మగౌరవమే మా అలంకారం.. ఆత్మగౌరవమే మా స్ఫూర్తి. ఆ ఆత్మగౌరవంతోనే ఈ స్థాయికి వచ్చాం'' అని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరిగితే యువత తిరగబడుతుందని, తెలంగాణ యువతను, ముఖ్యంగా దళిత సమాజాన్ని తక్కువగా అంచనా వేయొద్దని హెచ్చరించారు.తరతరాలుగా వివక్ష, అవమానాలను ఎదుర్కొంటూ, పోరాడుతూ, రాజ్యాంగం కల్పించిన హక్కులతో ఈ స్థాయికి వచ్చామని అన్నారు. ఇలాంటి ఘటనలు తమను భయపెట్టలేవని, మరింత బలంగా, మరింత ఆత్మగౌరవంతో నిలబడేలా చేస్తాయని స్పష్టం చేశారు.కుల వివక్ష, అసమానతలు, అస్పృశ్యతకు వ్యతిరేకంగా తరతరాలుగా పోరాటాలు జరిగాయని, ఆ పోరాటానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని అన్నారు. ఆత్మగౌరవంతో జీవించడం, సమానత్వంతో జీవించడం, ఎవరి ముందు తలవంచకపోవడమే అంబేద్కర్ చూపిన మార్గమని తెలిపారు.స్పీకర్‌ను, ఆయన తల్లిని అవమానించే విధంగా మాట్లాడటం అత్యంత హేయమైన విషయమని మంత్రి తీవ్రంగా ఖండించారు. రాజకీయాల్లో విమర్శలు, అభిప్రాయ భేదాలు సహజమని, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు, విధానాలను విమర్శించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. కానీ వ్యక్తిగత దూషణలు, కుటుంబ సభ్యులను అవమానించడం, ఒక తల్లిని దూషించడం అత్యంత దిగజారుడుతనమని మంత్రి పేర్కొన్నారు. స్పీకర్ పదవి ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, అది రాజ్యాంగబద్ధమైన పదవి అని మంత్రి అన్నారు. శాసనసభ, స్పీకర్ పదవి, న్యాయవ్యవస్థ వంటి రాజ్యాంగ సంస్థలను, వాటి అధిపతులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

**సభాపతి పీఠాన్ని కించపరిచే వ్యాఖ్యలను సహించేది లేదు : ఎన్. పద్మావతి రెడ్డి**

మహిళా పోలీసుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బిఆర్ఎస్ నేతలు, సభ్యులు వ్యవహరించడం సభ్యసమాజం తలదించుకునే ఘటన అని కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలపై మంగళవారం శాసనసభలో జరిగిన చర్చలో ఆమె మాట్లాడుతూఒక మహిళగా, ప్రజాప్రతినిధిగా ఇలాంటి అంశంపై శాసనసభలో మాట్లాడాల్సి రావడమే తీవ్ర బాధ కలిగిస్తోందన్నారు. విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులను అవమానించే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. 10 మంది పురుషులు చొక్కాలు విప్పి మహిళా పోలీసుల వైపు దూసుకొస్తే అక్కడ విధుల్లో ఉన్న యువ మహిళా కానిస్టేబుళ్లు ఎంతటి మానసిక వేదన, భయానికి గురై ఉంటారో ఊహించుకోవాలని అన్నారు. ఆ దృశ్యాలను చూడటానికే భయమేస్తోందని, విధి నిర్వహణకు వచ్చిన ఆడబిడ్డలు ఇలాంటి అవమానాన్ని ఎదుర్కోవడం తనను కలచివేసిందన్నారు. నల్లచొక్కాలు ధరించడంపై ఎవరికీ అభ్యంతరం లేదని, సభా నియమాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించి సమావేశాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. సభాపతి గౌరవం ఒక వ్యక్తికి సంబంధించినది కాదని, అది మొత్తం శాసనసభ గౌరవమని పద్మావతి రెడ్డి పేర్కొన్నారు. మహిళా పోలీసులపై అవమానకరంగా ప్రవర్తించిన వారితోపాటు సభాపతి, మహిళా ప్రజాప్రతినిధులు, ముఖ్యమంత్రి, మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలనిసభాపతిని కోరారు.

# గడువు పొడిగింపు

(మొదటి పేజీ తరువాయి)

జూలై 29న నోటిఫికేషన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకోగా, వారిలో 2,76,085 మంది విజయవంతంగా ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించారు. ఇంకా దరఖాస్తు చేయని అభ్యర్థులు గడువును సద్వినియోగం చేసుకోవాలని బోర్డు సూచించింది.ఈ నియామక ప్రక్రియలో తొలిసారిగా ఎఎస్‌పిఎఫ్, ఫైర్ సర్వీసెస్ శాఖల్లో మహిళలకు 33.3 శాతం అంటే మూడో వంతు రిజర్వేషన్ కల్పించారు. అలాగే పోలీసు నియామకాల్లో ఎస్సీ అభ్యర్థులకు గ్రూప్1, గ్రూప్2, గ్రూప్ 3 రిజర్వేషన్లను తొలిసారిగా అమలు చేస్తున్నారు. అభ్యర్థుల ధ్రువీకరణలో భాగంగా ఆధార్ వెరిఫికేషన్‌ను కూడా పకడ్బందీగా చేపడుతున్నారు. ఇప్పటికే 95 శాతానికి పైగా అభ్యర్థుల ఆధార్ వెరిఫికేషన్ పూర్తయినట్లు బోర్డు వెల్లడించింది. దరఖాస్తుల గడువు పొడిగించినప్పటికీ చివరి నిమిషంలో సర్వర్ సమస్యలు, అధిక ట్రాఫిక్ కారణంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని బోర్డు హెచ్చరించింది. అర్హత ఉన్న అభ్యర్థులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దరఖాస్తులు, నియామక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాల కోసం బోర్డు అధికారిక వెబ్‌సైట్ సంప్రదించాలని పేర్కొంది.

# ఘోర అవమానం

(మొదటి పేజీ తరువాయి)

కోల్పోయామనే ఉక్రోషంతో, తిరిగి రాష్ట్రాన్ని తమ గుప్పెట్లోకి తీసుకోవాలనే దుర్బుద్ధితోనే బిఆర్ఎస్ ఈ కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. వివక్ష, అవమానాలకు వ్యతిరేకంగా తెలంగాణ సమాజం దశాబ్దాలుగా పోరాడిందని,అలాంటి తెలంగాణలో మళ్లీ ఫ్యూడల్ మనస్తత్వం, దొరలు, జాగీర్దారులు, జమీందారులు, పెత్తందారుల ఆలోచనా విధానాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

**ఇదొక పెద్ద కుట్ర...**

సభలో జరిగిన రచ్చ ఆషామాషీగా జరిగలేదని, దీని వెనుక పెద్ద కుట్ర ఉందని భట్టి విక్రమార్క అన్నారు. 'ఫామ్ హౌస్ కాన్స్పిరసీ'లోనే ప్రజాస్వామ్యంపై దాడి చేసేందుకు పథకం చేశారని ఆయన ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూపొందించిన రూల్స్ ప్రకారమే టీషర్ట్‌పైన నినాదాలు రాసుకుని వస్తే నిలిపివేశారని వివరించారు. ఆ నిబంధనలు అమలు చేసినందుకే సభాపతిని పరుష పదజాలంతో దూషించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఒక మహిళను, ముఖ్యంగా సభాపతి తల్లిని ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం అత్యంత బాధాకరమన్నారు. తాము పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ సభాపతి స్థానాన్ని గౌరవించామని గుర్తు చేశారు. బిఆర్ఎస్ అనుసరిస్తున్న విధానం 'స్పిరిట్ ఆఫ్ డెమోక్రసీ'ని పూర్తిగా దెబ్బతీసే విధంగా ఉంటుందని ఆరోపించారు.ఇలాంటి కుట్రదారులు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమన్నారు. 'ఫామ్‌హౌస్ కుట్ర'ను శాసనసభ పూర్తిగా ఖండించాలని కోరారు.

**ఆ 'గాయాల పట్టీలు' కనిపించలేదు....?**

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పోలీసు గాయాలు జరిగినట్టు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు పట్టీలు కట్టుకున్నారని, 'ఇవాళ' (మంగళవారం) వారిని సభలో చూస్తే ఆ పట్టీలు కనిపించలేదని, గాయాలు కూడా లేవన్నారు. అనిరుథ్‌రెడ్డి మాట్లాడుతూ,విజయరమణారావు కెసిఆర్ సూచన మేరకే వీదిరౌడిల్లాగా ప్రవర్తించారని మండిపడ్డారు. టి.రామ్మోహన్ రెడ్డి శాసనసభకు రాకుండా జీతభత్యాలు పొందుతున్న కెసిఆర్‌ను బర్తరఫ్ చేయాలని, మట్ట రాగమయి, యశ్వసిని రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ లు వ్యవహరించిన తీరు బాధకరమన్నారు. మహి ళా పోలీసుల ఎదుటే షర్టులు విప్పడం విచారకరమన్నారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ కౌశిక్ రె డ్డిపైన కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. దానంనాగేందర్ మాట్లాడుతూ స్పీకర్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఎమ్మెల్సీల పైన చర్యలు తీసుకోవాలన్నారు.

**ప్యానల్ స్పీకర్లుగా కూనంనేని,కడియం, బాలునాయక్,కౌసర్**

వర్షకాల శాసనసభ సమావేశాల ప్యానల్ స్పీకర్ల జాబితాను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. ప్యానల్ స్పీకర్లుగా సిపిఐ శాసనసభాపక్ష నేత కూనంనేసి సాంబశివరావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి,బాలు నాయక్, కౌసర్ మొయినుద్దీన్‌లను ప్యానల్ స్పీకర్లుగా ప్రకటించారు.

**మాజీ ఎమ్మెల్యేల మరణం పట్ల శాసనసభ సంతాపం...**

మాజీ ఎమ్మెల్యేలు వంగ సుబ్బారావు, కొమ్మిడి నర్సింహరెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, జి.సిద్ధయ్య మరణం పట్ల శాసనసభ సంతాపం వ్యక్తం చేస్తూ కొద్ది మౌనం వ్యక్తం చేసింది. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది.

**''పాలిటెక్నిక్'' విలీన అంశాన్ని విరమించుకోవాలి..**
**అసెంబ్లీలో సిపిఐ వాయిదా తీర్మానం...**
**తిరస్కరించిన స్పీకర్...**

శాసనసభలో వాయిదా తీర్మాన నోటీసు ఇచ్చిన సిపిఐ ఎల్‌పి నేత కూనంనేని సాంబశివ రావు పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.ఈ అంశంపై చర్చించేందుకు వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అత్యవసర ప్రజాప్రాముఖ్యత కలిగిన ఈ నిర్దిష్ట విషయంపైన చర్చకు అనుమతించాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీ లో విలీనం చేసే ప్రతిపాదనను ఉపసంహరించుకోవడంతో పాటు, దీనికి సంబంధించిన జిఒ నంబర్ 97ను వెంటనే రద్దు చేయాలన్నారు. కాగా ఈ తీర్మానాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తిరస్కరించారు.

# ఫామ్‌హౌస్ ముట్టడి

(మొదటి పేజీ తరువాయి)

డిసిపి జోయల్ డేవిస్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రజ్ఞాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అక్కడి నుండి మెరుగైన చికి త్స కోసం హైదరాబాద్ తరలించారు. ఎర్రవల్లిలో ని కెసిఆర్ ఫాంహౌజ్ వద్దకు డప్పు చప్పులకు పిలు పు నిచ్చిన రాష్ట్ర కాంగ్రెస్ నేత సతీష్ మాదిగ స్వ యంగా డప్పు వాయిస్తూ అనుచరులతో ర్యాలీగా తరలి వచ్చి హంగామా సృష్టించారు. అలాగే ఎమ్మెల్యేలు వేముల వీరేశం, అనిల్ కుమార్ రెడ్డి, ఈర్లపల్లి శంకర్ తమ అనుచరులతో ఎర్రవల్లి సమీపంలోకి అడుగు పెట్టగా, పోలీసులు వారిని ఎక్కడికక్కడే అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్‌ను దూషించిన సంఘటనలో గులాబీ అధిపతి కెసిఆర్ క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఎర్రవల్లి దారులన్నీ పోలీస్ మయం కాగా, అరెస్టులను అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్తలపై పోలీసుల స్వల్ప లాఠీచార్జి చేశారు. అయితే ఎర్రవల్లికి తరలివస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులను దామరకుంట, మర్కుక్, వరదరాజపూర్ తదితర గ్రామాల శివారులలో బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. సాయంత్రం వరకు ఎర్రవల్లి శివారులో ఉద్రిక్త వాతావరణం కనిపించగా, పోలీసులు 144 సెక్షన్ విధించినప్పటికీ ఆయా పార్టీల శ్రేణులు తరలివచ్చి గొడవలకు దిగడంతో పలువురు నేతలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరమాల్ ఆధ్వర్యంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా, ఆమె సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ చర్యలు తీసుకోవడం కనిపించింది.

**నిమ్స్‌లో తూంకుంట నర్సారెడ్డికి పరామర్శ**

నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట మాజీ డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి తదితర కాంగ్రెస్ నేతలు మంగళవారం పరామర్శించారు. ఎర్రవల్లి ఫామ్ హౌస్ వద్ద ఉదయం జరిగిన నిరసన కార్యక్రమంలో బిఆర్ఎస్ కార్యకర్తల దాడిలో నర్సారెడ్డి తీవ్రంగా గాయపడటంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న నాయకులు, అందుతున్న వైద్య చికిత్స వివరాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం నర్సారెడ్డి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, అవసరమైన వైద్య చికిత్స అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. నర్సారెడ్డికి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, ఆయన త్వరగా కోలుకోవాలని నాయకులు ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు.

# ఫైనల్లో ఎదురీదుతున్న సౌత్

## తిలక్ అజేయ అర్ధశతకం

దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ పట్టుబిగించగా.. సౌత్ జోన్ ఎదురీదుతోంది. చిదంబరం స్టేడియంలో ఈస్ట్ బౌలర్ల ధాటికి ఓపెనర్లు తేలిపోగా దేవ్దత్ పడిక్కల్(62) అర్ధ శతకంతో మెరిశాడు. మహమ్మద్ షమీ(2–17), ముకేశ్ కుమార్(2–36)లు ఆరంభంలోనే దెబ్బకొట్టినా.. పడిక్కల్, కెప్టెన్ తిలక్ వర్మ(56 నాటౌట్) నిలబడడంతో ఈస్ట్ కాస్త కోలుకుంది. మూడో రోజు ఆట ముగిసే సరికి ఆరు వికెట్లు కోల్పోయిన సౌత్ 466 పరుగులు వెనకబడి ఉంది. ఈస్ట్ జోన్తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్ తడబడుతోంది. చిదంబరం స్టేడియంలో ఇషాన్ కిషన్ (270) రికార్డు డబుల్ సెంచరీతో భారీ స్కోరందించగా.. ఈస్ట్ బౌలర్లు ముకేశ్ కుమార్(2–36), మహమ్మద్ షమీ(2–17)లు ఆదిలోనే సౌత్ను తీసి దెబ్బతీశారు. మూడో రోజు తొలి సెషన్లోనే రికీ భుయి(1)ని ముకేశ్ పెవిలియన్ పంపగా.. మరో ఓపెనర్ నారాయణ్ జగదీశన్(32)ను శిఖర్ మోహన్ ఔట్ చేశాడు. అంతే.. 70 పరుగులకే రెండు వికెట్లు పడ్డాయి. ఓపెనర్లు విఫలమైనా దేవదత్ పడిక్కల్ (62) అర్ధ శతకంతో మెరిశాడు.





తిలక్ నిలబడ్డాడు..

శ్రీలంక పర్యటనలో సెంచరీలతో చెలరేగిన ఈ లెఫ్ట్ హ్యాండర్ ఈస్ట్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొని స్కోర్ బోర్డును నడిపించాడు. అయితే.. అతడిని ముకేశ్ వెనక్కి పంపి రెండో వికెట్ సాధించాడు. ఆపై షేక్ రషీద్(27), స్మరణ్ రవిచంద్రన్(23)లను షమీ బోల్తా కొట్టించాడు. అంతే.. 174కే ఈస్ట్ సగం వికెట్లు కోల్పోయింది. ఆ దశలో కెప్టెన్ తిలక్ వర్మ(56 నాటౌట్), శ్రేయాస్ గోపాల్(26)లు కీలక భాగస్వామ్యంతో ఆదుకున్నారు. టీ సెషన్లో నింపాదిగా ఆడిన వీరు ఆరో వికెట్కు 70కి పైగా రన్స్ జోడించారు. అయితే.. గోపాల్ను ఖరేషి ఔట్ చేసి సౌత్కు షాకిచ్చాడు. అయినా సరే తిలక్ మరో వికెట్ పడకుండా ఆచితూచి ఆడాడు. దాంతో, మూడో రోజు ఆట ముగిసే సరికి సౌత్ ఆరు వికెట్ల నష్టానికి 242 పరుగులు చేసింది. ఇంకా తొలి ఇన్నింగ్స్లో 466 పరుగులు వెనకబడి ఉంది. మరొక్క రోజే ఆట మిగిలి ఉండడంతో ఈస్ట్ జోన్ టైటిల్ను ముద్దాడడం లాంఛనమే.



## కాషాయం కథ ముగిసె
## ఆసియాడ్లో నీలం జెర్సీతో టీమిండియా

భారత హాకీ జట్టు జెర్సీ రంగు మార్పుపై దుమారం రేపిన విషయం తెలిసిందే. ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్కప్ ముందు నీలం రంగు స్థానంలో కాషాయంను ప్రవేశపెట్టడంపై విమర్శలు రాగా.. ఆ టోర్నీలో అదే జెర్సీతో ఆడిన టీమిండియా నిరాశపరిచింది. దాంతో.. రాబోయే టోర్నమెంట్లలో మునుపటి బ్లూ కలర్నే కొనసాగించాలని భారత జట్టు నిర్ణయించుకుందని సమాచారం. త్వరలో జరుగనున్న 20వ ఆసియా క్రీడల్లో హర్మన్ప్రీత్ సింగ్, సలీమా టెటె సారథ్యంలోని జట్లు తమకు అచ్చొచ్చిన నీలంతోనే బరిలోకి దిగనుందని హాకీ ఇండియా వర్గాలు చెబుతున్నాయి. భారత హాకీలో కాషాయం కథ ముగిసింది. ఆగస్టులో జరిగిన ఎఫ్ఐహెచ్ పురుషుల, మహిళల హాకీ వరల్డ్ కప్లో ఆరెంజ్ జెర్సీతో ఆడిన టీమిండియా..ఈసారి సంప్రదాయ నీలం రంగుకే ఓటేయనుంది. జపాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా క్రీడల్లో నీలం రంగు జెర్సీతోనే భారత పురుషుల, మహిళల జట్లు బరిలోకి దిగనున్నాయని సమాచారం. ఈ మెగా ఈవెంట్లో తొలి ప్రధాన్య కిట్ రంగుగా నీలం ఉండనుందని హాకీ ఇండియా తెలిపింది.

## అఫ్గాన్తో టి–20లకు సుందర్ ఫిట్
## బుమ్రాపై నిర్ణయం ఆరోజే



శ్రీలంక పర్యటనకు దూరమైన భారత క్రికెటర్ వాషింగ్టన్ సుందర్ ఫిట్నెస్ సాధించాడు. స్వదేశంలో అఫ్గనిస్థాన్తో జరుగనున్న టీ20 సిరీస్కు ఎంపికైన ఈ స్పిన్ ఆల్రౌండర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్లో ఫిట్నెస్ నిరూపించుకున్నాడు. దాంతో.. మూడు మ్యాచ్ల సిరీస్లో సుందర్ ఆడడం ఖాయమైంది. మరో నాలుగు రోజుల్లో తొలి మ్యాచ్ ఉన్నందున ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ స్పీడ్స్టర్ ఫిట్నెస్పై సెప్టెంబర్ 9వ తేదీ బుధవారం నిర్ణయం వెలువడనుంది. అఫ్గనిస్థాన్తో టీ20 సిరీస్కు మరో నాలుగు రోజులే ఉంది. స్వదేశంలో జరుగుతున్న ఈ సిరీస్కు ఎంపికైన ఆటగాళ్ల ఫిట్నెస్ కోసం నిరీక్షిస్తున్న భారత జట్టుకు గుడ్న్యూస్. స్పిన్ ఆల్రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఫిట్నెస్ నిరూపించుకున్నాడు. గాయంతో శ్రీలంక పర్యటనకు దూరమైన సుందర్ బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్లో నిర్వహించిన ఫిట్నెస్ పరీక్షలో గట్టెక్కాడు. అయితే.. ఇప్పటికీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్లోనే ఉన్న జస్ప్రీత్ బుమ్రా, పేస్ ఆల్రౌండర్లు హర్షిత్ రానా, నితీశ్ కుమార్ రెడ్డిల ఫిట్నెస్పై స్పష్టత రాలేదు. ఈ ముగ్గురు ఫిట్గా ఉన్నారా? లేదా? అనే విషయంపై సెప్టెంబర్ 9న బీసీసీఐ ప్రకటన చేయనుంది. సెప్టెంబర్ 13వ తేదీన కాబూలీలో తొలి టీ20తో సిరీస్ మొదలవ్వనుంది.

మహిళ

## పేగుల అనారోగ్యంతో
# రొమ్ము కేన్సర్ ముప్పు!

అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా కాంప్రిహెన్సివ్ కేన్సర్ సెంటర్ శాస్త్రవేత్తలు నిర్వహించిన తాజా పరిశోధనలో ఒక కీలక విషయం వెలుగులోకి వచ్చింది. పేగుల్లో ఉండే సూక్ష్మ జీవుల సమతుల్యత (గట్ మైక్రోబయోమ్) దెబ్బతినడం వల్ల బైల్ యాసిడ్లు (పిత్త ఆమ్లాలు) శరీరంలో అధికంగా పేరుకుపోతాయని, ఈ పరిస్థితి రొమ్ము కేన్సర్ ఇతర అవయవాలకు వేగంగా వ్యాపించడానికి అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తుందని వారు గుర్తించారు. ఈ పరిశోధన భవిష్యత్తులో రొమ్ము కేన్సర్ వ్యాప్తిని అడ్డుకునే కొత్త చికిత్సా మార్గాలకు దారి తీసే అవకాశముందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మన పేగుల్లో కోట్లాది ప్రయోజనకరమైన సూక్ష్మ జీవులు నివసిస్తుంటాయి. వాటినే గట్ మైక్రోబయోమ్ అని పిలుస్తారు. జీర్ణక్రియ, రోగనిరోధక వ్యవస్థ, శరీర జీవక్రియలను సమతుల్యం చేయడంలో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. అయితే అనారోగ్యకరమైన ఆహారం, యాంటీబయోటిక్స్ అధిక వినియోగం లేదా ఇతర కారణాల వల్ల ఈ సూక్ష్మ జీవుల సమతుల్యత దెబ్బతింటే దానిని గట్ డిస్బయోసిస్ అంటారు. ఈ పరిస్థితిలో బైల్ యాసిడ్ల రసాయన కూర్పును నియంత్రించే ప్రయోజనకరమైన బ్యాక్టీరియా తగ్గిపోతుంది. ఫలితంగా శరీరంలో బైల్ యాసిడ్లు అధికంగా పేరుకుపోతాయి. ఇవి జీర్ణక్రియకు అవసరమైనవే అయినప్పటికీ, పరిమితికి మించి ఉంటే శరీర జీవక్రియ, రోగనిరోధక వ్యవస్థపై



ప్రతికూల ప్రభావం చూపుతాయి.

**హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్...** తాజా అధ్యయనం ప్రధానంగా హార్మోన్ రిసెప్టర్ పాజిటివ్ (హెచ్ఆర్+) రొమ్ము కేన్సర్పై దృష్టి సారించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణంగా కనిపించే రొమ్ము కేన్సర్ రకం. ఈ కేన్సర్ ప్రారంభ దశలోనే శరీరంలోని లింఫ్ గ్రంథులు, ఊపిరితిత్తులకు వ్యాపించే అవకాశం ఉంటుంది. ఒకసారి ఇతర అవయవాలకు వ్యాపించిన తర్వాత చికిత్స మరింత క్లిష్టమవుతుంది. ఇప్పటివరకు గట్ డిస్బయోసిస్ ఉన్న రోగుల్లో చికిత్స ఫలితాలు అంతగా ఆశాజనకంగా ఉండవని తెలిసినా, దానికి కారణమైన జీవశాస్త్రీయ ప్రక్రియ స్పష్టంగా తెలియలేదు. ఈ కొత్త అధ్యయనం ఆ లోటును పూరించింది. గట్ మైక్రోబయోమ్ దెబ్బతినడం వల్ల బైల్ యాసిడ్లు పెరగడం, అవి వాపును ప్రేరేపించడం, చివరకు కేన్సర్ కణాల వ్యాప్తిని వేగవంతం చేయడం అనే పూర్తి ప్రక్రియను శాస్త్రవేత్తలు వివరించారు.

**అందుబాటులో ఉన్న మందులు ప్రయోజనకరమేనా?...** బైల్ యాసిడ్ సీక్వెస్ట్రెంట్స్ అనే మందులు తీసుకున్న మెటాస్టాటిక్ రొమ్ము కేన్సర్ రోగులు ఇతరులతో పోలిస్తే ఎక్కువకాలం జీవించినట్లు పరిశోధకులు గమనించారు. ఈ మందులు ఇప్పటికే అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్డిఎ) ద్వారా ఇతర జీవక్రియ సంబంధిత వ్యాధుల చికిత్సకు ఆమోదం పొందాయి. అయితే ఈ మందులే నేరుగా కేన్సర్ వ్యాప్తిని అడ్డుకుంటున్నాయా లేదా అనే విషయాన్ని నిర్ధారించడానికి మరిన్ని పరిశోధనలు అవసరమని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

**భవిష్యత్ చికిత్సలపై ఆశలు...**రొమ్ము కేన్సర్ చికిత్సలో తాజా అధ్యయనం ఒక కొత్త దిశను సూచిస్తోంది. గట్ మైక్రోబయోమ్ను ఆరోగ్యంగా ఉంచడం, బైల్ యాసిడ్ల స్థాయిలను నియంత్రించడం ద్వారా కేన్సర్ ఇతర అవయవాలకు వ్యాపించే ప్రమాదాన్ని తగ్గించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అంతేకాకుండా, పేగుల్లో ప్రయోజనకరమైన బ్యాక్టీరియాను తిరిగి పెంపొందించే చికిత్సలు లేదా ఇప్పటికే అందుబాటులో ఉన్న బైల్ యాసిడ్ను తగ్గించే మందులను ఉపయోగించడం ద్వారా మెటాస్టాటిక్ రొమ్ము కేన్సర్ను నివారించే అవకాశాలను కూడా పరిశీలిస్తున్నారు. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, భవిష్యత్తులో పెద్ద స్థాయిలో జరిగే క్లినికల్ పరీక్షలు ఈ ఫలితాలను ధృవీకరిస్తే, రొమ్ము కేన్సర్ చికిత్సలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచి, వేలాది మంది రోగుల ప్రాణాలను కాపాడే అవకాశముంది.

## టీనా మక్లో అసాధారణ సాహసం

అమెరికాలో, 1971 నవంబర్ 24న జరిగిన డి.బి. కూపర్ విమాన హైజాకింగ్ ప్రపంచ చరిత్రలో ఇప్పటికీ అంతుబట్టని అతిపెద్ద రహస్యాల్లో ఒకటిగా నిలిచింది. 'డాన్కూపర్' అనే పేరుతో విమానంలో ప్రయాణించిన ఓ వ్యక్తి తన వద్ద బాంబు ఉందని ప్రకటించి, రెండు లక్షల డాలర్లు, నాలుగు పారాచూట్లను డిమాండ్ చేశాడు. అనంతరం డబ్బుతో పాటు పారాచూట్ ధరించి విమానం నుంచి దూకి అదృశ్యమయ్యాడు. అతను బతికాడా? మరణించాడా? ఆ డబ్బు ఏమైంది? అనే ప్రశ్నలకు ఇప్పటికీ సమాధానం దొరకలేదు. అయితే ఈ సంఘటనలో రహస్యమయమైన హైజాకర్ కంటే ఎక్కువగా గుర్తుంచుకోవాల్సిన వ్యక్తి అప్పటికి కేవలం 22 ఏళ్ల వయస్సు గల విమాన సిబ్బంది సభ్యురాలు 'టీనా మక్లో'. అత్యంత ప్రమాదకర పరిస్థితిలో ఆమె ప్రదర్శించిన ధైర్యం, సంయమనం, సమయస్ఫూర్తి వందలాది ప్రాణాలను కాపాడింది. హైజాకర్తో గంటల తరబడి ప్రశాంతంగా మాట్లాడటం, అతని



డిమాండ్లను పైలట్లకు, అధికారులకు చేరవేయడం, ఎలాంటి భయాందోళనకు లోనుకాకుండా పరిస్థితిని నియంత్రించడం ఆమె అసాధారణ మానసిక స్థైర్యానికి నిదర్శనం. సియాటిల్లో ప్రయాణికులను విడుదల చేసిన తర్వాత కూడా హైజాకర్ టీనాను విమానంలోనే ఉండాలని ఆదేశించాడు. ఆ తర్వాత విమానం ప్రయాణిస్తుండగా, ఆమెను మిగిలిన సిబ్బందితో కలిసి కాక్పిట్లోకి పంపించి, తాను రాత్రి చీకట్లో విమానం నుంచి దూకిపోయాడు. సంక్షోభ సమయంలో భయాన్ని జయించి ప్రశాంతంగా వ్యవహరించే ఒక వ్యక్తి, ఎన్నో ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందనే వాస్తవం టీనా కథ రుజువు చేస్తుంది. కొన్ని రహస్యాలు ఎప్పటికీ ఛేదించబడకపోవచ్చు. కానీ వాటి వెనుక నిలిచిన ధైర్యవంతుల గాథలు మాత్రం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి.

# పల్లా సుధీర్రెడ్డి కన్నుమూత


### స్వగ్రామం పడమటిపల్లిలో అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించిన సిపిఐ నేతలు

ప్రజాపక్షం/హైదరాబాద్/దేవరకొండ : సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి కుమారుడు పల్లా సుధీర్రెడ్డి మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. సుధీర్రెడ్డి మరణ వార్త తెలుసుకున్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ్మ, సిపిఐ ఎమ్మెల్సీ, జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఛాయదేవి, హైదరాబాద్ నగర కార్యదర్శి స్టాలిన్లు హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. సుధీర్రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం పల్లా సుధీర్రెడ్డి భౌతికకాయాన్ని స్వగ్రామం నల్లగొండ జిల్లా దేవరకొండ మండలంలోని పడమటిపల్లి కి తరలించారు. పడమటిపల్లిలో మంగళవారం జరిగిన అంత్యక్రియల్లో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్రెడ్డి, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణలు పాల్గొని సుధీర్రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సుధీర్ మృతి కలచివేసిందన్నారు. ఆయన మృతి నర్సింహారెడ్డి కుటుంబానికి, పార్టీకి తీరని లోటన్నారు. కుమారుడిని బతికించుకోవడం కోసం నర్సింహారెడ్డి శ్రమించారన్నారు. సుధీర్ లేని లోటు ఎవరు తీర్చలేరని, నర్సింహారెడ్డి కుటుంబానికి పార్టీ సహకారం ఎల్లవేళల ఉంటుందన్నారు. నర్సింహారెడ్డి మనోధైర్యాన్ని కోల్పోకుండా పార్టీ కార్యక్రమాల్లో తిరిగి చురుకుగా పాల్గొనాలని ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు. అనంతరం అంతిమ యాత్రలో పాల్గొని పూర్తయ్యే వరకు వెన్నంటి ఉన్నారు. సుధీర్రెడ్డి పార్థివదేహానికి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్, బిఆర్ఎస్ రాష్ట్రనాయకులు బిల్యానాయక్, కిషన్నాయక్, రమేష్నాయక్, టివిఎన్రెడ్డి, ప్రవీణ్రెడ్డితోపాటు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి నేతలు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్రావు, ఆదిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్, సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు రవీంద్రచారి, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు యాదిరెడ్డి, 'ప్రజాపక్షం' యాడ్స్ జనరల్ మేనేజర్ మదన్, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి పల్లా దేవేందర్రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, మైనొద్దీన్, వెంకటరమణ, శైలేష్, అంజచారి, విజేందర్రెడ్డి, వెంకటయ్య, కనకాచారి, సుదర్శన్రెడ్డి, జయరాములు, రామస్వామి, ఆంజనేయులు, నవీన్తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పడమటిపల్లిలో....





ఆసుపత్రిలో....

## ఉనికి కోల్పోతామనే విమర్శలు

ప్రజాపక్షం/రామగిరి : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఏఐటీయుసి, ఆర్ ఎల్ సి సమక్షంలో ఆగస్టు 27న యాజమాన్యంతో చేసుకున్న చారిత్రాత్మక ఒప్పందంపై పలు కార్మిక సంఘాలు కార్మికుల్లో ఉనికి కోల్పోతామనే అక్కసుతో విమర్శలు చేస్తున్నాయని ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్కుమార్ ఆరోపించారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆర్జీ3 ఏరియాలో మంగళవారం నాయకులు గంగాధర్, ఎం.సురేష్ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాజ్కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సారయ్య, వైస్ ప్రెసిడెంట్ బందారి క్రాంతి, బ్రాంచ్ సెక్రటరీ ఎమ్మార్సీ రెడ్డి హాజరై మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యంతో కుదిరిన 23 ఒప్పంధాలను సింగరేణి కార్మికులకు వివరించారు. ఈసందర్భంగా ఏఐటియుసి చేసిన ఒప్పందలకు ఆకర్షితులై దాదాపు 20 మంది కార్మికులు యూనియన్లో చేరారు. వారికి ఏఐటియుసి జెండాలు కప్పి రాజ్కుమార్ ఆహ్వానించారు. కార్యక్రమంలో సిహెచ్పి పిట్ సెక్రటరీ గంధం. శ్రీనివాస్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు,కమిటీ ప్రతినిధులు, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్, సేఫ్టీ వర్క్ కమిటీ మెంబర్స్,క్యాంటీన్ టెంపుల్ కమిటీ మెంబర్స్,కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఘనంగా ముగిసిన ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు

ప్రజాపక్షం/కరీంనగర్ : కరీంనగర్ జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న ఎఐటియుసి 4వ రాష్ట్ర మహాసభలు మంగళవారం ఘనంగా ముగిశాయి. మహాసభలో కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు కలిసి కట్టుగా ఐక్య ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 'ప్రజాపక్షంతో' పలు రంగాలకు నాయకత్వం వహిస్తున్న నేతలు మాట్లాడారు. ఆయా రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు.

### లేబర్ కోడ్లతో సింగరేణి కార్మికులకు తీవ్ర నష్టం

**వాసిరెడ్డి సీతారామయ్య, ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు**



'కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లతో బొగ్గు గని కార్మికులకు వేజ్ బోర్డు అనేది కష్టతరంగా మారనుంది. ఇప్పటివరకు దాదాపు 1973 నుండి కార్మిక వర్గం 11 వేజ్ బోర్డులు తీసుకున్నారు. దీనివలన భారతదేశంలో బొగ్గు గని కార్మికుల వేతనాలు న్యాయ సమ్మతంగా పెరిగాయి. ఈ లేబర్ కోడ్ల ద్వారా వేజ్ బోర్డులు లేకుండా చేయాలని, కార్మిక సంఘాల ఎన్నికలు పెట్టి గుర్తింపు కార్మిక సంఘంతోనే వేజెస్ గురించి మాట్లాడాలని నిర్ణయించడం జరుగుతుంది. గతంలో ఐదు సంఘాలతో మాట్లాడేవాళ్లు కాబట్టి బార్గేనింగ్ కెపాసిటీ ఉండేది. ఇప్పుడు ఎన్నికలు పెట్టి ఏ సంఘానికి 51 శాతం వస్తదో ఆ సంఘంతోటే మాట్లాడతాం అంటున్నారు. 51శాతం అనేది ఏ సంఘానికి రాదు. కాబట్టి కార్మిక సంఘాలు లేకుండా ప్రభుత్వమే ఏదో కమిటీ ఏర్పాటు చేసి, ఆ కమిటీ ద్వారా జీతాలు పెంచినట్టు చూపించాలనేది ప్రయత్నం చేస్తున్నారు. దీని వలన కార్మికులకి తీరని నష్టం జరుగుతుందన్నారు.

### స్కీం వర్కర్లకు కనీస వేతనం, సామాజిక భద్రత కల్పించాలి

**పి.ప్రేంపావని, శ్రామిక మహిళా ఫోరం అధ్యక్షురాలు**



'స్కీమ్ వర్కర్లను వర్కర్లుగా గుర్తిస్తూ, వర్కర్ హోదా కల్పించాలని ప్రధానమైన డిమాండ్. వర్కర్గా గుర్తించినప్పుడు వారికి కనీస వేతనాలు, కనీస సామాజిక భద్రతా చర్యలు ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ సౌకర్యాలు కల్పించాలి. స్కీమ్లో పనిచేసేటి వాళ్ళచేత వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారే తప్ప వాళ్ళకి వర్కర్స్ హోదా కల్పించడం లేదు. స్కీమ్ వర్కర్లను వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు, ఇవ్వాలి. 60 ఏళ్ళకు రిటైర్మెంట్ చేసిన తర్వాత వాళ్ళకి ఒక రూ.10 లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్ తో పాటు రూ.5 వేల పెన్షన్,జీవిత భీమా ఇవ్వాలి. మధ్యాహ్న భోజన కార్మికులకు కోడిగుడ్లు, నిత్యవసర వస్తువులు, గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలి. ప్రతి విద్యార్థికి రూ .25 మెస్ బిల్లు చెల్లించాలి. వంట కార్మికులకు ప్రమాద భీమా, ఉచిత వైద్య సేవలు అందించాలి.'

### కాంట్రాక్టు కార్మికులకు రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ వేతనమివ్వాలి

**ఎం.నర్సింహా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్**



కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు కనీస వేత నం రూ.26 వేలు చెల్లించాలి. 4 పండగ సెలవులు, 4 జాతీయ సెలవులు, 15వరకు వచ్చే ఆర్జిత సెలవులు మొత్తం కాంట్రాక్ట్ లేబర్ చట్టం ప్రకారం 23 సెలవులను అమలు చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, టెక్నికల్ సిబ్బంది, ఫోర్త్ క్లాస్ సిబ్బందికి కూడా రెగ్యులర్ ఉద్యోగి యొక్క బేసిక్ వేతనం ఇవ్వాలని అవుట్సోర్సింగ్ మార్గదర్శకాలలో ఉంది. అవుట్సోర్సింగ్ గైడ్లైన్స్ ప్రకారం రెగ్యులర్ ఉద్యోగి యొక్క బేసిక్ వేతనం దానికి సమానమైన పోస్టుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వాలి. సుప్రీంకోర్టు తీర్పు కూడా దానికి అనుగుణంగా ఉంది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే నిబంధన ఉంది. భవిష్యత్తులో సమానపనికి సమాన వేతనం అందించాలని పెద్దఎత్తున పోరాటం చేయబోతున్నాం.

### సంక్షేమ బోర్డు ద్వారానే క్లెయిమ్లు చెల్లించాలి

**పల్లా దేవేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భవన నిర్మాణ కార్మిక సంఘం**



భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చట్టాన్ని అమలు చేయడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమయింది. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఈ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును ఇప్పుడు నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డును నాచురల్ డెత్, యాక్సిడెంట్ డెత్, టెంపరరీ డిజబిలిటీకి సంబంధించి ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీకి అప్పజెప్పింది. మేము దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. అసలు సంక్షేమ బోర్డు ఏర్పడ్డదే ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం. దీంట్లో వేల కోట్ల రూపాయలు సెస్ ద్వారా వసూలైన డబ్బులు గాని, భవన నిర్మాణ కార్మికులు అందులో పేరు నమోదు చేసుకునే సందర్భంలో కట్టే డబ్బుల ద్వారా వేల కోట్ల రూపాయలు సంక్షేమ బోర్డులో జమ అయి ఉన్నాయి. ఆ డబ్బులు కార్మికుల సంక్షేమం కోసం నేరుగా సంక్షేమ బోర్డు నుంచే వాడాలి. దాదాపు 400 కోట్ల రూపాయలు ఒక ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఈ రాష్ట్ర ప్రభుత్వం డిపాజిట్ చేసింది. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీని రద్దు చేసి సంక్షేమ బోర్డు ద్వారానే కార్మికులకు లబ్ధి చేకూర్చాలని కోరుతున్నాం.

### మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేమాలి

**వనంపల్లి జైపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ వర్కర్స్యూనియన్**



రాష్ట్రంలో మునిసిపల్లో కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులు సుమారు 60 నుండి 65 వేల మంది విధులు నిర్వహిస్తున్నారు. మునిసిపల్ కార్మికులందరినీ పర్మనెంట్ చేయాలని ప్రధాన డిమాండ్, పర్మనెంట్ చేసేంతవరకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని కోరుతున్నాం. తగ్గించిన వేతనాలన్నిటినీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెంచి ఇవ్వాలని, యథావిధిగా పాత పద్ధతిలో జీతాలు ఇవ్వాలని కోరుతున్నాం. జీతాలు తగ్గడంతో సుమారు 60వేల మంది కార్మికులంతా భయాందోళనలో గురవుతాఉన్నారు. తగ్గించిన వేతనాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తా ఉన్నాం.'

## అసెంబ్లీ మీడియా పాయింట్

# తాతా మధు అరెస్టును ఖండిస్తున్నాం

### ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎమ్మెల్సీ తాతా మధు అరెస్టును ఖండిస్తున్నామని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ నడువొద్దని ప్రభుత్వం డ్రామాలు చేస్తున్నదని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా సిఎం మాట్లాడిన మాటలు అభ్యంతరకరమన్నారు. ''బద్వే అని సంబోధించారు. అది దేని కోసం వాడతారో తెలుసా?'' అని ఆయన ప్రశ్నించారు. ఎథిక్స్ కమిటీని ఎథిక్స్ లేని, పార్టీ మారిన కడియం శ్రీహరి నేతృత్వంలో వేశారని యన ఆరోపించారు. ఎంఎల్ఎ మందుల సామేల్ కత్తులతో కోలాటం ఆడుతామని మాట్లాడుతున్నారని, దానం నాగేందర్ మాట్లాడిన భాష ఏంటి? అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిపై ఆంక్షలు ఉండవా? అని ప్రశించారు. అసెంబ్లీ గేట్ వద్ద సబితా ఇంద్రారెడ్డి జుట్టు పట్టి లాగారని, సునీతా లక్ష్మారెడ్డి చీర లాగారని, అలా చేసిన వారిపై చర్యలుండవా? అని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ మహిళా ఎంఎల్ఎలకు ప్రభుత్వం క్షమాపణ చెప్పేవరకు వదిలిపెట్టబోమని కౌశిక్ రెడ్డి అన్నారు. తాతా మధు స్పీకర్‌ను అనలేదని, ఆయన మాటలను వక్రీకరిస్తున్నారన్నారు. హుజురాబాద్‌లో రెండోవిడత దళితబంధు నిధులు వాపస్ తీసుకొంటున్నారన్నారు. 'నేను ఎంఎల్ఎ పదవికి రాజీనామా చేస్తా. హుజురాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ వస్తే ముక్కు నేలకు రాస్తా' అని పాడి కౌశిక్ రెడ్డి సవాల్ చేశారు.

అధికార మదంతో విర్రవీగొద్దు : బిఆర్ఎస్ ఎంఎల్ఎ కల్వకుంట్ల సంజయ్

అధికార మదంతో విర్రవీగొద్దని, సిఎం రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోవాలని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కల్వకుంట్ల సంజయ్ కోరారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి మాటలు విని మీడియా వారు, కాంగ్రెస్ వారు నవ్వుకొంటున్నారన్నారు. 'ఇది సర్కార్ కాదు.. సర్కస్ అని ప్రజలు అనుకొంటున్నారన్నారు. అసెంబ్లీ గేట్ వద్ద మహిళా ఎంఎల్ఎలను మగ పోలీసులు అడ్డుకోవడమేమిటని ఆయన ప్రశ్నించారు. సంస్కారహీనమైన పనులు చేసిన పోలీసుల ఫోటోలు తమ దగ్గర పెట్టుకున్నామని, ఇక్కడితో అయిపోలేదన్నారు. 22ఎ నిషేధిత జాబితా, మహిళలపై క్రైమ్ రేటు, జిఒ 9, యూరియా కొరత, తొమ్మిది గంటల కరెంట్, ఫీజురీయింబర్స్‌మెంట్, రైతు భరోసా, దళితబంధుపై అసెంబ్లీలో ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. అసెంబ్లీని కనీసం నెల రోజుల పాటు నడపాలని ఆయన కోరారు.

**బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తప్పును కప్పిపుచ్చుకొంటున్నారు : ఎమ్మెల్యే సి.హెచ్.విజయరమణరావు**

బిఆర్ఎస్ ఎంఎల్ఎలు, నేతలు తప్పును కప్పిపుచ్చుకొనే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ ఎంఎల్ఎ సి.హెచ్.విజయ రమణరావు పేర్కొన్నారు. సిఎంపై గౌరవం లేకుండా బిఆర్ఎస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, పోలీసు అధికారి తల్లిని అవమానించేలా వ్యాఖ్యానించారన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ కెసిఆర్ అసెంబ్లీకి వచ్చి జరిగిన ఘటనపై బిఆర్ఎస్ ఎంఎల్ఎల తరఫున క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ నేతల మాటలకు స్పీకర్ కన్నీ రు పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈటల రాజేందర్‌ను బర్తరఫ్ చేసి, దళితుల ఓట్ల కోసం దళితబంధు పెట్టారే తప్ప, కెసిఆర్‌కు దళితులపై ఎలాంటి మమకారం లేదని ఆరోపించారు. రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కెసిఆర్ క్యాబినెట్‌లో మహిళలకు సముచిత ఇవ్వలేదని మండిపడ్డారు.

# భావప్రకటన స్వేచ్ఛను హరిస్తే ఊరుకోం

**టియుడబ్ల్యూజె ప్రదర్శనలో ముక్తకంఠంతో హెచ్చరించిన జర్నలిస్టులు**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో భావాప్రకటన స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని, మీడియా స్వేచ్ఛను హరించేందుకు పాలకులు ప్రయత్నిస్తే ప్రజాస్వామికావాదుల నుండి ప్రతిఘటన తప్పదని జర్నలిస్టులు హెచ్చరించారు. ఢిల్లీలో విధినిర్వహణలో ఉన్న మహిళా జర్నలిస్టులపై పోలీసుల దాడి, అక్రమ కేసు, అరెస్టును నిరసిస్తూ మంగళవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం(టీయుడబ్ల్యూజె) ఆధ్వర్యంలో జర్నలిస్టులు, ప్రజాస్వామికావాదులు కొవ్వొత్తులతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బషీర్ బాగ్ లోని టీయుడబ్ల్యూజే కార్యాలయం నుండి ప్రాంభమైన ఈ నిరసన ప్రదర్శన, నిజాం కాలేజీ మీదుగా జగజీవన్ రాం విగ్రహం వరకు కొనసాగింది. అనంతరం టీయుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు సీనియర్ పాత్రికేయులు, ప్రజాస్వామికవాదులు ప్రసంగించారు. ప్రజాస్వామిక ఈ దేశంలో పౌరులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను, స్వేచ్ఛను ఖునీ చేస్తూ, తమకు అనుకూలమైన విధానాలను ఎన్డియే ప్రభుత్వం అవలంబించడం అప్రజాస్వామికమని సీనియర్ పాత్రికేయులు, ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు దేవులపల్లి అమర్ ఆందోళన వ్యక్తం చేసారు. ఐదు రోజుల క్రితం ఢిల్లీలో విధినిర్వహణ లో ఉన్న మైనారిటీ సామాజిక వర్గానికి చెందిన మహిళా జర్నలిస్టులు షాహిన్ ఖాన్, నఫీజా ఖాన్ లపై పోలీసులు దాడి చేయడం, వారిని అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను, జర్నలిస్టుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఈ సభలో పాల్గొన్న పలువురు సూచించారు. జర్నలిస్టులపై దాడులు, బెదిరింపులు, అక్రమ అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని వారు అన్నారు. మహిళా జర్నలిస్టులకు న్యాయం చేయడంతో పాటు, ఘటనకు బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరి సత్యనారాయణ, కె. అజిత, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షురాలు అత్తలూరి అరుణ, టీయుడబ్ల్యూజే మహిళా జర్నలిస్ట్స్ విభాగం కన్వీనర్ రాజేశ్వరీ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు సంధ్య, సీనియర్ పాత్రికేయులు వనజ, స్వప్న, విమల, టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, బి. కిరణ్ కుమార్, హెచ్.యు.జే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, తెలంగాణ చిన్న, మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్, ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, తెలంగాణ ఉర్దూ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మోహియొద్దీన్ లతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పెసరను మద్దతు ధరకు

# మార్క్‌ఫెడ్ కొనుగోలు చేయాలి

### రైతులకు ఎకరాకు రూ.8 వేల ఆర్థిక సాయం అందించాలి : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల్లో పెసర సాగు చేసిన రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ద్వారా పెసరను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్ చేశారు. క్వింటాకు రూ.8,780 మద్దతు ధర ఉండగా, మార్కెట్లో కేవలం రూ.5 వేలకే విక్రయించాల్సి వస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో పంట చేతికొస్తుందో లేదో అన్న భయంతో రైతులు కొద్దిమేర పెసర, ఇతర మెట్ట పంటలు సాగు చేశారని పేర్కొన్నారు. పెసరతోపాటు మెట్ట పంటలు సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.8 వేల ఆర్థిక సాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.



## యువత సృజనాత్మకతకు

# 'యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్–2026'

### సద్వినియోగం చేసుకోండి : మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మను ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లేందుకు యువత తమ సృజనాత్మకతను వినియోగించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. బతుకమ్మ విశిష్టతను చాటిచెప్పడంతోపాటు యువ ఫిలిం మేకర్ల ప్రతిభకు వేదిక కల్పించేందుకు 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ ఛాలెంజ్–2026' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎఫ్‌డిసిఎండి జి.ముకుందరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్ డైరెక్టర్ రాజ్‌కొండ, సెట్విన్ మాజీ చైర్మన్ గిరిధర్‌రెడ్డిలతో కలిసి మంత్రి ఛాలెంజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. షార్ట్‌ఫిలింలు, పాటలు, వీడియోల ద్వారా బతుకమ్మ సంస్కృతి, జానపద కళలు, సంప్రదాయాలను సృజనాత్మకంగా ప్రపంచానికి పరిచయం చేయడంతోపాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ ఛాలెంజ్ దోహదపడుతుందని మంత్రి పేర్కొన్నారు.యువ ఫిలిం మేకర్స్, విద్యార్థులు, ఔత్సాహిక కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఛాలెంజ్‌ను విజయవంతం చేయాలని మంత్రి కోరారు.

# పోలీసులపై చర్యల ఉత్తర్వులను రద్దు చేయండి

### ప్రభుత్వం లంచ్‌మోషన్ పిటిషన్ తీర్పును రిజర్వు చేసిన హైకోర్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులపై చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలంటూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అత్యవసర లంచ్‌మోషఒR పిటిషఒR పై మంగళవారం వాదనలు ముగిశాయి. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా హైకోర్టు ప్రభుత్వాన్ని కీలక ప్రశ్నలు వేసింది. మహిళా ఎమ్మెల్యేలపై ఇదేనా గౌరవం.. అని ప్రశ్నించింది. మహిళా ఎమ్మెల్యేలను గెంటివేస్తున్న ఫొటోలు కూడా ఉన్నాయని గుర్తు చేసింది. మరో ఎమ్మెల్యే కంటతడి పెట్టినట్లుగా ఉన్నాయంది. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు ఉన్న నల్ల టీషర్ట్ ధరించారని అడ్డుకున్నామని చెబుతున్న పోలీసులు, స్లోగన్స్ లేని తెల్ల చొక్కా వేసుకున్న ఎమ్మెల్సీ మధుసూధనాచారి, చీరలు ధరించిన ఎమ్మెల్యేలు సబిత, సునీతలను ఎందుకు అడ్డుకున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్ రెడ్డి వాదిస్తూ.. రాజకీయ కారణాలతో ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోలేదని, నల్ల టీషర్టులు ధరించారనే కారణంతో మాత్రమే చర్యలు తీసుకోలేదని తెలిపారు. అసెంబ్లీ చుట్టూ నాలుగు కిలోమీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నాయని, ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో టీషర్టులు ధరించి సమూహంగా రావడం అసెంబ్లీ బులెటిన్ –34, రూల్ 316కు విరుద్ధమని పేర్కొన్నారు. చీఫ్ మార్షల్ కోరడంతో, స్పీకర్ ఆదేశాల మేరకే పోలీసులు సాయం అందించారని, భద్రతా వలయాన్ని ఎమ్మెల్యేలు ఛేదించే ప్రయత్నంలో తోపులాట జరిగిందని, పోలీసులకు కూడా గాయాలయ్యాయని చెప్పారు. ఘటనకు సంబంధించిన పూర్తి, ఎడిట్ చేయని వీడియోను పరిశీలించాలని కోరుతూ, పోలీసులపై చర్యలు తీసుకోవాలన్న మధ్యంతర ఉత్తర్వుల్లోని చివరి రెండు పేరాలను తొలగించాలని అభ్యర్థించారు.

బీఆర్ఎస్ తరఫున సీనియర్ అడ్వకేట్ గండ్ర మోహన్ రావు వాదిస్తూ.. సభా నిబంధనల ఉల్లంఘనపై నిర్ణయం తీసుకునే అధికారం స్పీకర్‌కే ఉందని, ఆ అధికారాన్ని పోలీసులు చేపడితే పోలీసు రాజ్యానికి దారితీస్తుందని ఆందోళనను వ్యక్తం చేశారు. బులెటిన్ –34లో నల్ల టీషర్టులు ధరించరాదని ఎక్కడా లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగిందో లేదో స్పీకరే నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపారు. మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాల్సిన అవసరం లేదన్నారు.

విచారణ సందర్భంగా హైకోర్టు.. నల్ల టీషర్టులు ధరించని మహిళా ఎమ్మెల్యేలను, నినాదాలు లేని తెల్లచొక్కా ధరించిన ఎమ్మెల్సీని ఎందుకు అడ్డుకున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మహిళా ఎమ్మెల్యేను మెడ పట్టుకుని నెట్టినట్లు, మరో మహిళా ఎమ్మెల్యే చీర పట్టుకుని లాగినట్లు కనిపిస్తున్న ఫొటోలపై ఆరా తీస్తూ, మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించింది. సభ్యుల ప్రవేశానికి సంబంధించి కొత్త నిబంధనలు విధించారా, వాటిని ముందుగానే తెలియజేశారా, సభా నిబంధనలను అమలు చేసే అధికారం స్పీకర్‌కు ఉన్నప్పుడు పోలీసులు ఎమ్మెల్యేలను అడ్డుకునే అధికారం ఎలా వస్తుందని ప్రశ్నించింది. ఇరుపక్షాల వాదనలు పూర్తికావడంతో హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. ఇప్పటికే ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరైనందున తక్షణ ఉత్తర్వులు అవసరం లేదని, అఫిడవిట్లు, ఫొటోలు, వీడియోలు, ఎఫ్ఐఆర్, స్పీకర్ ఆదేశాలు, చీఫ్ మార్షల్ పాత్ర, నిషేధాజ్ఞలు, అసెంబ్లీ నిబంధనలు తదితర రికార్డులను పరిశీలించిన అనంతరం తీర్పు వెలువరిస్తామని తెలిపింది.

# 17 మంది డిఎస్‌పిలకు కొత్త పోస్టింగ్‌లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పోలీస్ శాఖలో డిఎస్‌పి స్థాయి అధికారులకు భారీగా స్థానచలనం కలిగింది. 17 మంది డిఎస్‌పిలకు బదిలీలు, కొత్త పోస్టింగ్‌లు కల్పిస్తూ డిజిపి సి.వి.ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సిఫారసుల మేరకు ఈ బదిలీల ప్రక్రియ చేపట్టారు. వెయిటింగ్‌లో ఉన్న పలువురు అధికారులకు కీలక పోస్టింగ్‌లు దక్కగా, వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న మరికొందరిని ఇతర విభాగాలకు బదిలీ చేశారు. కె. బాలకృష్ణారెడ్డిని మల్కాజిగిరి సైబర్ క్రైమ్స్ ఎసిపిగా నియమించారు. ఇప్పటివరకు అక్కడ ఎసిపిగా పనిచేస్తున్న ఎస్.జి. శివశంకర్‌ను బదిలీ చేసి డిజిపి కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఎస్‌కె అబ్దుల్ రహ్మాన్‌కు జయశంకర్ భూపాలపల్లి డిసిఆర్‌బీ డిఎస్‌పిగా, ఎ. రవి కుమార్‌కు జగిత్యాల డిసిఆర్‌బి డిఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. బి. నందిరామ్ నాయక్‌ను డిజి కంట్రోల్ రూమ్ డిఎస్‌పిగా, బి. సోమ్నారాయణ్ సింగ్‌ను తెలంగాణ పోలీస్ అకాడమీ డిఎస్‌పిగా నియమించారు. జె. వెంకటేశ్వర్‌రావుకు మెదక్ డిసిఆర్‌బి డిఎస్‌పిగా, బి. కిషన్‌కుమార్‌కు హైదరాబాద్ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఎసిపిగా, ఎల్. రమేష్‌కుమార్‌కు హైదరాబాద్ సిటీ సిటిసి ఎసిపిగా పోస్టింగ్ కల్పించారు. ఎన్. శ్రీనివాస్‌రెడ్డిని సంగారెడ్డి డిసిఆర్‌బి డిఎస్‌పిగా, కాదేరు వెంకట్‌రెడ్డిని తెలంగాణ పోలీస్ అకాడమీ డిఎస్‌పిగా నియమించారు. కొమల్ల సుబ్బరామిరెడ్డి, ఎస్. సుదర్శన్‌లకు హైదరాబాద్ సిటీ సిసిఎస్ అండ్ డిడి ఎసిపిలుగా పోస్టింగ్‌లు ఇచ్చారు. ఎన్. శంకర్‌ను హైదరాబాద్ సెక్రటేరియట్ సెక్యూరిటీ ఎసిపిగా, పి. విజయ్‌కుమార్‌ను వెస్ట్‌జోన్ రోడ్ సేఫ్టీ డిఎస్‌పిగా నియమించారు. రాజన్న సిరిసిల్ల డీసీఆర్‌బీ డిఎస్‌పిగా పనిచేస్తున్న కె. భాస్కర్‌ను తెలంగాణ పోలీస్ అకాడమీకి బదిలీ చేశారు. ఆదిలాబాద్ డిసిఆర్‌బి డిఎస్‌పిగా ఉన్న ఎం. వెంకటనర్సయ్యను సిఐడి డిఎస్‌పిగా బదిలీ చేశారు. బదిలీ అయిన అధికారులను వెంటనే రిలీవ్ చేసి, వారికి కేటాయించిన కొత్త స్థానాల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని డీజీపీ సి.వి. ఆనంద్ సంబంధిత యూనిట్ అధికారులను ఆదేశించారు.

# స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

### బిజెపి ఎమ్మెల్సీ మల్క కొమిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని బిజెపి ఎమ్మెల్సీ మల్క కొమిరెడ్డి డిమాండ్ చేశారు. గత నెల రోజులుగా బిజెపి ఈ సమస్యపై నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థులతో పాటు ప్రైవేట్ ఇంజనీరింగ్, డిగ్రీ, ప్రొఫెషనల్ కాలేజీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. మంగళవారం తెలంగాణ శాసనమండలి మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన కొమిరెడ్డి.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఇంజనీరింగ్, హయ్యర్ ఎడ్యుకేషన్, ప్రొఫెషనల్ కాలేజీల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఐఐటీలు, ఐఐఎంలు, ఎన్ఐటిలు వంటి కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలు నాణ్యమైన విద్యకు మంచి ఉదాహరణలని, అదే స్థాయిలో రాష్ట్రంలోని విద్యాసంస్థలను కూడా అభివృద్ధి చేయాలని సూచించారు.

# 'అర్ధ రాత్రి' బస్సులకు భారీ స్పందన

### మరిన్ని రూట్లకు రాత్రి సర్వీసుల విస్తరణ : మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్‌లో టిజిఎస్ ఆర్‌టిసి ప్రవేశపెట్టిన రాత్రిపూట 'థర్డ్ షిఫ్ట్' బస్సులకు ప్రయాణికుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. సెప్టెంబర్ 1 నుంచి ఆరు ప్రధాన మార్గాల్లో ప్రారంభించిన ఈ సర్వీసుల్లో కేవలం ఏడు రోజుల్లోనే 9,286 మంది ప్రయాణికులు ప్రయాణించినట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఉద్యోగులు, విద్యార్థులు, రాత్రి వేళల్లో ప్రయాణించే ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక సర్వీసులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అర్ధరాత్రి వేళల్లోనూ సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రజా రవాణా అందుబాటులోకి రావడంపై ప్రయాణికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

**ఆరు ప్రధాన రూట్లలో సర్వీసులు :** ప్రస్తుతం 222ఎ కోఠి పటాన్‌చెరు, 218 అఫ్జల్‌గంజ్ పటాన్‌చెరు, 219 సికింద్రాబాద్ పటాన్‌చెరు, 290యు హయత్‌నగర్ సికింద్రాబాద్, 195డబ్ల్యు బాచుపల్లి వేవ్‌రాక్, 10హెచ్ కొండాపూర్ సికింద్రాబాద్ మార్గాల్లో రాత్రి పూట బస్సులు నడుస్తున్నాయి. ప్రయాణికుల నుంచి కొత్త రూట్లలోనూ థర్డ్ షిఫ్ట్ సర్వీసులు ప్రారంభించాలంటూ విజ్ఞప్తులు వస్తున్నాయని మంత్రి తెలిపారు. ప్రయాణికుల డిమాండ్, రద్దీ, రూట్ల అవసరాలను పరిశీలించి మరిన్ని ప్రధాన మార్గాల్లో రాత్రి సర్వీసులను విస్తరిస్తామని వెల్లడించారు. హైదరాబాద్‌లో ప్రజా రవాణాను మరింత బలోపేతం చేసి, దశలవారీగా 24 గంటలూ అందుబాటులో ఉండే రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# అసెంబ్లీ ఆవరణలో విషాదం..

### -కుప్పకూలిన ఐఎఎస్ అధికారి నవీన్‌మిట్టల్ వ్యక్తిగత కార్యదర్శి రాజు

### - మంత్రి వాకిటి శ్రీహరి సిపిఆర్.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూత






**ప్రజాపక్షం/హైదరాబాద్:** విధులు నిర్వహించేందుకు అసెంబ్లీకి వచ్చిన సీనియర్ ఐఎఎస్ అధికారి నవీన్‌మిట్టల్ వ్యక్తిగత కార్యదర్శి రాజు ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందారు. అసెంబ్లీ ఆవరణలో మంగళవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. నవీన్ మిట్టల్ వ్యక్తిగత కార్యదర్శి రాజు అకస్మాత్తుగా కుప్పకూలారు. ఈ విషయాన్ని గమనించిన మంత్రి వాకిటి శ్రీహరి వెంటనే ఆయన వద్దకు చేరుకున్నారు. పరిస్థితిని అంచనా వేసి సిపిఆర్ చేస్తూ ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వైద్య సిబ్బందిని పిలిపించి అత్యవసర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. అంబులెన్సును రప్పించి రాజును హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో రాజు మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. అసెంబ్లీ ఆవరణలో అస్వస్థతకు గురైన రాజు ఆసుపత్రిలో కన్నుమూయడంతో అధికారులు, ఉద్యోగులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. రాజు మృతికి గల కారణాలపై వైద్యులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. విధుల్లో ఉండగానే అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందడం అసెంబ్లీ వర్గాల్లో విషాదాన్ని నింపింది. గుండెపోటుతోనే మృతి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల టవర్స్

# ధరావతు వాపస్

### దరఖాస్తుదారులకు హౌసింగ్ బోర్డు కీలక వివరాలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ కోర్ పరిధిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకానికి దరఖాస్తు చేసి, లాటరీలో ఎంపిక కాని ప్రజలకు ధరావతు (ఇఎండి) సొమ్మును తిరిగి చెల్లించే ప్రక్రియను తెలంగాణ హౌసింగ్ బోర్డు ప్రారంభించింది. డిమాండ్ సర్వే సమయంలో మీసేవా కేంద్రాల ద్వారా స్వీకరించిన రూ.10,000 ఇఎండి మొత్తాన్ని పూర్తి ఆన్‌లైన్ విధానంలోనే తిరిగి జమ చేస్తున్నామని హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి.గౌతం తెలిపారు. ఏ ఖాతా నుంచి దరఖాస్తు సొమ్ము చెల్లించారో, ఆ సొమ్ము నేరుగా అదే బ్యాంక్ అకౌంట్‌కే జమ అవుతుందని గౌతం వెల్లడించారు. దీనికోసం లబ్ధిదారులు ప్రత్యేకంగా ఎలాంటి దరఖాస్తులు చేయనవసరం లేదని, వారం రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. మీసేవా కేంద్రాల్లో నగదు రూపంలోకానీ లేదా ఇతరుల ఖాతాల ద్వారాగానీ డబ్బులు చెల్లించిన వారు, ఆ మొత్తం తమ సొంత ఖాతాలోనే పడేలా మార్చుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. అలాంటి దరఖాస్తుదారులు హౌసింగ్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ (tghb.telangana.gov.in) ద్వారా ఈనెల 10వ తేదీలోగా తమ బ్యాంక్ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువు దాటితే పాత పద్ధతిలోనే ఏ అకౌంట్ నుంచి డబ్బులు వచ్చాయో దానికే రీఫండ్ జమ అవుతుందన్నారు. మరోవైపు లాటరీలో ఎంపికైన దరఖాస్తుదారుల వివరాల క్షేత్రస్థాయి పరిశీలన వేగంగా జరుగుతోందని, ఈ ప్రక్రియ ముగిసిన అనంతరం అర్హులకు కేటాయింపు పత్రాలు (అలాట్‌మెంట్ లెటర్స్) అందజేస్తామని చెప్పారు. ప్రతిపాదించిన 7,340 ఇండ్లకుగాను వెయిటింగ్ లిస్ట్‌లో కలిపి సుమారు 10 వేల మందిని ఎంపిక చేశామని, పూర్తి సమాచారాన్ని వాట్సాప్, ఎస్ఎంఎస్ ద్వారా పంపుతున్నందున ఆఫీసుల చుట్టూ తిరగొద్దని విజ్ఞప్తి చేశారు. సందేహాలుంటే కాల్ సెంటర్ 040 24603572 నెంబరులో సంప్రదించవచ్చన్నారు. కాగా చాంద్రాయణ గుట్ట, ఎల్.బి.నగర్, ముషీరాబాద్, గోషామహల్ నియోజకవర్గాల్లో ఇండ్ల దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 10వ తేదీ ఆఖరు కాగా, స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.




# ఎస్ఐ, కానిస్టేబుల్ వయో పరిమితి పెంచండి

### తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎస్ఐ ఉద్యోగానికి 38, కానిస్టేబుల్ ఉద్యోగాలకు 36 ఏళ్ల వయో పరిమితిని, తద్వారా మరో 2 నుంచి 3 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందని తెలంగాణ రక్షణ సేన (టిఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. హైదరాబాద్‌లోని టిఆర్ఎస్ కార్యాలయంలో కవితతో కానిస్టేబుల్ అభ్యర్థులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సుమారు 20 వేల కానిస్టేబుల్ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ జారీ చేశారని, హోంశాఖ ఒకటి చెబితే, ప్రభుత్వం మరోటి చెబుతుందని, ఈ రెండింటి మధ్య సమన్వయం లేదని ఆరోపించారు. కానిస్టేబుల్ అభ్యర్థుల పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణమే నిరుద్యోగులని, ప్రస్తుతం ఆ నిరుద్యోగులను విస్మరిస్తున్నారని మండిపడ్డారు.మూడేళ్లు అవుతున్నప్పటికీ ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని ఆరోపించారు.

### 2050 నాటికి వృద్ధుల జనాభా రెట్టింపు నేపథ్యంలో..

# ఒక సమగ్ర పర్యావరణ వ్యవస్థ ఏర్పాటు

### కేంద్రం వెల్లడి

**న్యూఢిల్లీ :** శరవేగంగా పెరుగుతోన్న వృద్ధుల జనాభా భారతదేశానికి ఒక సవాల్‌గా, ఆర్థిక అవకాశంగా పరిణమిస్తోంది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం వృద్ధుల కోసం ఆరోగ్య సంరక్షణ, గృహవసతి, సంరక్షణ, ఇతర సహాయక సేవలతో కూడిన ఒక సమగ్ర పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి కృషి చేస్తోంది. 'నేడు మన దేశ జనాభాలో వృద్ధులు చాలా పెద్ద భాగంగా ఉన్నారు. వారి సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. ప్రస్తుతం వారి అంచనా జనాభా దాదాపు 16 నుంచి 17 కోట్లుగా ఉంది. రాబోయే 20నుంచి 22ఏళ్ల కాలంలో ఇది రెట్టింపు అయ్యే అవకాశం ఉంది' అని సామాజిక న్యాయం, సాధికారికత మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుధాంశు పంత్ చెప్పారు. సుధాంశు పంత్ మాట్లాడుతూ వైద్య సౌకర్యాలు, జీవన ప్రమాణాలలో మెరుగుదల కారణంగా ఆయుర్దాయం గణనీయంగా పెరిగిందని, ప్రతీ సంవత్సరం పెరుగుతూనే ఉందని, అందువల్ల పెరుగుతున్న వృద్ధ జనాభా విభిన్న అవసరాలను తీర్చడం ఆవశ్యకమైందని అన్నారు. 'మంచి ఆరోగ్య సంరక్షణ అందుబాటును నిర్ధారించడానికి, ఆయుష్మాన్ భారత్ పిఎం–జెఏవై పథకం కింద 7 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయసున్న సీనియర్ సిటీజన్లు అందరికీ సంవత్సరానికి రూ.5లక్షల కవరేజీతో ఉచిత చికిత్స అందించబడింది' అని పంత్ చెప్పారు. సామాజిక న్యాయం, సాధికారికత మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగావృద్ధు ల కోసం సుమారు 800 సంరక్షణ గృహాలను నిర్వహిస్తోందని, అటువంటి సౌకర్యాలను నడపడానికి రాష్ట్ర ప్రభుత్వాలకు సహాయం అందిస్తున్నదని ఆయన చెప్పారు. 'పాలసీలో డే కేర్ హోమ్ నిర్వహణకు సంబంధించిన నిబంధనలను చేర్చే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉంది' అని సుధాంశు పంత్ అన్నారు. కేంద్ర, రాష్ట్రాల వివిధ శాఖల ద్వారా వయోవృద్ధుల కోసం పలు సౌకర్యాలు, పథకాలు అమలు చేయబడుతున్నాయని , అటువంటి సౌకర్యాలను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడానికి మంత్రిత్వ శాఖ 'జీవన్' యాప్‌ను ప్రారంభించిందని ఆయన తెలిపారు. 'నేడు 60ఏళ్లు పైబడిన భారతీయులు 166మిలియన్లకు పైగా ఉండగా 2050 నాటికి ఈ సంఖ్య దాదాపు 232 మిలియన్లకు పైగా (రెట్టింపు) అవుతారని అంచనా వేస్తున్నారు. అందువల్ల మనం ఇప్పుడే వృద్ధాప్యానికి అవసరమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించుకోవాలి' అని అసోసియేషన్ ఆఫ్ సీనియర్ లివింగ్ ఇండియా (ఏఎస్ఎల్ఐ) చైర్మన్ జి.రాజగోపాల్ చెప్పారు. భారతదేశంలోని సీనియర్ లివింగ్ రంగం ఒక కీలక దశలో ఉందని, నేడు 166.9మిలియన్లుగా ఉన్న సీనియర్ల సంఖ్య 2050 నాటికి 346 మిలియన్లకు పెరుగుతుందని జెఎల్ఎల్ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ సింగ్ సోఢి తెలిపారు.

'ప్రజాపక్షం' ఈనెల 8వ తేదీ మంగళవారం నాటి సంచికలోని 10వ పేజీలో 'సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి కె.విజయ్ రాములు సతీమణి మృతి ' అనే వార్త ప్రచురితమైనది. అయితే సిపిఐ(ఎం)కు బదులుగా సిపిఐగా చదవగోరుతున్నాము. ఈ పొరపాటుకు చింతిస్తున్నాము.

# తెలంగాణ వెలుగులకు సింగరేణి భరోసా

● స్వరాష్ట్ర విద్యుత్ అవసరాలకే 90 శాతం సరఫరా ● దేశం నలుమూలల నుంచి సింగరేణి బొగ్గు కోసం వినతులు



ప్రజాపక్షం/హైదరాబాద్: దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతూ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు అవసరాలు అధికమవుతున్న నేపథ్యంలో సింగరేణి సంస్థ స్వరాష్ట్రమైన తెలంగాణకు అండగా నిలుస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో దేశంలోని పలు విద్యుత్ సంస్థలు సింగరేణి వైపు చూస్తూ 'మాకూ బొగ్గు సరఫరా చేయండి' అని కోరుతున్నాయి. సింగరేణి బొగ్గుకు ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ సంస్థ మాత్రం తెలంగాణ విద్యుత్ అవసరాలకే తొలి ప్రాధాన్యం ఇస్తోంది. రాష్ట్రంలో నిరంతరాయ విద్యుత్ సరఫరాకు భరోసా కల్పించాలనే ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణలోని విద్యుత్ కేంద్రాలకు సింగరేణి నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేస్తోంది. కీలక సమయాల్లో విద్యుత్ రంగానికి అండగా నిలుస్తూ రాష్ట్ర పారిశ్రామిక, ఆర్థిక ప్రగతికి చోదకశక్తిగా మారుతోంది. ఇతర రాష్ట్రాలకు బొగ్గు విక్రయం ద్వారా వాణిజ్య అవకాశాలు ఉన్నప్పటికీ 'సంస్థ వాణిజ్య ప్రయోజనాల కంటే స్వరాష్ట్ర ప్రయోజనాలే ప్రాధాన్యం' అనే విధానంతో ఉత్పత్తి చేసిన బొగ్గులో తెలంగాణ అవసరాలకే సింహభాగం కేటాయిస్తూ త ద్వారా రాష్ట్ర విద్యుత్ రంగానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న తీరుపై ప్రత్యేక కథనం.

**ప్రతీ పది టన్నుల్లో తొమ్మిది టన్నులు తెలంగాణకే!**

సింగరేణి సంస్థ తాను ఉత్పత్తి చేసిన బొగ్గును దీర్ఘకాలిక ఇంధన సరఫరా ఒప్పందాలు ఉన్న ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలకు సరఫరా చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలు విద్యుత్ సంస్థలకు కొన్ని దశాబ్దాలుగా బొగ్గు రవాణా చేస్తూ ఆయా రాష్ట్రాల ఇంధన అవసరాలను తీరుస్తోంది.అయితే దేశంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షాకాలంలోనూ విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణ విద్యుత్ అవసరాలకు సింగరేణి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. విద్యుత్ రంగానికి సరఫరా చేస్తున్న ప్రతీ పది టన్నుల బొగ్గులో దాదాపు తొమ్మిది టన్నులు తెలంగాణలోని విద్యుత్ కేంద్రాలకే చేరుతుండటం విశేషం. గత నెలలో (ఆగస్టులో) సింగరేణి 40,51,312 టన్నుల బొగ్గును దేశంలోని విద్యుత్ సంస్థలకు సరఫరా చేయగా.. అందులో 36,25,937 టన్నుల బొగ్గును తెలంగాణలో ఉన్న విద్యుత్ సంస్థలకు రవాణా చేసింది. అంటే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న జెన్ కోలకు దాదాపు 90 శాతం సరఫరా జరిగింది. సగటున ఒక రోజుకు 1,30,687 టన్నుల బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేస్తుండగా తెలంగాణ థర్మల్ కేంద్రాలకు సగటున రోజుకు 1,16,966 టన్నుల బొగ్గును అందిస్తూ రాష్ట్ర ఇంధన అవసరాలు తీరుస్తోంది.

**అత్యధికంగా టీజీ జెన్ కోకు 50 శాతం బొగ్గు**

గత నెలలో కొత్తగూడెం థర్మల్ విద్యుత్ కేంద్రానికి 6,99,661 టన్నుల బొగ్గును 179 రేకుల ద్వారా సరఫరా చేయడం జరిగింది. సగటున రోజుకు 22,570 టన్నుల చొప్పున సగటున రోజుకు ఆరు రేకుల ద్వారా రవాణా చేసింది. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి 7,99,017 టన్నుల బొగ్గును 203 రేకుల ద్వారా సరఫరా చేయడం జరిగింది. ఈ లెక్కన సగటున రోజుకు 25,775 టన్నుల బొగ్గు సగటున రోజున 7 రేకుల ద్వారా రవాణా అయింది. భూపాలపల్లి లోని కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్ కు 1,02,959 టన్నుల బొగ్గును రవాణా చేసింది. కాగా భద్రాద్రి థర్మల్ ప్లాంట్ కు 4,14,719 టన్నుల బొగ్గును సగటున రోజుకు 13,378 టన్నుల చొప్పున బొగ్గును రవాణా చేయడం జరిగింది. మొత్తం మీద చూస్తే తెలంగాణ జెన్కోకు గత నెలలో 382 రైల్వే రేకుల ద్వారా 20,16,356 టన్నుల బొగ్గును సింగరేణి సంస్థ రవాణా చేసింది. ఈ మొత్తం రాష్ట్రంలోని విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేసిన బొగ్గులో 50 శాతం కావడం విశేషం.అలాగే రాష్ట్ర ఇంధన అవసరాలు తీర్చుతున్న రామగుండం ఎన్టీపీసీ ప్లాంట్లకు 7,28,164 టన్నుల బొగ్గును, అలాగే ఎన్టీపీసీ తెలంగాణ ప్లాంట్‌కు 4,15,839 టన్నుల బొగ్గును సరఫరా చేయడం జరిగింది.సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (జైపూర్)కు 4,65,579 టన్నుల బొగ్గును సరఫరా చేయడం జరిగింది.

**సింగరేణి బొగ్గు కోసం ఇతర రాష్ట్రాల వినతులు**

దేశవ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలకు నిరంతర సరఫరా కీలకంగా మారింది. ఈ పరిస్థితుల్లో సింగరేణి బొగ్గుకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా డిమాండ పెరుగుతోంది. కొన్నేళ్లుగా సింగరేణికి వినియోగదారుగా ఉన్న పశ్చిమబెంగాల్ లోని దామోదర వ్యాలీ కార్పోరేషన్ డీవీసీ నుంచి 1 మిలియన్ టన్నులు, దుర్గాపూర్ లోని ఎన్ టీ ఈసీఎల్ నుంచి 1.2 మిలియన్ టన్ను, ఎన్ఎస్‌పీసీఎల్–ఝజ్జర్ (ఆరావళి) నుంచి 1 మిలియన్ టన్నుల, తమిళనాడులోని ఎన్‌టీఈసీఎల్ నుంచి 2 మిలియన్ టన్నుల బొగ్గుకు, ఇతర విద్యుత్ సంస్థలు తమకు సింగరేణి బొగ్గును రవాణా చేయాలని కోరుతున్నాయి. బొగ్గుకు ఇంత తీవ్రమైన డిమాండ ఉన్న నేపథ్యంలో సింగరేణి సంస్థ దీనిని వ్యాపారాత్మకంగా మలుచుకునే అవకాశాలు ఉన్నప్పటికీ రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇతర రాష్ట్రాల డిమాండ్లను పక్కకు పెట్టి రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గును సరఫరా చేస్తుంది.

**రాష్ట్ర అవసరాలకు ఒడిశాలోని నైనీ బొగ్గు :**

ఒడిశాలో సింగరేణి సంస్థ ఉత్పత్తిని ప్రారంభించిన నైనీ బొగ్గు గని నుంచి కూడా బొగ్గును స్వరాష్ట్రానికి తరలిస్తోంది. ఇప్పటికే సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రానికి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి ఒక్కొక్కటి చొప్పున రైల్వే రేకుల ద్వారా బొగ్గును సరఫరా చేసింది. ఒడిశాలో రవాణా ఇబ్బందులు ఉన్నప్పటికీ రానున్న రోజుల్లోనూ మరింత బొగ్గు సరఫరా చేసేందుకు సంసిద్ధంగా ఉంది. నైనీలో ప్రస్తుతం 15 లక్షల టన్నుల బొగ్గు వెలికితీయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ... కేవలం రాత్రి వేళలో మాత్రమే అక్కడ బొగ్గును రైల్వే సైడింగ్ వరకు రవాణా చేయడానికి అనుమతి ఉన్నందున ఎక్కువ పరిమాణంలో బొగ్గు సరఫరాను పెంచలేని పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ ఉత్పత్తి చేస్తున్న నైనీ బొగ్గును కూడా రాష్ట్ర ప్రయోజనాలకు వినియోగిస్తోండటం గమనార్హం.

**ప్రత్యేక అధికారుల నియామకం ద్వారా నిరంతర రవాణాకు చర్యలు :**

రాష్ట్ర విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క గత కొద్ది నెలలుగా సింగరేణి సహా ఇంధన సంస్థలతో అత్యున్నత సమన్వయ సమావేశాలను ఏర్పాటు చేసి తగినంత బొగ్గు సరఫరాపై మార్గనిర్దేశం చేశారు. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం అన్ని ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తి, రవాణాను క్రమంగా పెంచుతోంది. నాణ్యమైన బొగ్గును సకాలంలో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయటం కోసం సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి అయిదుగురు ప్రత్యేక అధికారులను పర్యవేక్షణ కోసం నియమించారు. దీనితో తగినంత బొగ్గు ఉత్పత్తి జరగటమే కాక సకాలంలో సీహెచ్‌పీల ద్వారా థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సరఫరా అవుతోంది. ఇందుకు తగినన్ని రైల్వే రేకులను సమకూర్చుకోవడం, రవాణా చేయటం జరుగుతుంది. ఎల్‌నినో వల్ల రాష్ట్రంలోని విద్యుత్ డిమాండ గతంతో పోల్చితే పెరిగిన నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ఇతర రాష్ట్రాలకు సరఫరాను తగ్గించారు.

## పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య



ప్రజాపక్షం/చండూరు : పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన చండూరు మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేటకు చెందిన పనస రాములు (55), తండ్రి నరసింహ వ్యవసాయం చేస్తున్నారు. వ్యవసాయంలో ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య జంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.



## 104 గ్రాముల గంజాయి స్వాధీనం

ఇద్దరు యువకుల అరెస్ట్

ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ : ఆత్మకూర్(ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో గంజాయితో ఉన్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించిన వివరాలను సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గ్రామానికి చెందిన అల్లిపురి అఖిల్, మట్టపల్లి గంగరాజుల వద్ద గంజాయి ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో వారిని అదుపులోకి తీసుకొని 104 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొన్నట్లు చెప్పారు. గంజాయితోపాటు రెండు మొబైల్ ఫోన్లు, ఒక మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నింధితులపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత జీవితాలు నాశనం అవుతున్నాయన్నారు. యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా వాటికి పూర్తిగా దూరంగా ఉండి చదువు, ఉద్యోగం, క్రీడలు వంటి సానుకూల మార్గాల్లో ముందుకు సాగుతూ ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆత్మకూర్(ఎస్) ఎస్ఐ ఐలయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ప్రజాపక్షం/వేములపల్లి: మండలంలోని శెట్టిపాలెం శివారు అద్దంకి నార్కట్‌పల్లి ప్రధాన రహదారిపై సోమవారం అర్ధ రాత్రి సుమారు 1:30నిమిషాలకు రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. చుట్టుపక్కల వారి సహాయంతో 108 వాహనంలో సదరు వ్యక్తిని మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడు మిర్యాలగూడలోని షాబునగర్‌కు చెందిన నక్క రవి(45) గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గాలీస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

## కత్తితో దాడి.. ముగ్గురు రిమాండ్

ప్రజాపక్షం/మునుగోడు: వ్యక్తిని కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఈ నెల 6న బోనాల పండుగ రోజు అదే గ్రామానికి చెందిన యానుగుల కృష్ణ మూర్తి, కోనేటి భూమయ్య ఇద్దరు పక్క గ్రామమైన పేరేపల్లిలో మద్యం సేవించేందుకు వెళ్లారు. అదే బెల్ట్ షాపుకు కృష్ణాపురం గ్రామానికి చెందిన వడ్డేపల్లి వేణు వెళ్లగా వేణుకు, కృష్ణమూర్తికి మధ్య ఉన్న పాత వ్యక్తిగత గొడవలతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి పరస్పరం దాడికి దిగారు. అనంతరం వేణు కృష్ణాపురం గ్రామానికి తిరిగి వస్తుండగా భూమయ్య కొడుకు విజయరామరాజు నా తండ్రితో గొడవ పెట్టుకుంటావా అంటూ కత్తితో వేణుపై దాడి చేశాడు. ఈ దాడిలో వేణుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధితుడు వేణు సోదరుడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు కోనేటి భూమయ్య,యానుగుల కృష్ణమూర్తి, కోనేటి విజయ రామరాజు ముగ్గురిని అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు మునుగోడు ఎస్ఐ శోభన్ బాబు తెలిపారు.

## సొసైటీ ట్రిబ్యునల్ కోర్టు ఆర్డర్‌ను అమలు చేయాలి

ప్రజాపక్షం/చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలం నేలపట్ల చేనేత సొసైటీ అధ్యక్షుడు పిల్లలమర్రి శ్రీనివాస్ ఎన్నిక పట్ల గత నెల 5 సొసైటీ ట్రిబ్యునల్ కోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌ను అమలు చేయాలని చేనేత జౌళి శాఖ యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ సంచాలకులు మంగళవారం రాష్ట్ర హ్యాండ్లూం, టెక్స్‌టైల్స్ కమీషనర్ ఆదేశాల మేరకు నేలపట్ల గ్రామంలోని సొసైటీ కార్యాలయానికి నోటీస్‌లు అంటించారు. నేలపట్ల చేనేత సొసైటీ అధ్యక్షులుగా ఎన్నికైన పిల్లలమర్రి శ్రీనివాస్ ఎన్నిక చెల్లదని కొంతమంది డైరెక్టర్లు ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించారు. పిల్లలమర్రి శ్రీనివాస్‌కు ముగ్గురు సంతానం ఉన్నారు. సొసైటీ ఎన్నికల నియమావళి ప్రకారం డైరెక్టర్‌గా పోటీ చేయడానికి ఇద్దరి కన్న ఎక్కువ మంది సంతానం కలిగి ఉన్న వారు పోటీకి చేయరాదనే నిబంధన మేరకు విచారించిన ట్రిబ్యూనల్ కోర్టు పిల్లలమర్రి శ్రీనివాస్ డైరెక్టర్ ఎన్నిక, చైర్మన్ ఎన్నికపై మధ్యంతర స్టే గత నెల 5న ఇచ్చిందని ఎడిఓ గోపాల్ తెలిపారు. అదేవిధంగా పిల్లలమర్రి శ్రీనివాస్‌కు వాట్సప్ ద్వారా, సోసైటీ కార్యదర్శికి ఇచ్చినట్లు పేర్కొన్నారు. ట్రిబ్యూనల్ కోర్టు నుండి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సోసైటీలో మధ్యంతర స్టే ఆర్డర్ ఆదేశాలను న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలని సోసైటీ కార్యదర్శికి సూచించారు. ఆయనతోపాటు డైరెక్టర్లు గంజి శ్రీనివాసులు, తడక కోటేశ్వర్‌లు ఉన్నారు.



## యూత్ నేషనల్ అథ్లెటిక్స్‌లో తెలంగాణకు నాలుగు పతకాలు

రెండు స్వర్ణాలు.. రెండు కాంస్యాలతో సత్తాచాటిన రాష్ట్ర క్రీడాకారులు





ప్రజాపక్షం /హైదరాబాద్:యూత్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తాచాటారు. పంజాబ్ లోని లూథియానాలో సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు జరిగిన 21వ యూత్ నేషనల్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2026లో రాష్ట్ర క్రీడాకారులు రెండు స్వర్ణాలు, రెండు కాంస్య పతకాలు సాధించారు.బాలుర 400 మీటర్ల పరుగులో ఎల్. రాము 47.21 సెకన్ల అత్యుత్తమ టైమింగ్‌తో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మెడ్లే రిలేలోనూ తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన రాము.. జట్టు స్వర్ణం సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. పీ. ఆర్యన్ బాబు, అర్జున్ ఎస్., ఏ. వరుణ్, ఎల్. రాము సభ్యులుగా ఉన్న తెలంగాణ జట్టు మెడ్లే రిలేను 1:54.54 సెకన్లలో పూర్తి చేసి బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది.ఇక హెప్టాథ్లాన్‌లో ఎం. సోము 4,587 పాయింట్లతో కాంస్య పతకం సాధించగా, బాలికల లాంగ్‌జంప్‌లో ఎం. శ్రీవిద్య దొర 5.57 మీటర్ల దూరం దూకి కాంస్య పతకాన్ని గెలుచుకుంది.తెలంగాణ అథ్లెట్ల విజయాలపై స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ కె. శివసేన రెడ్డి, వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోని బాలాదేవి హర్షం వ్యక్తం చేశారు. విజేతలు, కోచ్‌లను అభినందిస్తూ భవిష్యత్‌లో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రీడాకారుల విజయాల వెనుక కోచ్‌లు జి. రాజేష్, కె. లక్ష్మ ణ్, సునంద కౌసి, ఎం. శ్రీనివాస్ కృషి ఉందని వారు పేర్కొన్నారు. విజేతలను సన్మానించిన కార్యక్రమంలో ఎస్ఎటి డిప్యూటీ డైరెక్టర్లు డాక్టర్ రవితేజ, ఎస్. శ్రీనివాస్, అశోక్‌కుమార్, గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్ కె. మధు, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి, ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొని అభినందించారు.యువ అథ్లెట్ల వరుస విజయాలు తెలంగాణలో అథ్లెటిక్స్ క్రీడకు పెరుగుతున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తున్నాయని, రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ చేపడుతున్న కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

## ఇజ్రాయెల్‌పై బ్రిటన్ ఆంక్షలు

వెస్ట్‌బ్యాంక్‌లో అరాచకాలపై 12 దేశాల ఆగ్రహం



లండన్:ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో ఇజ్రాయెల్ ఇటీవల సాగిస్తున్న క్రూర హింసాకాండపై 12 యూరోపియన్ యూనియన్ దేశాలు మండిపడ్డాయి. ముఖ్యంగా వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ సెటిలర్స్ ప్రాంతాల నుండి దిగుమతయ్యే ఉత్పత్తులను నిషేధం విధిస్తామని బ్రిటన్ చెప్పింది. అదే బాటలో మిగిలిన యూరప్ దేశాలు కొనసాగుతాయని బ్రిటన్ మంగళవారం ప్రకటించింది. వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయెల్ స్థావరాల నుండి వచ్చే వస్తువుల దిగుమతిని బ్రిటన్ నిషేధిస్తుందని ఆ దేశ విదేశాంగ మంత్రి ఎడ్ మిలిబంద్ పార్లమెంటులో ప్రకటించారు.ఇజ్రాయెల్ సెటిలర్స్ ఉగ్రవాదులు జాతి నిర్మూలన చేస్తున్నారని, దీనిని చూసీ చూడనట్టు ఇజ్రాయెల్ వ్యవహరిస్తోందని విమర్శించారు. ఫ్రాన్స్, కెనడా, డెన్మార్క్, స్పెయిన్, ఫిన్లాండ్, ఐర్లాండ్, ఐస్లాండ్, నార్వే, పోలాండ్, పోర్చుగల్, స్వీడన్ దేశాలు కూడా తమతోపాటు జత కలుస్తాయని, ఈ విదేశాంగమంత్రులు ఒక ఉమ్మడి ప్రకటన చేస్తారని మిలిబంద్ ప్రకటించారు. ఈ చర్య బ్రిటన్–పాలస్తినా మధ్య సంబంధాల్లో ఒక మేలిమలుపుగా మారుతుందని బ్రిటన్‌లో పాలస్తినా రాయబారి హుస్సామ్ జోమ్లోట్ చెప్పారు. దీనిపై ఇజ్రాయెల్ విదేశాంగమంత్రి గిడియన్ సార్ స్పందిస్తూ,తమపై ఆంక్షలు విధించే దేశాలపై తాము కూడా అదేస్థాయిలో స్పందిస్తామని హెచ్చరించారు. బ్రిటన్ ప్రభుత్వం తప్పుతోవ పట్టిందన్నారు.ఇజ్రాయెల్‌లో బ్రిటన్ రాయబారి సైమన్ వాల్టర్స్‌ను తక్షణం బహిష్కరించాలని ఇజ్రాయెల్ ఆర్థికమంత్రి బెజెలెల్ స్మోట్రిచ్ పిలుపు ఇచ్చారు. కాగా బ్రిటన్‌లో యూదులే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఆ దేశంలోని యూదు కౌన్సిల్ విమర్శించింది.

## వరకట్న వేధింపుల కేసులో ముగ్గురికి జైలు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: వరకట్న వేధింపులు,ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసులో ముగ్గురు నిందితులకు 3 సంవత్సరాల 6 నెలల జైలు శిక్ష, రూ.6వేలు జరిమానా విధిస్తూ ప్రత్యేక కోర్టు తీర్పు వెలువరించిందని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు. నిడమనూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో నమోదైన కేసులో కారంపూడి శ్రీను, కారంపూడి ఉషారాణి, కారంపూడి సత్యనారాయణలను నిందితులుగా గుర్తించారు.ఎస్‌సి ఎస్‌టి ప్రత్యేక సెషన్స్ కోర్టు (2 అదనపు జిల్లా సెషన్స్ జడ్జి) తీర్పులో ఐపిసి 323, 504, 494 సెక్షన్ల కింద నిర్దోషులుగా ప్రకటించగా, ఐపిసి 498ఎ, ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ 1989 సెక్షన్ 3(1)(ఆర్)(ఎస్) కింద దోషులుగా నిర్ధారించి 3 సంవత్సరాల జైలు, వెయ్యి రూపాయల జరిమానా, అట్రాసిటీ కింద 6 నెలల జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా 15 రోజుల జైలు శిక్ష అనుభవించాలని, అన్ని శిక్షలు ఏకకాలంలో అమలు చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసులో సమర్థవంతంగా దర్యాప్తు చేసిన అప్పటి ఎస్ఐ ఎం.శోభన్, మిర్యాలగూడ ఎస్‌డిపిఓ పి.వెంకటగిరి, వాదనలు వినిపించిన అదనపు పీపీలు ఎస్.శోభారాణి, ఆర్.అఖిల, సమన్వయంతో పనిచేసిన అధికారులు ఎస్.రాఘవరావు, జి.రవి, డి.విజయ్ కుమార్, శ్రీను నాయక్, ఆర్.రవీందర్ రాథోడ్, హెచ్.పి.నరేందర్, ఎన్.మల్లికార్జున్లను ఎస్‌పి అభినందించారు.

**వినాయక ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి**

వినాయక నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ కోరారు. జిల్లాలో డీజేలకు అనుమతి లేదని, లౌడ్ స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు.నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా రోడ్డుకు ఇరుపక్కల విగ్రహాలను ప్రతిష్ఠించాలని, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రార్థనా మందిరాలకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. సోషల్ మీడియాలో ఇతర మతాల మనోభావాలు దెబ్బతీసే పోస్టులపై కఠిన చర్యలు ఉంటాయని, ప్రత్యేక మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు.విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి దరఖాస్తును సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని కోరారు. 24 గంటలు ఇద్దరు వాలంటీర్లు ఉండాలి, భక్తులకు క్యూలైన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. మద్యం, పేకాట, అసభ్య నృత్యాలు, ఇతర మతాలను కించపరిచే ప్రసంగాలు నిషేధం. పాయింట్ బుక్ నిర్వహించాలి, అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే 112కు సమాచారం ఇవ్వాలి.

## గణపతి ఉత్సవాలకు ప్రత్యేక రైళ్లు

ప్రజాపక్షం/హైదరాబాద్: గణపతి ఉత్సవాల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడపనుంది. హెచ్.ఎస్. నాందేడ్–సావంత్‌వాడి రోడ్ మధ్య రెండు జతల ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 07659 నంబర్ నాందేడ్–సావంత్‌వాడి రోడ్ ప్రత్యేక రైలు సెప్టెంబర్ 12, 15 తేదీల్లో రాత్రి 8 గంటలకు నాందేడ్ నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 3.30 గంటలకు సావంత్‌వాడి రోడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07660 నంబర్ సావంత్‌వాడి రోడ్–నాందేడ్ ప్రత్యేక రైలు సెప్టెంబర్ 14, 17 తేదీల్లో ఉదయం 7.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.30 గంటలకు నాందేడ్ చేరుకుంటుంది. ఈ రైళ్లు ఇరువైపులా పూర్ణ, పర్భణి, పర్లీ వైజ్ఞాథ్, లాతూర్ రోడ్, లాతూర్, యెడ్షి, బార్షి టౌన్, కుర్దువాడి, దౌండ్, పుణె, లోణావళా, కళ్యాణ్, పన్వేల్, పెన్, రోహా, మాంగావ్, ఖేడ్, చిప్లూన్, సంగమేశ్వర్, రత్నగిరి, రాజాపూర్ రోడ్, వైభవ్‌వాడి రోడ్, కంకావళి, కుడాల్ స్టేషన్లలో ఆగుతాయి. ప్రత్యేక రైళ్లలో టూటైర్, త్రీటైర్ ఎసిలతో పాటు స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి ఎ. శ్రీధర్ తెలిపారు.

## ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

తెలంగాణ నేషనల్ మజ్దూర్ యూనియన్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగుల న్యాయమైన ఆర్థిక సమస్యలను తక్షణమే పరిష్కరించి, వారికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీకి శాంతియుతంగా వెళ్తున్న రిటైర్డ్ ఉద్యోగులను పోలీసులు మార్గమధ్యంలో అడ్డుకుని ముందస్తు అరెస్టులు చేయడాన్ని యూనియన్ తీవ్రంగా ఖండించింది. సుమారు 70 ఏళ్ల వయసున్న సీనియర్ సిటిజన్ల సమస్యలను పరిష్కరించకుండా వారిపట్ల మర్యాద లేకుండా వ్యవహరించడం సరికాదని యూనియన్ పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యక్తిగతంగా చొరవ తీసుకుని రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని అధ్యక్షుడు పి. కమాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.డి.మౌలానా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## బిఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

ప్రజాపక్షం/చౌటుప్పల్ : అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో సోమవారం బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆందోళనతో ఎమ్మెల్యేలను ప్రభుత్వం అరెస్ట్ చేసి పోలీస్ కేసులు నమోదు చేయడం పట్ల మునుగోడులో బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ మండలం పంతంగి, అంకిరెడ్డిగూడెం, చౌటుప్పల్ మునిసిపల్ బిఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు సుర్వి మల్లేష్, పంతంగి సర్పంచ్ కాకి శ్రీలత సుందరయ్య, నాయకులు రమనగోని రఘు, సతీష్, మల్లేష్, తదితరులు ఉన్నారు.

## అసెంబ్లీ వద్ద మహిళా ఎమ్మెల్యేలపై పోలీసుల దౌర్జన్యం హేయం

సంఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన బిజెపి ఎంపి డి.కె. అరుణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : అసెంబ్లీ ఆవరణలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డిల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై బిజెపి ఎంపి డి.కె. అరుణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా శాసన సభ్యులపై పోలీసుల ప్రవర్తన అత్యంత హేయమైనదని ఆమె విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా వ్యవహరించడానికి ఎవరి ఆదేశాలు ఉన్నాయని ఆమే ప్రశ్నించారు. ముఖ్యమంత్రి లేదా హోం మంత్రి హోదాలో పోలీసులకు ఇలాంటి ఆదేశాలు ఇచ్చారా..? అని నిలదీశారు. జరిగిన ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యలను తప్పుగా భావించి క్షమాపణలు కోరాలని, చర్యలు తీసుకోవాలని అసెంబ్లీలో చర్చించిన విషయాన్ని డి.కె. అరుణ గుర్తు చేశారు. అదే విధంగా మహిళా శాసన సభ్యుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై కూడా సభలో చర్చ జరగాలన్నారు. మహిళా ఎమ్మెల్యేల మెడలు, వెంట్రుకలు పట్టుకుని లాగడం, చీరలు లాగడం వంటి ఘటనలు చోటుచేసుకోవడం తీవ్ర అవమానకరమన్నారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం నోరు విప్పకపోవడం మరింత బాధాకరమన్నారు.

## ప్రజా సమస్యలు గాలికి వదిలి బూతులతో కాలయాపన సిగ్గుచేటు : జాన్‌వెస్లీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : అసెంబ్లీ గేటు వద్ద నిరసన తెలిపిన బిఆర్‌ఎస్ మాజీ మంత్రులు, మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించడం, ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ తల్లిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమని , ఈ చర్యలను సిపిఐ (ఎం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఘటనలకు బాధ్యులైన అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు బహిరంగంగా బేషరతు క్షమాపణ చెప్పాలని, విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సిన అసెంబ్లీలో విద్య, వైద్యం, నిరుద్యోగం, రేషన్‌కార్డులు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, కార్మికుల కనీస వేతనాలు తదితర అంశాలను పక్కనపెట్టి బూతులతో సభా సమయాన్ని వృథా చేయడం సిగ్గుచేటన్నారు. అధికార, ప్రతిపక్ష సభ్యులు ప్రజా సమస్యలపై అర్థవంతమైన చర్చలు జరపాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు.

హైదరాబాద్
బుధవారం
09-09-2026
www.prajapaksham.in

'మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి 'వాల్తేరు వీరయ్య' సక్సెస్ తర్వాత చిత్రం 'కాకా'తో రాబోతున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం భారీ స్థాయిలో హై-ఇంటెన్సిటీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు.'

రీల్

## 18న 'పిఠాపురంలో.. అలా మొదలైంది' విడుదల



ప్రేయసి రావే' ఫేమ్ మహేష్ చంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన 'పిఠాపురంలో& అలా మొదలైంది' చిత్రం 18న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రైమ్ షో ఎంటర్‌టైన్ మెంట్ ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. డా. రాజేంద్ర ప్రసాద్, పృథ్వీరాజ్, మణిచందన, అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని మహేష్ చంద్ర సినిమా టీమ్ మరియు ఎవర్ గ్రీన్ ఎపిక్ సినిమా సంయుక్త నిర్మాణంలో దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళి (గోదారి కిట్టయ్య) నిర్మించారు. ప్రేమ, సునిశితమైన హాస్యం, సెంటిమెంట్, తండ్రీకూతుళ్ల అనుబంధం వంటి భావోద్వేగ అంశాలతో పాటు యువతకు ఒక మంచి సందేశాన్ని అందించేలా ఈ చిత్రాన్ని రూపొందించినట్లు దర్శకుడు మహేష్ చంద్ర తెలిపారు. హాస్య బ్రహ్మ, డా. బ్రహ్మానందం వాయిస్ ఓవర్ ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని, ప్రముఖ శిల్పి రాజ్ కుమార్ వడయార్ ఇందులో కీలక పాత్రలో నటించారు. ఇరుముడి, విశ్వనాథం అండ్ సన్స్, మా ఇంటి బంగారం తరహా లోనే మా సినిమా కూడా కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం అవుతుందని మహేష్ చంద్ర చెప్పారు. జయవాహిని, అన్నపూర్ణమ్మ, దాసరి పద్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా, జూనియర్ పవన్ కళ్యాణ్, జెడివి ప్రసాద్, కేపే పాల్ రాము, జబర్దస్త్ శేషు ఇందులో ప్రధాన తారాగణం. ఈ చిత్రానికి స్టోరీ డెవలప్మెంట్ డైలాగ్స్ : శ్రీరామ్ ఏదోటి, ఎడిటర్: బి సత్యనారాయణ, మ్యూజిక్ : జీసీ క్రిష్.

## 'కడలి' పాత్ర ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది



వైష్ణవి చైతన్య

బేబీ' జోడీ ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్'. దర్శకుడు ఆదిత్య హాసన్, ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయం అవుతుండటం విశేషం. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. 11న థియేటర్లలో అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో కథానాయిక వైష్ణవి చైతన్య 'మీడియా'తో చిట్ చాట్ నిర్వహించారు. ఆనంద్ పోషించిన ఆదిత్య పాత్ర సాఫ్ట్‌గా, కామ్‌గా ఉంటుంది. జీవితంలో ఎదురైన అనుభవాల నుంచి ఆదిత్య ఏం నేర్చుకున్నాడనేది ఆసక్తికరంగా ఉంటుంది. నేను పోషించిన కడలి పాత్ర స్ట్రాంగ్ అమ్మాయి. తన కోసం తాను నిలబడే అమ్మాయి. క్లారిటీ ఉన్న అమ్మాయి. ప్రతి ఒక్కరిలోనూ కడలి పాత్ర ఉంటుంది. కానీ, కుటుంబం వల్లనో, సమాజం వల్లనో మనలోని ఆ వెర్షన్ లోపలే ఉండిపోతుంది. బయటకు రాదు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఏదోక సమయంలో వారి కోసం వారు నిలబడాలి. అందుకే కడలి పాత్ర నా మనసుకు బాగా దగ్గరైంది. కథలోనూ, నా పాత్రలోనూ కొత్తదనం ఉండాలి. ఆ పాత్రలో నన్ను నేను చూసుకోగలగాలి. ఎపిక్ ఎంచుకోవడానికి కారణమదే అన్నారు. ఆదిత్య, కడలి పాత్రల మధ్య జరిగే చిన్న విషయాలకు ఎంత ఇంపార్టెన్స్ ఉందో చూపిస్తారు. ఆదిత్య యూనిక్ డైరెక్టర్. నాకు బాగా ఇష్టమైన దర్శకులలో ఆయన ఒకరు. దర్శకుడు ఆదిత్యతో నాకు ముందు పరిచయం లేదు. ఎపిక్ కథ చెప్పడానికి వచ్చినప్పుడే మొదటిసారి కలిశాను. కానీ, అప్పటికే 90s వెబ్ సిరీస్ చూసి ఉన్నాను. ఆ సిరీస్ నాకు ఎంతగానో నచ్చింది.బేబీ, ఎపిక్ సినిమాలు దేనికవే ప్రత్యేకమైనవి. ఒత్తిడి లేదు కానీ, ఛాలెంజింగ్ గా తీసుకొని ఎపిక్ సినిమా చేశాము. ఈ సినిమాలో మమ్మల్ని చూస్తున్నప్పుడు బేబీ గుర్తుకు రాకపోతే మేము విజయం సాధించినట్టే. ఎపిక్ ఖచ్చితంగా ప్రేక్షకుల ఆదరణ పొందుతుందనే నమ్మకం మాకు మొదటి నుంచి ఉంది. మనం ఎన్నో లవ్ స్టోరీలు చూసుంటాం. కానీ, ప్రతి లవ్ స్టోరీలోనూ ఏదోక ప్రత్యేకత ఉంటుంది. ఎపిక్‌లో కూడా ఆ ప్రత్యేకత ఉంది. భిన్న దారులు, భిన్న మనస్తత్వాలు ఉన్న ఇద్దరు యూకేకి చదువుకోవడానికి వెళ్లి, అక్కడ కలుస్తారు. ఆ ఇద్దరు ప్రైవేట్ గా మాట్లాడుకునే మాటలు ఏవైతే ఉంటాయో, ఆ సంభాషణల మీద నడిచే సినిమా.

## నా కెరీర్‌లో చాలా ఇంపార్టెంట్ ఫిల్మ్

'సర్దార్ 2' ప్రీరిలీజ్‌లో హీరో కార్తి



హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్‌బస్టర్ హిట్ అయిన 'సర్దార్' మోస్ట్ అవైటెడ్ సీక్వెల్ 'సర్దార్ 2'తో థియేటర్లలోకి వస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మించారు. ఈ చిత్రం సెప్టెంబర్ 10న వరల్డ్‌వైడ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందద్భంగా హీరో కార్తి మాట్లాడుతూ 'సర్దార్' సినిమాకు ఇక్కడ చాలా పెద్ద ఫ్యాన్ బేస్ ఉంది. 'సర్దార్ 2' నా కెరీర్‌లో చాలా ఇంపార్టెంట్ ఫిల్మ్. ఇలాంటి స్పై క్యారెక్టర్ దొరకడం నా అదృష్టం. నిజానికి గూఢచారులకు ఎలాంటి గుర్తింపు ఉండదు. కానీ వాళ్ల పని వాళ్లు చాలా నిజాయితీతో, ఏదీ ఆశించకుండా చేస్తారు. 'సర్దార్ 2' చూసే ముందు 'సర్దార్' సినిమా మరొకసారి చూడమని కోరుతున్నాను. ఆ సినిమా చూస్తే మీరు 'సర్దార్ 2'కి ఇంకా స్ట్రాంగ్‌గా కనెక్ట్ అవుతారు అన్నారు . ఎస్.జె. సూర్య, డైరెక్టర్ బోయపాటి శ్రీను మాట్లాడారు. హీరోయిన్ మాళవిక మోహన్. హీరోయిన్ ఆశిక రంగనాథ్. నిర్మాత రవిశంకర్ , డైరెక్టర్ కళ్యాణ్ శంకర్ , నిర్మాత నాగవంశీ ,నిర్మాత అనిల్ సుంకర పాల్గొన్నారు.

## 11న శ్రీలత..సాంగ్ రిలీజ్



ప్రొడ్యూసర్ బన్నీ వాస్, జీనియస్ డైరెక్టర్ సుకుమార్ తమ బన్నీ వాస్ వర్క్స్ సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై ప్రియదర్శి హీరోగా నిర్మిస్తున్న సినిమా 'ఇదుపు కాయితం'. ఈ సినిమాలో తెలంగాణ ఫోక్ సాంగ్స్ ద్వారా పేరు తెచ్చుకున్న నటి నాగదుర్గ హీరోయిన్‌గా నటిస్తోంది. తెలంగాణ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ స్టోరీతో ఎంటర్‌టైనింగ్ డ్రామాగా ఇదుపు కాయితం సినిమాను యువ దర్శకుడు వంశీరెడ్డి దొండపాటి రూపొందిస్తున్నారు. 11న 'శ్రీలత..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. 'శ్రీలత..' సాంగ్ ప్రోమో రిలీజ్ చేశారు. అప్పటి నుంచి ఈ పాట వైరల్‌గా మారి మ్యూజిక్ లవర్స్ కు ఫేవరేట్ సాంగ్ అయ్యింది. ప్రేక్షకుల కోరిక మేరకు 'శ్రీలత..''శ్రీలత..' పాటను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మ్యూజిక్ డైరెక్టర్ సురేష్ బొబ్బిలి మంచి మెలోడీ ట్యూన్‌తో ఈ పాటను బ్యూటిఫుల్ గా కంపోజ్ చేశారు. ఇదుపు కాయితం సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. ఈ సినిమాను డిసెంబర్ ఫస్ట్ వీక్‌లో థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రియదర్శి, నాగదుర్గ, శివజ్యోతి (తీన్మార్ సావిత్రి), సుజాత (జోర్దార్), చంద్రవ్వ, మౌనిక రెడ్డి, రచ్చరవి, బిత్తిరి సత్తి, అభయ్ బేతిగంటి, మైమ్ మధు, తదితరులు నటిస్తున్నారు.

## 'ఇరుముడి' సినిమా సందేశం ఏమిటి?

నవంబర్ వచ్చిందంటే చాలు తెలుగు రాష్ట్రాలలో స్వామియే శరణం అయ్యప్ప శరణు నినాదాలు మిన్నంటూతాయి. అనేక చోట్ల అయ్యప్ప భక్తులు ఎంతో నిష్టగా శ్రద్ధగా కనిపిస్తుంటారు. మండల దీక్షలో భక్తి పరవశంతో గడుపుతా రు. మాల ధారణ వేసుకోకున్నా అయ్యప్ప స్వామిని ఆరాధించే అనేక మందిలో నేను ఒకడిని. హరివరాసనం స్వామి జేసుదాసు పాట ఆ సమయంలో వింటే ఒళ్ళు పులకించిపోతుంది. కేవలం అయ్యప్ప మాల ధారణ భక్తులే కాదు ఆ పాటకు ఎంతోమంది పరవశిస్తారు. సినిమాల విషయానికొస్తే, భారతదేశంలోనే అత్యధికంగా ప్రతి ఏటా విడుదలయ్యే బాలీవుడ్ చిత్రాల తర్వాత తెలుగు చిత్రాలదే ద్వితీయ స్థానం. డైరెక్షన్ మొదలుకొని జూనియర్ ఆర్టిస్టుల వరకు కలుపుకొని 24 క్రాఫ్ట్ లుగా సినిమా నిర్మాణాన్ని చెప్తారు.

**ఆ 24 క్రాఫ్ట్ ల్లో ఒకటైన కథ**

అనేది సినిమాకు ప్రాణవాయువు లాంటిది. అసలు సినిమా అనేదే ఒక సృజనాత్మక ప్రక్రియ. అనునిత్యం తమ సృజనతో అంతర్జాతీయ స్థాయికి ఎదుగుతున్న తెలుగు డైరెక్టర్లు ఉన్నారు, అంతర్జాతీయ అవార్డు అందుకునే స్థాయిలో తెలుగు పాట ఎదిగింది. కథాంశము సినిమాకు పెద్ద ముడి సరుకు. కథా రచయిత దాన్ని సృష్టించే తపస్వి. సినిమాను చూసి సమాజం అట్లా ఉంది అనుకోవాలా? లేక సమాజాన్ని చూసే సినిమా కథ అలా ఉంటుందని అనుకోవాలా?? అనేది అప్రస్తుతం. భాష ఏదైనా కానీ సినిమా అనేది సమాజాన్ని ప్రభావితం చేసే శక్తివంతమైన మాధ్యమం. కాబట్టి సినిమా నిర్మాతలు దర్శకులు కథా రచయితలు తమ కర్తవ్యాన్ని మరింత బాధ్యతగా నిర్వర్తించాలి. క్విడ ప్రోకో లాగా ఉండాలి.

అసలే రోజురోజుకు పలుచబడుతున్న టీచర్ గౌరవాన్ని ఇరుముడి సినిమా మరింత తగ్గించినట్టయ్యింది. అఫ్కోర్స్.. పిల్లలు బాగా చదవాలనే ఉద్దేశంతో కఠినంగా ఉండే టీచర్లు అక్కడక్కడ ఉంటారు. దండం దశగుణం భవేత్ అనేదాన్ని నమ్మే వాళ్ళు ఉన్నారు. విద్యార్థులను సక్రమంగా క్రమశిక్షణగా ఎదిగేటట్టు చేయాలనే తపనే ఉపాధ్యాయుడికి ఉంటుంది అంతే తప్ప ఎలాంటి దురుద్దేశం ఏ టీచర్‌కు ఉండదు. ముఖ్యంగా మహిళా టీచర్లు మరింత ప్రేమగా సహానుభూతిగా విద్యార్థుల పట్ల వ్యవహరిస్తారు. తమ సొంత పిల్లల కంటే కూడా విద్యారులను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించే ఉపాధ్యాయులు ప్రపంచవ్యాప్తంగా కోకొల్లలుగా ఉన్నారు. ఉంటారు కూడా. ఉద్యోగ నిర్వహణలో కఠినంగా ఉన్నందుకుగాను సస్పెన్షన్కు గురి అయిన ఒక మహిళా టీచర్ స్వతహాగా స్త్రీ అయి ఉండి కూడా తల్లి లాంటి పాత్రలో ఉండి కూడా స్కూలు పిల్లలని ఎమ్మెల్యే పక్కలోకి తార్చడమనేది జుగుప్సాకరమైన అంశం. ఎమ్మెల్యేకు అమ్మాయిలను తార్చడము కథకు అవసరమనుకుంటే మరో రకంగా కూడా చూపెట్టవచ్చు. మేధస్సును ఎంతోమదిస్తే కానీ ఒక కథ పుట్టించని కథా రచయిత ఒక గురువు వద్ద చదువుకున్న శిష్యుడే కదా! కథలో మహిళా టీచర్ ను పాత్రదారిని చేయడం ఒక ఉపాధ్యాయుడిగా తట్టుకోలేకపోతున్నాను. ఎంతో భక్తి శ్రద్ధలతో అయ్యప్పను ఆరాధించే కథానాయకుడిని, ఎంతోమందికి ఇరుముడి వేసే గురు స్వామిని కూడా తాగుబోతులుగా చూపించడం సబబు కాదు. ప్రాణప్రదంగా తన కూతురును ప్రేమించే కథానాయకుడు కూతురు ముందే మందు తాగడం చూపించడం ఏ రకంగానూ సరియైనది కాదు. దీనికి తోడు సినిమా చివర్లో కథానాయకుడు ఇతరులను, గురు స్వామిని వరుసగా చంపుతూ వెళ్లడం, చనిపోయిన తన కూతురుకు పుష్పవతి అయిన సందర్భంలో చేయించే మంగళ స్నానం సీన్ లో సినిమా కావాల్సినంత సెంటిమెంట్‌గా ఆకట్టుకోలేకపోయింది.

గొల్లెపల్లి నరసింహ రిటైర్డ్ ప్రిన్సిపల్
8106 820 393



# హామీలు ఏమయ్యాయి?

(మొదటి పేజీ తరువాయి)

అయితే స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాలు గడిచినా ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కాలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను, ప్రశ్నించే గొంతులను అణచివేస్తోందని ఆరోపించారు. యువకులు, విద్యార్థులు, కవులు, రచయితలు, పాత్రికేయులు సహా అనేక వర్గాలు నిర్బంధానికి గురవుతున్నాయని అన్నారు. వరవరరావు, ప్రొఫెసర్ సాయిబాబా వంటి మేధావులను జైళ్లలో నిర్బంధించిన సందర్భాలను ఆయన ప్రస్తావించారు. దేశంలో ఎన్నికల వ్యవస్థ, న్యాయ వ్యవస్థలపై కూడా రాజకీయ ప్రభావం పెరుగుతోందని, ప్రతిపక్షాలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి దేశాన్ని ఒక మతరాజ్యంగా మార్చే ప్రయత్నాలను అడ్డుకోవాల్సిన బాధ్యత యువత, విద్యార్థులపై ఉందన్నారు. రైతుల సమస్యలను పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతులు సుదీర్ఘ పోరాటం చేశారని నెల్లికంటి సత్యం గుర్తుచేశారు. ఢిల్లీ సరిహద్దుల్లో నెలల తరబడి రైతులు ఆందోళన చేసినప్పటికీ వారిని తీవ్రవాదులు, ఖలిస్తానీలు, అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేసే ప్రయత్నం జరిగిందని అన్నారు. చివరకు రైతుల ఉద్యమం ముందు కేంద్రం దిగివచ్చి వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవాల్సి వచ్చిందన్నారు. యువత, విద్యార్థులు నిర్వహించే పోరాటాలు కేవలం ఒక సమస్యకు పరిమితం కావని, దేశంలో నెలకొన్న అసంతృప్తికి అవి ప్రతిబింబాలని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడితే స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయని, పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని ఆశించినా ఆ పరిస్థితి పూర్తిగా ఏర్పడలేదన్నారు. బీబీనగర్, చౌటుప్పల్ తదితర పారిశ్రామిక ప్రాంతాల్లో స్థానిక యువతకు తగిన స్థాయిలో ఉద్యోగాలు లభించడం లేదని ఆరోపించారు. బీబీనగర్, చౌటుప్పల్ ప్రాంతాలు మరో పటాన్‌చెరువుగా మారకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక పరిశ్రమల్లో 80 శాతం ఉద్యోగాలను స్థానిక యువతకే కేటాయించాలని డిమాండ్ చేశారు.

**రెండు లక్షల ఉద్యోగాలు.. నిరుద్యోగ భృతి ఎక్కడ?**

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు పూర్తి చేసుకున్నా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని నెల్లికంటి సత్యం విమర్శించారు. ఏటా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, కానీ ఇప్పటివరకు ఆ స్థాయిలో ఉద్యోగాల భర్తీ జరగలేదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతిని కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆరోపించారు.

**'యువత పోరాడితేనే మార్పు'**


దేశంలో నిరుద్యోగం, పేదరికం, అవినీతి, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని సత్యం పేర్కొన్నారు. ప్రజాస్వామ్య, మౌలిక హక్కుల పరిరక్షణ కోసం యువతరం పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎఐవైఎఫ్ అంటేనే సమరశీల పోరాటాల వేదిక అని పేర్కొంటూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. దేశాన్ని, సమాజాన్ని మార్చే శక్తి యువతరానికి ఉందని, ప్రజా సమస్యలపై నిస్వార్థంగా పోరాడాలని పిలుపునిచ్చారు.



**ఉద్యోగాలు అడిగితే దిమాగీ నక్సల్స్ అంటారా? :ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు రోషన్ కుమార్ సిన్హా**



దేశానికి భవిష్యత్తుగా చెప్పుకునే యువతకు ఉద్యోగాలు, నాణ్యమైన విద్య, సామాజిక భద్రత కల్పించడంలో 12సంవత్సరాలుగా విఫలమైన మోదీ ప్రభుత్వం ఇప్పుడు ప్రశ్నించే యువతనే దిమాగీ నక్సల్స్ గా ముద్ర వేయడం ద్వారా తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవాలని చూస్తోందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ అధ్యక్షులు రోషన్ కుమార్ సిన్హా ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యోగాలు, అభివృద్ధి, అచ్చే దిన్ పేరుతో యువతలో ఆశలు రేకెత్తించిన కేంద్ర ప్రభుత్వం, 12 ఏళ్ల తర్వాత కూడా కోట్లాది యువతకు స్థిరమైన ఉపాధి కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు, పేపర్ లీకులు, నియామకాల్లో జాప్యం, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ వంటి సమస్యలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని అన్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా జెన్ జీ యువత విద్య, పరీక్షలు, ఉద్యోగాలు, ప్రభుత్వ జవాబుదారీతనం వంటి అంశాలపై పెద్ద ఎత్తున ప్రశ్నలు లేవనెత్తిన నేపథ్యంలో, ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రధాని మోదీ దిమాగీ నక్సల్స్ అంటూ విమర్శకులను ముద్ర వేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమైన వైఖరి అని అన్నారు. ఉద్యోగం కావాలి అని అడిగే యువకుడు దిమాగీ నక్సల్ కాదు, పేపర్ లీక్ ఎందుకు? అని ప్రశ్నించే విద్యార్థి దేశద్రోహి కాదు, నా భవిష్యత్తు ఏమిటి? అని నిలదీసే జెన్ జీని అణచివేయలేరు అని వారు అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ 1947 స్వాతంత్ర్య పోరాటాన్ని నేటి తరం చూడకపోవచ్చు,పాల్గొనకపోవచ్చు కానీ 2026 సంవత్సరంలో దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పోరాటం మరో స్వాతంత్ర్య పోరాటాన్ని తలపించిందని, 56 అంగుళాల ఛాతీతో 12 సంవత్సరాలుగా విశ్వగురువు అని విర్రవీగిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఒక్కసారిగా విద్యార్థులు, యువత పోరాటానికి దిగివచ్చారని ఇది 60కోట్ల యువత ఆక్రందన పోరాటం ఉద్యమ విజయమన్నారు. ఈ బహిరంగ సభలో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ నానబాల రామకృష్ణ, లింగం రవి, తీర్పారీ వెంకటేశ్వర్లు,కునుకుంట్ల శంకర్ , టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, యుగంధర్, చేపూరి కొండల్, సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్ద శ్రీనివాస్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు బొలగానీ సత్యనారాయణ, చెడే చంద్రయ్య, సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు గోద శ్రీరాములు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, కొల్లూరి రాజయ్య,ఉప్పల ముత్యాలు,కుసుమని హరిచంద్ర, ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎండి నహీం, ఆఫీస్ బేరర్స్ బద్దుల శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, బెల్లి శ్రీకాంత్, సుద్దాల సాయికుమార్, సునీల్ కుమార్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి కౌన్సిలర్ బబ్బూరి శ్రీధర్, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ మెంబర్ పేరబోయిన పెంటయ్య, బంగారు, గోపగాని రాజు, ప్రణయ్, కంబాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



## భారీ యువజన ప్రదర్శన

ఎఐవైఎఫ్ 3వ రాష్ట్ర మహాసభల సందర్భంగా యాదగిరిగుట్ట లోని లక్ష్మీ నర్సింహా ఫంక్షన్ హాల్ నుండి బస్టాండ వరకు భారీ ఎత్తున యువజన ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్య, వైద్య, ఉపాధి హక్కుల సాధనకై పోరాడుదామని, ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాలు నినదించారు. బహిరంగ సభలో ఎఐవైఎఫ్ యాదాద్రి జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ స్వాగతం పలకగా, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ బహిరంగ సభకు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ యువజన ప్రదర్శన, బహిరంగ సభకు రాష్ట్రం నలుమూలాల నుండి వేలాది మంది యువజన కార్యకర్తలు పాల్గొన్నారు.

## దురుసు ప్రవర్తన

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోలేదన్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే వారిపైనే కేసులు నమోదు చేశారని తెలిపారు. మంగళవారం ఉదయం శాసన సభ ప్రారంభమైన వెంటనే హరీశ్ రావు మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ 'కౌరవ సభ'గా మారిందని, రేవంత్ రెడ్డి కలియుగ దుశ్శాసనుడిలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. స్పీకర్ పదవి పట్ల తమకు పూర్తి గౌరవం ఉందన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయలేదని, ఒక వేళ అలా భావించి ఉంటే వాటిని వెనక్కి తీసుకుంటూ తాతా మధు ఇప్పటికే క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. సభ్యుడు విచారం వ్యక్తం చేసిన తర్వాత కూడా అరెస్టు చేయడం సరైంది కాదని హరీశ్ రావు అన్నారు. ఒకే తప్పుకు ఎన్ని శిక్షలు విధిస్తారని ఆయన ప్రశ్నించారు.

## తెలంగాణ బియ్యం

(మొదటి పేజీ తరువాయి)

సామర్థ్యంతోపాటు ఆధునిక రైస్ మిల్లింగ్ వ్యవస్థ రాష్ట్రానికి ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరించారు..దీంతో తెలంగాణ నుంచి బియ్యం దిగుమతి చేసుకునే ప్రతిపాదనపై ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి లారెల్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ నుంచి మరింత పెద్ద పరిమాణంలో బియ్యం కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన తెలిపారు. ఇందు కోసం ఫిలిప్పీన్స్ ప్రభుత్వ సంస్థలు, గుర్తింపు పొందిన దిగుమతిదారులు, భారతీయ ఎగుమతి దారులు, తెలంగాణ రైస్ మిల్లర్ల మధ్య సమన్వయం అవసరమని ఇరువురు అభిప్రాయపడ్డారు. బియ్యం రకాలు, ధరలు, నాణ్యతా ప్రమాణాలు, కొనుగోలు విధానం, రవాణా, ధృవీకరణ ప్రక్రియలతోపాటు శానిటరీ, ఫైటోశానిటరీ నిబంధనలపైనా సమావేశంలో చర్చించారు. అదేవిధంగా తెలంగాణ నుంచి మాంస ఉత్పత్తులు, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయడంపైనా ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆసక్తి వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలంగాణకు విత్తనోత్పత్తి, ఆహార శుద్ధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో బలమైన సామర్థ్యం ఉందన్నారు. తెలంగాణ రైతులు, వ్యవసాయ పరిశ్రమలకు స్థిరమైన, లాభదాయకమైన అంతర్జాతీయ మార్కెట్లను సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బియ్యం, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులను ఫిలిప్పీన్స్‌కు దీర్ఘ కాలం విశ్వసనీయంగా సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక నైపుణ్యం తెలంగాణకు ఉన్నాయని ఉత్తమ్ తెలిపారు. ఈ సందర్భంగాడిసెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు హాజరు కావాల్సిందిగా లారెల్‌కు ఉత్తమ్ ప్రత్యేక ఆహ్వానం అందించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com